

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 190 | మంగళవారం | 10-06-2025 | ఖమ్మం   Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**   పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## బస్‌పాస్ చార్జీలు పెంపు

టిజిఎస్ ఆర్‌టిసి బస్ పాస్ ఛార్జీల ధరలను పెంచింది. సోమవారం నుంచి కొత్త బస్‌పాస్ ధరలు అమల్లోకి వచ్చాయి. సాధారణ ప్రజల తీసుకునే బస్ పాసులతో పాటు, స్టూడెంట్ పాస్ ధరలను కూడా ఆర్‌టిసి పెంచింది. 20 శాతం పైగా బస్ పాస్ ధరలను పెంచింది. రూ.1150గా ఉన్న ఆర్డినరీ పాస్ ధర పెంపు తర్వాత రూ.1400కు చేరింది. రూ.1300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ రూ.1600లకు చేరింది. రూ.1450లుగా ఉన్న మెట్రో డీలక్స్ పాస్ రూ.1800లైంది. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఎసి పాస్ ధరలను ఆర్‌టిసి పెంచింది.

## సాంకేతిక అంశాలు ఇంజనీర్లకే తెలుసు

- కేవలం పరిపాలనాపరమైన నిర్ణయాలు మాత్రమే మంత్రివర్గం తీసుకుంది
- మహారాష్ట్ర, సిడబ్ల్యుసి అభ్యంతరాల మేరకే ప్రాజెక్టును మార్చాం
- జస్టిస్ పిసి ఘోష్ విచారణ కమిటీ ప్రశ్నలకు మాజీ మంత్రి హరీష్‌రావు సమాధానాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి విధానపరమైన అన్ని నిర్ణయాలు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదంతోనే చేపట్టామని మాజీ నీటి పారుదలశాఖ మంత్రి టి.హరీష్‌రావు జస్టిస్ పి.సి. ఘోష్ విచారణ కమిటీకి తెలిపారు. సాంకేతిక అంశాలు ఇంజనీర్ అధికారులకు మాత్రమే తెలుసని, తాము కేవలం పరిపాలనపరమైన నిర్ణయాలు మాత్రమే తీసుకున్నామని వివరించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని 'కాళేశ్వరం కమిషన్' కార్యాలయంలో జస్టిస్ పిసిఘోష్ విచారణ కమిషన్ ముందు హరీశ్‌రావు సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ పిసి ఘోష్ అడిగిన పలు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానమిచ్చారు. మొత్తం 16 ప్రశ్నలకు హరీష్‌రావు నుంచి కమిషన్ సమాధానాలను రాబట్టి, ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేసింది. ముందుగా నీటి పారుదల తరువాయి 2లో

## ఎవరు చెబితే ట్యాప్ చేశారు?

- కుట్రదారులు ఎవరు.. పాత్రధారులు ఎవరు..
- ఎవరి ఆదేశాల మేరకు హార్డ్‌డిస్క్‌లను మాయం చేశారు..
- ప్రభాకర్‌రావును 8 గంటలు ప్రశ్నించిన సిట్ అధికారులు
- పై అధికారుల ఆదేశాలతోనే చేశానని వెల్లడి?
- రేపు మళ్లీ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాజకీయాలను షేక్ చేసిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్‌ఐబి) మాజీ చీఫ్ ఐజి టి. ప్రభాకర్ రావును సిట్ సోమవారం విచారించింది.ఏడాదికిపైగా పరారీలో ఉన్న ప్రభాకర్‌రావు అమెరికా నుంచి ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 11:20 గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో సిట్ అధికారుల ముందు ప్రభాకర్‌రావు విచారణకు హాజరయ్యారు. రాత్రి 7:35 గంటల (8 గంటల పాటు) వరకు వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్ నేతృత్వంలో జూబ్లీహిల్స్ ఎసిపి పి. వెంకటగిరి సహా ఐదుగురు సభ్యుల బృందం ప్రభాకర్ రావును విచారించింది. సిట్ బృందం అతనిపై ప్రశ్నల వర్షం కురిపించారు. తిరిగి బుధవారం విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు ప్రభాకర్‌రావుకు నోటీసులు తరువాయి 2లో

## భారత్ గౌరవాన్ని అమెరికాకు మోదీ తాకట్టు

**సిఆర్ జయంతి సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి బినోయ్ విశ్వం**





- ప్రధాని వైఖరిపై అసంతృప్తిలో భారతీయులు
- 75 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం స్వరాజ్యం ఎక్కడ?

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ దేశాలపై సుంకాల పేరుతో అమెరికా అధ్యక్షులు ట్రంప్ చేస్తున్న దాడిని అన్ని దేశాలు తిరస్కరిస్తున్నాయని, తిరస్కరించని ఏకైక దేశం భారతదేశం మాత్రమేనని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి బొనోయ్ విశ్వం విమర్శించారు. అమెరికాకు భారత దేశ గౌరవాన్ని ప్రధాని మోదీ తాకట్టు పెట్టారని, ప్రధాని మోదీ అనుసరించిన ఈ వైఖరి పట్ల దేశ ప్రజలు తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.మనిషికి, మానవత్వానికి, సమానత్వానికి, ప్రజాస్వామ్యానికి విలువను ఇచ్చే వామపక్షాలు ఒక వైపు ఉండగా, మరోవైపు ప్రజాస్వామ్యాన్ని , మతాన్ని దుర్వినియోగం చేసి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ఫాసిస్టు శక్తులు ఉన్నాయని, ఈ రెండింటికి మధ్య సామరస్యం, ఏకీభావం కుదరడం అసాధ్యమన్నారు. సిపిఐ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి సభ హైదరాబాద్ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో సోమవారం జరిగింది. సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా బినోయ్ విశ్వం, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి.నరసింహా రెడ్డి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట రెడ్డిలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సభలో బినోయ్ విశ్వం ప్రసంగిస్తూ అమెరికాలో రాజకీయాలలో కార్పొరేట్ శక్తులు రాజ్యమేలుతున్నాయని, ప్రపంచ రాజకీయాలు ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తున్నాయని విమర్శించారు. వలసలు, అక్రమ కార్మికుల పేరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులను నేరస్తుల మాదిరిగా మిలిటరీ విమానాల్లో కుక్కి, కాళ్లకు బేడీలు వేసి 40 గంటలు ప్రయాణం చేయించి ఇక్కడ వదిలి పెట్టినా 56 ఇంచుల చాతి కలిగిన ప్రధాని మోదీ ఒక బానిస మాదిరిగా నోరు విప్పకపోవడం అన్యాయమన్నారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో గాంధీజీ నినదించిన 'స్వరాజ్యం' అంటే ప్రజలందరికీ కూడు, గుడ్డ, నీడ అని, స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ళ ల తరువాత కూడా స్వరాజ్యం ఎక్కడుందని తరువాయి 2లో

### పేదరికం తగ్గిందనడం హాస్యాస్పదం : ప్రొ.నరసింహారెడ్డి



ఆర్థికవేత్త ప్రొఫెసర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో పేదరికం తగ్గిందని ప్రపంచ బ్యాంకు పేర్కొనడం హాస్యాస్పదమని, ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా పేదరికాన్ని అంచ నా వేయడం తగదన్నారు. దేశంలో ప్రజలు ఇంకా నిరుద్యోగం, విద్య, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పిరు. ఒక వేళ ప్రపంచ బ్యాంకు పేర్కొన్నట్లు దేశంలో పేదరికం తగ్గితే ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి సదుపాయాలు ఎందుకు లభించడంలేదని ప్రశ్నించారు. భారతదేశం జిడిపి వృద్ధిలో జపాన్‌ను దాటిపోయిందని చెబుతున్న ప్రధాని మరి తలసరి ఆదాయంలో ప్రపంచంలో భారత్ 136వ స్థానంలో ఎందుకు ఉందని ఆయన నిలదీశారు. దేశంలో నిరుద్యోగం ఇంకా 6 శాతం నిరుద్యోగం ఉందని, అందులోనూ నిరుద్యోగ యువత అధికంగా ఉందన్నారు. 'ట్రికిల్ డౌన్' సిద్ధాంతం ప్రకారం దేశ ఉత్పత్తి, ఆదాయంలో సమాజంలోని కిందిస్థాయి వర్గాలకు రావాల్సిన వాటా రావడంలేదని, పైగా క్రమంగా సంపన్న వర్గాలకు లబ్ధి పెరుగుతున్నదని, కింది స్థాయి వారికి లబ్ధి తగ్గుతున్నదని, ఇది దేశ సంక్షేమానికి, పురోగతికి మంచిదికాదన్నారు. దేశంలో పది శాతం చేతిలో 64 శాతం సంపద వెళ్తుండగా, 90 శాతం ఉన్న ప్రజలకు 36 శాతమే చేరుతుందన్నారు.

## శాఖల కేటాయింపుపై తీవ్ర ఉత్కంఠ

- మంత్రులకు శాఖలను పునర్ వ్యవస్థీకరించే విషయంపై అధిష్ఠానంతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చలు
- భట్టి విక్రమార్కకు హోం శాఖ కేటాయించే అవకాశం


ప్రజాపక్షం /హైదరాబాద్



రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ పాక్షిక విస్తరణ పూర్తయిన తర్వాత ఇప్పుడు అందిరి దృష్టి శాఖల కేటాయింపుపై కేంద్రీకృతమైంది. ఈ విషయంపై పార్టీ అధిష్టానంతో చర్చించడానికి సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీ వెళ్ళారు. మొత్తం మంత్రుల శాఖలను పునర్ వ్యవస్థీకరించే విషయంపై కూడా పార్టీ అధిష్టానంతో సిఎం చర్చిస్తారని అంటున్నారు. పూర్తిస్థాయి మంత్రివర్గం లేకపోవడంతో హోమ్, మునిసిపల్, విద్య తదితర అనేక ముఖ్య శాఖలు సిఎం రేవంత్ రెడ్డి తన వద్దనే ఉంచుకున్నారు. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు సమయంలో మంత్రుల శాఖల్లో పెద్ద సంఖ్యలో మార్పులు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ఆర్థిక, పౌర సరఫరాల శాఖల మంత్రుల మార్పుపై సిఎం హైకమాండ్‌తో చర్చిస్తారని చెబుతున్నారు. మున్సిపాలిటీ, విద్య, ఇతర శాఖల కేటాయింపుపై చర్చ జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ముఖ్యమైన హోం శాఖను ఇవ్వవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుకు ప్రస్తుత ఐటి, పరిశ్రమ శాఖలతో పాటు మరికొన్ని శాఖలు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలను ఖచ్చితంగా నిర్వహించాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలువురు మంత్రులు అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ విషయాన్ని కూడా ఎఐసిసి అగ్ర నేతలతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశం ఉంది. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కార్పోరేషన్ల చైర్మన్ పదవులను ఇచ్చి స్థినిక సంస్థల ఎన్నికలకు వెళ్ళాలని తద్వారా పదవులు తరువాయి 2లో

## కూనంనేనిపై ఎన్నికల పిటిషన్ కొట్టివేత

### న్యాయం గెలిచింది : సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. శాసనసభకు 2023లో జరిగిన ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు కూనంనేని అఫిడవిట్ దాఖలు చేయలేదని కొత్తగూడెం పట్టణానికి చెందిన నందూలాల్ పిటిషన్ దాఖలు చేశారు.. కూనంనేని ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు చెప్పాలని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. అవసరమైన సమాచారా న్ని అం దించడంలో కూనంనేని విఫలమయ్యారని, ముఖ్య సమాచారాన్ని గోప్యంగా ఉంచారని, ఎన్నికల నిర్వహణ నియమాలను పాటించకుండా తప్పుడు ఫారమ్–26 అఫిడవిట్ సమర్పించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధ్య చట్టం 1951 కింద జైలు శిక్ష, జరిమానా విధించాలని, ఎమ్మెల్యేగా ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కూడా కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతున్నప్పుడే నందూలాల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కూనంనేని దాఖలు చేసిన వ్యాజ్యాన్ని గతంలో కొట్టివేసింది. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో నందూలాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తి చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం తీర్పు వెలువరించారు. నందూలాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు. తగిన ఆధారాలు లేకుండా నందూలాల్ పిటిషన్ దాఖలు చేశారని తప్పుపట్టారు. సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన తీర్పులను ఉదహరించారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి విజయాన్ని తేలికగా తీసుకుని, ఆ ఎన్నికపై జోక్యం చేసుకోకూడదని చెప్పారు. ఎన్నికపై జోక్యం చేసుకోవాలనే ఎలక్షన్ పిటిషన్ చట్టానికి అనుగుణంగా ఉండాలని, అయితే, నందూలాల్ పిటిషన్ అందుకు తరువాయి 2లో

### పిటిషన్ చట్ట వ్యతిరేకం

**తీర్పులో హైకోర్టు వ్యాఖ్యలు**

'కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్ చట్ట వ్యతిరేకం. అన్ని దశలోను ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ఉండాలన్న విషయమూ అంతే. ఇలా జరిగితేనే ప్రజస్వామ్యం. ఎన్నికల పిటిషన్‌లో కీలకమైన ఆధారాలుంటే తప్ప ప్రజలు ఇచ్చిన తీర్పులో కోర్టులు జోక్యం చేసుకోలేవు' అని తీర్పు ప్రతిలో హైకోర్టు వ్యాఖ్యనించింది. 'కూనంనేని నామినేషన్ దాఖలు సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య పేరు గు రించి చెప్పలేదని చెప్పి ఆయన ఎన్నిక చెల్లదని కోరడమేమిటి? భార్య పేరు రాయకపోతే, కూనంనేని ఎన్నిక చెల్లకుండా పోతుందా? భార్యకు చెందిన అయిదేళ్ల ఆదాయ పు పన్ను రిటర్నులు, ఆస్తులు, అప్పుల తరువాయి 2లో



### భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర రేపు

**ఫ్లోరిడా:** భారత అంతరిక్షయాన చరిత్రలో మరో కొత్త అధ్యయనం బుధవారం ఆవిష్కారం కానుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి శుభాంశు శుక్లా ఆక్సియమ్ మిషన్ 4 ద్వారా అంతరిక్ష యాత్రకు కౌంట్‌డౌన్ మొదలైం ది. రాకేశ్ శర్మ తర్వాత ఒక భారతీయుడు అంతరిక్షంతలోకి వెళ్లడం ఇదే మొ దటిసారి. అంతేకాగ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లోకి అడుగుపెట్టనున్న తొలి భారతీయుడుగా శుక్లా చరిత్ర సృష్టించనున్నాడు. ఐఎస్‌ఎ స్ వైపు సాగే నాలుగో ప్రైవేటు వ్యోమగామి యాత్ర ఆక్సియమ్ మిషన్ 4 కేవ లం ఒక అంతరిక్ష యాత్ర కాదు. ఇది ప్రపంచ దేశాల సహకారాన్ని, అంతరిక్ష వ్యాపారంలో దూసుకుపోతున్న అభివృద్ధిని ప్రతిబింబించే చారిత్రక ఘ ట్టం. ఆక్సియమ్ స్పేస్, స్పేస్‌ఎక్స్, నాసా వంటి గొప్ప సంస్థల భాగస్వామ్యం తో జరుగుతున్న ఈ యాత్ర అంతరిక్షాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడమేగాక, ఈ ఉత్సాహభరితమైన రంగంలో భారతదేశం సాధిస్తున్న అద్భుత ప్రగతిని, భవిష్యత్ ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెబుతోంది. భారత కాలమానం ప్రకారం, జూన్ 10న జరగాల్సిన ప్రయోగం ఒకరోజు వాయిదాపడి, జూన్ 11తేదీ, బుధవారం జరగనుంది. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్, స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక (క్రూ డ్రాగన్ సి213)ను నింగిలోకి మోసుకెళ్తుంది. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఈ అంతరిక్ష నౌక సుమా రు 28 గంటల పాటు కక్ష్యలో ప్రయాణించి తరువాయి 12లో

## అత్యంత వేగంగా భారత్ అభివృద్ధి



**11 ఏళ్లుగా సుపరిపాలన, సామాజిక ఉన్నతే లక్ష్యంగా పాలిస్తున్నాం**
**ప్రధాని నరేంద్ర మోదీ**

**న్యూఢిల్లీ :** ఎన్‌డిఎ 11 ఏళ్ల పాలనలో భారత దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అవతరించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో ప్రపంచ గళంగానూ మారిందని పేర్కొన్నారు. తన నేతృత్వంలోని మూడోవిడత ఎన్‌డిఎ ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. సుపరిపాలన, పరివర్తనపై పూర్తిస్థాయిలో దృష్టిసారించామని ప్రధాని మోదీ అన్నారు. సామాజిక న్యాయానికి సైతం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తుచేసిన ప్రధాని మోదీ, తమ మంత్రి మండలిలో 60 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల వారే ఉన్నట్లు తెలిపారు. ఈ స్థాయిలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు మంత్రి పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఎన్‌డిఎ 11 ఏళ్ల ప్రస్థానంలో ఆర్థిక వృద్ధి నుంచి తరువాయి 2లో

## అన్నింటా వైఫల్యం... వ్యవస్థల విధ్వంసం

- ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక నిర్మాణానికి తీవ్ర దెబ్బ
- 11 ఏళ్ల మోదీ సర్కారు పాలనపై కాంగ్రెస్ మండిపాటు
- రాజ్యాంగ ప్రతులపై నియంతృత్వ సిరా: మల్లికార్జున ఖర్గే
- ప్రచారానికే పరిమితం: రాహుల్



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారం చేపట్టి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఈ 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థను భారీగా దెబ్బతీసిందని మండిపడింది. ఈ ప్రభుత్వ రాజ్యాంగంలోని ప్రతి పేజీలో నియంతృత్వం సిరాను మాత్రమే అద్దిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రతి రాజ్యాంగ సంస్థను బలహీనపరిచాయని, వాటి స్వయం ప్రతిపత్తిపై దాడి చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయానికి తరువాయి 2లో



**పోలీస్ వాహనం పేల్చివేత** 05

- ఎఎస్‌పి మృతి, సిఐ,ఎస్‌ఐకి తీవ్రగాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం

## సన్న బియ్యం కష్టాలు

- రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- మొరాయిస్తున్న ఇ-పాస్ యంత్రాలు
- బియ్యం పంపిణీలో తీవ్ర ఇబ్బందులు



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభం కాగా కొద్ది రోజులుగా లబ్ధిదారులకు రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇ పాస్ యంత్రాలు మొరాయిస్తుండటంతో పంపిణీలో ఆలస్యం అవుతోంది. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. రేషన్ డీలర్లు చేసేదేమీ లేక రేపు, మాపు రమ్మని చెబుతున్నారు. గంటల తరబడి నిలబడలేక ఓపిక నశించి కొందరు బియ్యం తీసుకోకుండానే వెళ్లిపోతున్నారు. మరికొందరు ఒకటి, రెండు రోజులు ఆగి తిరిగి వస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌తో తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## స్వదేశానికి చేరుకున్న బంగ్లా మాజీ అధ్యక్షుడు



ఢాకా : బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ సోమవారం స్వదేశానికి తిరిగి వచ్చారు. 81 సంవత్సరాల హమీద్ అనారోగ్య కారణంగా విదేశాలకు వెళ్లి, చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి వచ్చినట్టు అధికారులు ప్రకటించారు. పదవీత్యుతురాలైన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు హమీద్ రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా వ్యవహరించారు. థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం తెల్లవారు ఝామున ఆయన ఢాకా చేరుకున్నారని హజ్రత్ షాజలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (హెచ్‌ఎస్‌ఐఎ) అధికారులు ప్రకటించారు. సాధారణ ప్రయాణికుల మాదిరిగానే ఆయన కూడా విమానాశ్రయానికి చేరుకున్నారని తెలిపారు. ఆయన ఎయిర్‌పోర్ట్ నుంచి కారులో వెళ్లినట్టు సిసి ఫుటేజీల్లో కనిపిస్తున్నది. అయితే, హమీద్ ఎక్కడికి వెళ్లారన్న విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## లాస్ ఏంజిలిస్‌లో ఉద్రిక్త పరిస్థితులు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వివిధ నిర్ణయాలు, చేస్తున్న చట్టాలు వివాదాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఆయన నిర్ణయాలను, ప్రత్యేకించి ఇమ్మిగ్రేషన్ నిబంధనలను వ్యతిరేకిస్తూ లాస్ ఏంజిలిస్‌లో వేలాది మంది ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. శాంతియుతమైన ప్రదర్శనలను కూడా భరించలేకపోతున్న ట్రంప్ ఏకంగా నేషనల్ గార్డ్ బలగాలను రంగంలోకి దింపడంతో, ఆందోళనకారులు రెచ్చిపోయారు. పలు ప్రాంతాల్లో పోలీసులు లాఠీఛార్జి చేశారని, బాష్పవాయును ప్రయోగించారని ఆరోపణలు ఉన్నాయి. కాగా, ఆందోళనకారులు హింసాకాండ సృష్టించారని పోలీస్ అధికారులు అంటున్నారు. కొన్ని చోట్ల భద్రతా బలగాలపై రాళ్లు రువ్వారని, మరికొన్ని ప్రాంతాల్లో వాహనాలు దగ్ధం చేశారని ప్రకటించారు. పరిస్థితి అదుపులోనే ఉందని లాస్ ఏంజిలిస్ పోలీస్ చీఫ్ జిమ్ మెక్‌డొనాల్డ్ ప్రకటించారు. అయితే, అక్కడ ఇంకా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ నిబంధనలపై వ్యతిరేకత పెరుగుతున్న కారణంగా, లాస్ ఏంజిలిస్ మాదిరే మిగతా ప్రాంతాల్లోనూ ఆందోళనలు చెలరేగే ప్రమాదం కనిపిస్తున్నది.

## ఇజ్రాయెల్ క్రూరత్వం

### పాలస్తీనాకు మానవతా సాయం అడ్డంగింత

### సామాజిక కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ నిర్బంధం



జెరుసలేం : గాజా స్ట్రిప్‌లో అష్టకష్టాలు పడుతున్న పాలస్తీనియులపై ఇజ్రాయెల్ మరోసారి క్రూరత్వాన్ని ప్రదర్శించింది. వారికి అందాల్సిన మానవతా సాయాన్ని కూడా అడ్డుకుంది. అంతేగాక, స్వీడన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్‌ను నిర్బంధంలోకి తీసుకుంది. అంతర్జాతీయ మీడియా కథనాలను అనుసరించి, 2023 చివరిలో ఇజ్రాయెల్ మొదలు పెట్టిన యుద్ధం, చేస్తున్న దాడుల కారణంగా వేలాది మంది మృతి చెందగా, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. అక్కడి పరిస్థితులు అత్యంత దారుణంగా ఉందని, నిత్యావసరాలు కూడా లభించక ప్రజలు అల్లాడుతున్నారని ఐక్యరాజ్య సమితిసహా అంతర్జాతీయ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. గాజా స్ట్రిప్‌లోని సుమారు 20 లక్షల మంది ప్రజలకు తక్షణ సాయం అవసరమని పేర్కొంటున్నాయి. కాగా, ఒక వైపు జనావాసాలు, ఆసుపత్రులు, పాఠశాలలు అనే తేడా లేకుండా, అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా దాడులు చేస్తునే ఉంది. ఫలితంగా గాజాలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. కరవు తాండవిస్తున్నది. ఆహారం, మంచినీరు వంటి కనీస వసతులు కూడా లేక ప్రజలు అల్లాడుతున్నరు. మానవతా సాయం అందించడానికి ప్రపంచ దేశాలు, అంతర్జాయ సంస్థలు ముందుకు వస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటున్నది. టర్కీ మీదుగా గాజాకు వచ్చే దారులను దిగ్బంధనం చేసింది. హమాస్‌పై యుద్ధం పేరుతో మారణకాండ సృష్టిస్తున్న ఇజ్రాయెల్, అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిళ్ల కారణంగా కాల్పుల విరమణకు అంగీకరించింది. కానీ, అమలు చేయడం లేదు. పరిస్థితులు రోజురోజుకూ దిగజారిపోతున్న తరుణంలో, గాజా ప్రజలకు సాయం అందించడానికి బయలుదేరిన పడవలో 'ది ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కొయిలేషన్' సంస్థ ప్రతినిధులతోపాటు, గ్రెటా కూడా ఉంది. వీరిని అంతర్జాతీయ జలాల్లోనే చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైన్యం, ఒడ్డుకు తీసుకొచ్చిన తరాఇ్వత అరెస్టు చేసింది. వీరంతా మానవతా సాయం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. అందుకే, గాజాకు వెళ్లకుండా అడ్డుకొని, తిరిగి వెనక్కు పంపుతున్నట్టు సైన్యం ప్రకటించింది.

కాగా, ఈ ఘటనపై అంతర్జాతీయ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం కూడా అందకుండా అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నది.

## ఇంజనీర్లకు తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రిగా ఎప్పటి నుంచి ఎప్పటి వరకు పని చేశారని హరీష్ రావును కమిషన్ ప్రశ్నించగా, తాను తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుంచి 2018 నవంబర్ 20 తేదీ వరకు ఇరిగేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించానని హరీష్‌రావు తెలిపారు. తమ్మిడిహట్టి వద్ద ప్రతిపాదించిన పనులు మొదలు పెట్టిన తర్వాత ఈ ప్రాజెక్టును ఎందుకు మార్చాల్సి వచ్చిందని కమిషన్ ప్రశ్నించగా, అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడి హట్టి వద్ద రెండు ప్రాజెక్టులను ప్రతిపాదించిందని, బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత పేరుతో కేవలం ఆదిలాబాద్ జిల్లాకు మాత్రమే పరిమితమైయ్యే ఒక్క ప్రాజెక్టు, ప్రాణహిత – చేవెళ్ల పేరుతో మారు ప్రాజెక్టు చేపట్టిందని హరీశ్‌రావు వివరించారు. ప్రాణాహిత ప్రాజెక్టు ఏడు ప్యాకేజీలు 27 భాగాలుగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించినప్పటికీ ప్రాజెక్ట్ పనులు చేపట్టకుండా కేవలం కాల్వలు, ఇతర పనులు చేపట్టారని, మరోవైపు 152 మీటర్ల ఎత్తు బ్యారేజీ నిర్మాణం చేపట్టడం వల్ల మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, మహారాష్ట్రలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ అనుమతులు సాధించడంలో విఫలమైయ్యారని తెలిపారు. 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తుమ్మిడిహట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశామని, అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హాసన్ ముష్రఫ్‌ను కలిసి విన్నవించగా, సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారన్నారు. ఆ తర్వాత మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వ అధికారంలో వచ్చిందని, దీంతో అప్పటి మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో నాటి తెలంగాణ సిఎం కె.చంద్రశేఖరరావు సమావేశమైన ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని అభ్యర్తించారని, అయినా ఆ ప్రభుత్వం అంగీకరించలేదని హరీశ్‌రావు వివరించారు. ప్రాణహిత చేవెళ్ల పేరుతో ప్రతిపాదించిన తుమ్మిట్టి హట్టి వద్ద సరిపోను నీటి లభ్యత లేదని, ప్రత్యామ్నయ మార్గాలను అన్వేషించుకోవాలని కేంద్ర జల వనరుల సంఘం (సిడబ్ల్యుసి) నివేదికతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర అభ్యంతరం మేరకే ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చినట్టు హరీష్‌రావు కమిషన్‌కు వివరించారు. ఈ క్రమంలోనే మాజీ సిఎం కె.చంద్రశేఖరరావు బ్యారేజి నిర్మాణానికి సంబంధించి స్థలం ఎంపిక చేయాలని సిడబ్ల్యుసి అంతర్భాగమైన వ్యాప్కోస్ కోరడం, సదరు సంస్థ లాడర్ సర్వే నిర్వహించి ఇక్కడ 240 టిఎంసిల నీటి లభ్యత ఉందని, ప్రాజెక్టు నిర్మించుకోవచ్చని ప్రతిపాదించడంతోనే అక్కడ ప్రాజెక్ట్‌ను నిర్మించాలని నిర్ణయిచినట్టు వివరించారు. కాగా అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం ఎపి ప్రభుత్వానికి రాసిన లేఖలతో పాటు సిడబ్యుసి, వ్యాప్కోక్స్ ఇచ్చిన నివేదికను కమిషన్‌కు హరీశ్‌రావు సమర్పించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోకేషన్ ఎందుకు మార్చాల్సి వచ్చిందన్న కమిషన్ ప్రశ్న హరీశ్‌రావు సమాధానమిస్తూ అది పూర్తిగా సాంకేతికపరమైన నిర్ణయమని, ఇంజనీర్ల టెయిల్ సర్వే ఆధారంగా బ్యారేజ్ లోకేషన్ మారిందని, ఇది పూర్తిగా ఇంజనీరింగ్ విభాగం తీసుకున్న నిర్ణయమని తెలిపారు. గతంలో నాగార్జున సాగర్, కాంతనపల్లి, ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి కూడా లోకేషన్ మార్చారని ఉదాహరించారు. ఈ ప్రాజెక్టులో రిజర్వాయర్లకు కెపాసిటీ ఎంత అని కమిషన్ అడిగిన ప్రశ్నకు 141 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించామని హరీష్‌రావు బదులిచ్చారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు అనుమతి ఉందా ? అని జస్టిస్ పిసిఘోష్ ప్రశ్నించారు. దీనికి హరీశ్‌రావు సమాధానమిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతోనే కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని,రాష్ట్ర ప్రభుత్వ పూర్తి గ్యారంటీతోనే ఈ కార్పొరేషన్ ద్వారా జాతీయ బ్యాంకుల నుంచే రుణాలు పొందామని తెలిపారు. హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు 35 టిఎంసిలు, పారిశ్రామిక అవసరాలకు మరో 15 టిఎంసిలు కేటాయించామని తద్వారా వచ్చే ఆదాయంతో రుణాలు చెల్లించేలా రూపకల్పన చేశామని తెలిపారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత వరకు రుణాలను సక్రమంగా చెల్లిస్తు వచ్చామన్నారు.

ప్రాజెక్టులో నీటి నిల్వలకు సంబంధించి ఏమైనా అదేశాలు ఇచ్చారా? అని కమిషన్ ప్రశ్నించగా, సాంకేతిక పరమైన అంశాలకు సంబంధించి పూర్తి నిర్ణయాలు ఇంజనీరింగ్ అధికారులే తీసుకుంటారని హరీష్ రావు సమాధామిచ్చారు.

## భారత్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక అభ్యున్నతి వర కూ ప్రజల కేంద్రంగానే పాలన సాగించినట్లు మోదీ వివరించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా తాము ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు.

**స్వర్ణ యుగం! : హోంమంత్రి అమిత్‌షా**

మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాల ప్రజాసేవ పట్ల సంకల్పం, కృషి, అంకిత భావాలకు ఒక 'స్వర్ణ యుగం' అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ పాలనలో భారత్ అభివృద్ధి, స్వావలన వైపు వేగంగా పురోగమిస్తోందని ఆయన అన్నారు. దేశ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం ద్వారా భారతదేశాన్ని ప్రతి రంగంలోనూ నంబర్ వన్‌గా మార్చే ప్రయాణం కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు. 'నాయకత్వం స్పష్టంగా ఉన్నప్పుడు, సంకల్పం దృఢంగా ఉన్నప్పుడు, ప్రజాసేవ చేయాలనే ఉద్దేశం ఉన్నప్పుడు సేవ, భద్రత, సుపరిపాలనలో కొత్త రికార్డులు సృష్టించబడతాని మోదీ ప్రభుత్వం నిరూపించింది' అని అమిత్‌షా పేర్కొన్నారు. '2014లో ప్రధానిగా మోదీ దేశ పగ్గాలు చేపట్టినప్పుడు భారత్ విధానపరంగా అచేతనంగా ఉంది. గత ప్రభుత్వాలకు విధానాలు లేవు, నాయకత్వం లేదు. మోసాలు తారస్థాయికి చెరుకున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. పాలనా వ్యవస్థ దిశానిర్దేశం లేకుండా ఉండేది. కానీ గత 11 ఏళ్లలో 'కనీస ప్రభుత్వం, గరిష్ఠ పాలన' ద్వారా దేశ అభివృద్ధి వేగం, స్థాయి రెండూ మారాయి' అని అమిత్ షా అన్నారు. 'మోదీ రైతులు, మహిళలు, వెనుకబడినవారు, దళితులు, అణగారిన వర్గాలను పాలనలో భాగం చేశారు. బుజ్జగింపులకు బదులుగా సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే పని సంస్కృతిని సృష్టించారు' అని అమిత్ షా పేర్కొన్నారు. 'మోదీ జాతీయ భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలో నక్సలిజం చివరి దశలో ఉంది. జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంది. భారత్ ఇప్పుడు ఉగ్రవాదుల స్థావరాల్లోకి చొరబడి వారిని అంతమొందిస్తోంది. ఇది మోదీ ప్రభుత్వ హయాంలో మారుతున్న భారత చిత్రాన్ని చూపిస్తోంది' అని అమిత్ షా అన్నారు.

**పేదల సంక్షేమం కోసం! : నడ్డా**

సుపరిపాలన, పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించపడుతుందని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ సవరణ బిల్లు, మహిళా బిల్లు, పెద్ద నోట్ల రద్దు ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలని తెలిపారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లైనా సందర్భంగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు గురించి నడ్డా వివరించారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే మంత్రంతో గత 11 ఏళ్లుగా ముందుకు సాగుతున్నామని నడ్డా తెలిపారు. ఇక నుంచి ఉగ్ర దాడులను యుద్ధంగానే భావిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని నడ్డా గుర్తు చేశారు.

## మోదీ తాకట్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ప్రశ్నించే పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రధాని మోదీ నినదిస్తున్న 'సబ్ కా సాత్ – సబ్ కా వికాస్' పూర్తిగా బూటకమని అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు, రానున్న జాతీయ, అంతర్జాతీయ మార్పులు, కూర్పులను వామపక్షాలు నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక సవాళ్లు ఉన్నాయని, ఫాసిజం ఎత్తుగడలో భాగంగా మతోన్మాదం పేరుతో ప్రజలను చీల్చి రెండు వర్గాలనూ దోచుకునే ఎత్తుగడ కొనసాగుతోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థను, లౌకిక విధానాలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారని బినోయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఆర్ స్ఫూర్తితో కేరళలో ఎల్‌డిఎఫ్ 1980 సంవత్సరంలో మొట్టమొదటిసారి, సిపిఐ, సిపిఐ(ఎం) రెండు పార్టీలు కలిసి కేరళలో ఉమ్మడిగా పోరాటానికి సిద్ధపడ్డాయని, నాటి అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు, నంబూద్రిపాద్ చేసే ఉపన్యాసాలు వినేందుకు కేరళ రాష్ట్ర ప్రజలు తండోపతండాలుగా వచ్చారని, కమ్యూనిస్టుల ఐక్యత, భవిష్యత్‌పై వారు నూతన దిశను, దశను సూచించారని బినోయ్ విశ్వం గుర్తు చేశారు. 1969 నుంచి 1979 వరకు కాంగ్రెస్ పార్టీతో సిపిఐ కలిసి పనిచేసిందని, ఆ తర్వాత 1979లో వామపక్షాల ఐక్యతను దృష్టిలో పెట్టుకుని సిపిఐ, సిపిఐ(ఎం) కలిసి దేశ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయాలనే సంకల్పంతో చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ముందుకెళ్లామని వివరించారు. చంద్ర రాజేశ్వర రావు ప్రసంగాలు, సైద్ధాంతిక కృషి నేటి తరం కమ్యూనిస్టులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. సిద్ధాంతాన్ని పునర్ నిర్వచించుకోవడం ద్వారా దీనిని నమ్మి, అర్థం చేసుకుని ప్రజల వద్దకు తీసుకెళ్లి, ప్రజలతో కలిసి కార్యాచరణకు పూనుకోవాలని, వామపక్షాలన్నీ కలిసి ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తొలుత సిఆర్ ఫౌండేషన్ ప్రాంగణంలో ఉన్న సిఆర్ విగ్రహానికి బొనోయ్ విశ్వం, తెలంగాణ సాయుధపోరాటయోధులు నీలం రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర రావు, పి.జె.చంద్రశేఖర రావు, కోశాధికారి వి.చెన్నకేశవరావు, సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని, నీలం రాజశేఖర రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ టి.సురేష్, సభ్యులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, పిప్రేమ్ పావని తదితరులు పాల్గొన్నారు.



## ట్యాప్ చేశారు..

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. విచారణలోని ప్రభాకర్‌రావు వెల్లడించిన అంశాలను సిట్ అధికారులు స్టేట్మెంట్లను రికార్డు చేశారు. విశ్వసనీయ కథనం మేరకు ప్రభాకర్‌రావును సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలు ఇలా ఉన్నాయి. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు..? ఈ కేసులో నిందితులైన ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్‌రావు, టివి ఛానల్ యజమాని శ్రవణ్‌రావుతో తరచు ఎందుకు భేటి అయ్యేవారు..? ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో నిందితుడు ప్రణీతరావును త్వరగా ప్రమోషన్ చేయాలని ఎవరు రికమెండ్ చేశారు..? శ్రవణ్ రావు ప్రైవేట్ వ్యక్తి అతనికి ఎస్‌ఐబితో సంబంధాలేంటి..? అని పోలీసులు ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు మాత్రం తన అఫిడవిట్‌లోని అంశాలనే తిరిగి చెబుతున్నట్లు తెలుస్తోంది. అసలు నాకు ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధమే లేదని.. ఆధారాలు ఉంటే చూపించాలని ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లనే ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో ఎస్‌ఐబి చీఫ్ గా పనిచేసిన సమయంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. ప్రభాకర్ రావు విచారణతో ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ బృందం భావిస్తోంది. గత ప్రభుత్వంలో ఎవరు చెబితే ట్యాపింగ్ జరిగిందనే అంశంపై, అలాగే ఎంతమంది రాజకీయ, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేశారనే కోణంలో సిట్ ఆయనను విచారించింది. గత ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఆర్థిక సహాయం చేసిన వారి ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు ప్రభాకర్ రావుపై ఆరోపణలున్నాయి. సిట్ విచారణలో ఆయన ఏం చెప్తారనేది ఆసక్తికరంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ చేసిన తరువాత దాన్ని ఎవరికి అందజేసేవారు..? ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైన వెంటనే విదేశాలకు ఎందుకు వెళ్లారు..? హార్డ్ డిస్క్‌ను ఎవరు ధ్వంసం చేశారు..?మీ ఆదేశాలతోనే ప్రణీత్‌అవు హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేశారా..? స్పెషల్ ఆపరేషన్ టీంను ఎవరు చెప్తే ఏర్పాటు చేశారు..? హార్డ్ డిస్క్ ధ్వంసం వెనుక కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది..? ఫోన్ ట్యాపింగ్ వల్ల లబ్ధి పొందింది ఎవరు..?ఇతర వివరాలను రాబట్టారు. కొన్నిప్రశ్నలకు ప్రభాకరరావు మౌనం వహించడంతో అతన్ని బుధవారం మరోసారి విచారించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున రాజకీయ, సినీ, ప్రముఖులు, జడ్జీలు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిలో ప్రభాకర్‌రావు కీలకంగా ఉన్నారనే ప్రచారం ఉంది. గతప్రభుత్వ పెద్దలే ఫోన్ ట్యాపింగ్‌ల విషయంలో అధికారులను ప్రోత్సహించారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ప్రభాకర్ రావు నోరు తెలిస్తే ఈ కేసులో ఎలాంటి ట్విస్ట్‌లు రాబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది. ఇదే జరిగితే ఈ పరిణామం బిఆర్‌ఎస్ లో ఎవరికి పేర్లు బయటపడతాయో అనేది ఉత్కంఠ రేపుతున్నది.

**పై అధికారుల ఆదేశాలతోనే చేశాను..?**

పై అధికారుల ఆదేశాలు ఉండడం వల్లనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డామని సిట్ అధికారుల విచారణలో ఎస్‌ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు వెల్లడించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ సమయంలో రాష్ట్ర డిజిపిలుగా చేసిన ఇద్దరు అధికారులు, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన మరో ఇద్దరు అధికారుల పేర్లు వెల్లడించినట్లు సమాచారం. అయితే ఆనలుగురు సీనియర్ ఐపిఎస్‌లను కూడా విచారించాలని, వారికి కూడా త్వరలో నోటీసులు జారీ చేసే అంశంపై సిట్ అధికారులు తర్జనబర్జన పడుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ చేయడం సాధ్యం కాదని ప్రభాకర్‌రావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. అయితే ప్రభాకర్‌రావును ఆదేశించిన అధికారులను సైతం విచారిస్తేనే అసలు గుట్టు బయటపడుతుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో తీగలాగుతుండగా డొంక కదిపేది ప్రభాకరరావు అని మాత్రమే అనుకున్న సిట్ అధికారులకు నిరాశమిగిలింది. మరికొంత మంది ఐపిఎస్‌లను విచారిస్తేగాని అసలు డొంక బయటపడదని సిట్ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

## తీవ్ర ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

పొందిన పార్టీ నాయకుల్లో మ రింత ఉత్సాహం పెరిగే అవకాశం ఉందని సిఎం అధిష్టానికి సూచించే అవకాశం ఉంది. మరో వైపు మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో ఉన్న పి.సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరు లు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల వారితో ఆ మూడు మంత్రి పదవులను భర్తీ చేయాలని అధిష్టానానికి రేవంత్ రెడ్డి సూచించనున్నట్లు సమాచారం.

## వ్యవస్థల విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా వెన్నుపోటు రాజకీయాలతో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చడం, బలవంతంగా ఏకపార్టీ నియంతృత్వాన్ని అమలు చేయడం వంటివి చేశారన్నారు. ఈ 11 సంవత్సరాల కాలంలో రాష్ట్రాల హక్కులను పూర్తిగా విస్మరించారని, సమాఖ్య నిర్మాణం బలహీపరిచారని ఖర్గే ధ్వజమెత్తారు. ద్వేషం, బెదిరింపులు, భయాన్ని వ్యాప్తి చేయడానికి నిరంతరం ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడినవారు, మైనారిటీ, బలహీన వర్గాలపై దోపిడీ నిరంతరం పెరుగుతోందని, వారికి రిజర్వేషన్లు, సమాన హక్కులను హరించే కుట్ర కొనసాగుతోందని మండిపడ్డారు. మణిపూర్‌లో కొనసాగుతున్న హింస బిజెపి పరిపాలనా వైఫల్యానికి అతిపెద్ద రుజువు అని ఖర్గే ఎక్స్‌లో రాసుకొచ్చారు. యుపిఎ హయాంలో సగటున 8 శాతంగా ఉన్న దేశ జిడిజిపి వృద్ధి రేటును 5–6 శాతం వద్దే నిలిపివేయడం బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ అలవాటుగా మార్చుకుందన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల హామీని నెరవేర్చడానికి బదులుగా, యువత నుండి కోట్లాది ఉద్యోగాలు లాక్కున్నారని, ద్రవ్యోల్బణం కారణంగా ప్రజా పొదుపులు 50 సంవత్సరాలలో అత్యల్ప స్థాయికి చేరుకోగా, ఆర్థిక అసమానతలు 100 సంవత్సరాలలో గరిష్ట స్థాయిని తాకాయన్నారు. నోట్ల రద్దు, తప్పుడు జిఎస్‌ట, ప్రణాళిక లేని లాక్‌డౌన్, అసంఘటిత రంగాన్ని దెబ్బతీశాయన్నారు. కోట్లాది మంది ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్టాండ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, నమామి గంగే, 100 స్మార్ట్ సిటీలు వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు.

### 11 ఏళ్లలో జవాబుదారితనమేదీ? : రాహుల్

11 సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం జవాబుదారీతనంగా లేదని, ప్రచారానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. కేంద్రం వర్తమానం గురించి మాట్లాడటం మానేసి ఇప్పుడు 2047 కోసం కలలు కంటోందన్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో కదులుతున్న, రద్దీగా ఉన్న లోకల్ రైలు నుండి జారిపడి నలుగురు ప్రయాణికులు మరణించగా, ఆరుగురు గాయపడడంతో ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల ఉత్సవం జరుపుకుంటుండగా, ముంబయి నుండి వచ్చిన విషాద వార్తలలో దేశం వాస్తవికత ప్రతిబింబిస్తుందని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. భారతీయ రైల్వేలు కోట్లాది మంది జీవితాలకు వెన్నెముక, కానీ నేడు అది అభద్రత, రదీ చిహ్నంగా మారిందని ఆయన ఆరోపించారు.

## పిటిషన్ కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా లేదని తేల్చారు. ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను కాపాడటం, అవినీతి పద్ధతుల్లో ప్రజాప్రతినిధులు ఎన్నిక కాకుండా చూసుకోవడం చట్టం ముఖ్యోద్దేశమని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 86 (7)లో ఆరు నెలల్లోపు ఎన్నికల పిటిషన్‌ను పరిష్కరించాల్సిన అవసరం ఉందని, తమ ముందున్న పిటిషన్‌లో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని తెలిపారు. కూనంనేని ఎన్నికను రద్దు చేయడాని కి చేసిన అభియోగాలకు ఆధారాలు లేవని, జోక్యం చేసుకునే అంశాలు ఏమీ లేవని,, పిటిషనర్ సరైన కారణం చూపడంలో విఫలమయ్యారని తీర్పులో పేర్కొన్నారు.

**న్యాయం గెలిచింది....**రాష్ట్రంలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన ఎన్నిక చెల్లదని స్వతంత్ర్య అభ్యర్థి వేసిన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం పట్ల కొత్తగూడెం ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ప్రజాక్షేత్రంలో గెలుపొందడం ద్వారా ప్రజా విజయం సాధించామని, తాజాగా అసంబంధమైన అంశాలతో వేసిన కేసును హైకోర్టు కొట్టివేయడం ద్వారా న్యాయం గెలిచిందని ఆయన తెలిపారు. హైకోర్టు తీర్పు వివరాలను సోమవారం ఆయన మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ తీర్పుతో న్యాయ వ్యవస్థ పట్ల మరింత విశ్వాసం, గౌరవం ప్రజలలో పెరిగిందని కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్షలాది మంది ఓట్లు వేసి గెలిపించిన ప్రజల మనోభావాలకు భిన్నంగా అడ్డదారుల్లో ప్రయోజనం పొందాలనుకునేవారికి ఈ తీర్పు చక్కని గుణపాఠమని తెలిపారు. అందుకు న్యాయవ్యవస్థకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. హైకోర్టు తీర్పు ద్వారా ప్రజాసేవలో ద్విగుణీకృతమైన ఉత్సహంతో పనిచేసేందుకు మరింత స్ఫూర్తిని కలిగించిందని సాంబశివరావు వెల్లడించారు.

### పిటిషన్ చట్ట వ్యతిరేకం

వివరాల గురించి కూనంనేని పేర్కొన్నారు కదా? కేవలం తన భార్య పేరు అఫిడవిట్‌లో వెల్లడించనంత మాత్రాన ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించలేం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి సిపిఐ నుంచి కూనంనేని సాంబశివరావు పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జలగం వెంకటరావుపై ఘన విజయం సాధించారు. అయితే, కూనంనేని రామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో తన భార్య పేరు వెల్లడించలేదని చెప్పి నిజాలు తొక్కిపెట్టినట్లు అవుతుందా. ఈ కారణంగా వాస్తవాలను తొక్కిపెట్టారని చెప్పి ఎన్నిక చెల్లదని ప్రకటించాలా? అంతేగాకుండా కూనంనేనికి శిక్ష, జరిమానా విధించాలా?' అని పిటిషనర్ అయిన ఓటరు నందూలాల్‌ను ప్రశ్నించింది. 'కూనంనేని నామినేషన్ దాఖలు సందర్భంగా భార్య పేరు వెల్లడించకపోవడంపై పిటిషనర్ ఏవిధమైన అభ్యంతరం చెప్పలేదు. కూనంనేనిపై పోటీ చేసిన ప్రత్యర్థి జలగం వెంకటరావు ఇదే విషయం అభ్యంతరం లేవనెత్తితే ఎన్నికల రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చారు. కూనంనేని సమర్పించిన అఫిడవిట్‌లో భార్య పేరు మినహా ఆమె పేరుతో ఉన్న పాన్ నెంబరు. ఐదు సంవత్సరాలు ఆదాయపు పన్నుల రిటర్న్‌ల గురించి పూర్తిగా వివరించారు. ఆ వివరాల్లో కూనంనేని భార్య పేరు ఉంటుంది. ఎన్నికల అఫిడవిట్‌లో భాగస్వామి కాలమ్‌లో భార్య పేరును పేర్కొనపోయినా మిగిలిన వివరాలన్నీ పొందుపర్చారు. నిబంధనల ప్రకారమే నామినేషన్ ఉండటంతో రిటర్నింగ్ అధికారి దాన్ని ఆమోదించారు. కూనంనేని లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల పొరపాట్లు ఏమీ లేవు. కాబట్టి ఎన్నికల పిటిషన్ విచారణార్హం కానేకాదు. ఇలాంటి చిన్నపాటి కారణంతో ప్రజలు ఇచ్చిన తీర్పును కొట్టేయడానికి వీల్లేదు. ఏ విధంగానూ పిటిషన్‌ను పరిగణించలేము. పిటిషన్ విచారణార్హమే అయినప్పటికీ ఎన్నిక చెల్లదనేందుకు సరైన ఆధారాలను చూపడంలో పిటిషనర్ విఫలమయ్యారు. అన్ని దశలోను ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. ఇదే సమయంలో ఎన్నికల పిటిషన్‌లో కీలక ఆధారాలు ఉంటే ఎన్నికల రద్దు వ్యవహారంలో జోక్యానికి ఆస్కారం లేదు. కూనంనేని 26,547 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ప్రజల విశ్వసనీయతను పొందారు. ప్రజా తీర్పును కాదనేందుకు కూనంనేని తన భార్య పేరు రాలేదనే కారణం చెల్లదు. కాబట్టి పిటిషన్‌ను కొట్టేస్తున్నాం..' అని హైకోర్టు వెలువరించిన తీర్పులో పేర్కొంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆధ్యాత్మికతతోనే ఆత్మవిశ్వాసం

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ప్రజల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం చిలుకూరు మండల కేంద్రంలోని యాదవుల ఆరాధ్యదైవమైన గంగమ్మ తల్లి జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలతో గ్రామాల్లో ధర్మరక్షణ జరుగుతుందన్నారు. శ్రీగంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మల్లయ్య యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, యాదవ కులస్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### విద్యారంగ సంక్షేమం కోసం ఆవిర్భవించిన

## తొలి ఉపాధ్యాయ సంఘం 'ఎస్‌టియు'




సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందే ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. 'ఎస్‌టియు 79వ' ఆవిర్భావ దినోత్సవం హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంఘం పతాకాన్ని చాడ వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్‌టియు సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి పిఆర్‌సి ఏర్పాటు, పెన్షన్ రూల్స్ సాధన, అప్రెంటిస్ విధానం రద్దు కోసం ఎస్‌టియు ఎంతో కృషి చేసిందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పర్వత్‌రెడ్డి, జి.సదానందంగౌడ్ మాట్లాడుతూ 1947వ సంవత్సరం, జూన్ 9న ఎస్‌టియు ఏర్పడిందన్నారు. నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీసు రూల్స్‌ను సాధించి, ఉపాధ్యాయులకు ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్ల పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామని వారు చెప్పారు. సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బడిబాట కార్యక్రమంలో సంఘ కార్యకర్తలు చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

బడిబాట కార్యక్రమం అనంతరం విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని పర్వత్ రెడ్డి, సదానందంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు జుట్టు గజేందర్, టి.పోల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పరమేశ, పున్న గణేష్, భార్గవి, అజర్‌జహా, శంకర్ మతంగి, కృష్ణారెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

## 'మహాలక్ష్మి'తో లాభాల్లోకి ఆర్టీసి

ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క

ఆర్టీసి కార్మికుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతర కృషి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి :** మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసి లాభాల బాటలో కొనసాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సూర్యాపేట బస్ డిపోలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్యం నుండి పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని వాతావరణంను కాపాడుకుంటూ ఆర్టీసి సంస్థ ముందుకు వెళ్తుందని, పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రవాణ శాఖ మంత్రి అయినప్పటి నుండి ఆర్టీసీలో సమూల మార్పులు తెచ్చి అనేక సంస్కరణలతో ముందుకు వెళ్లడం శుభపరిణామం అన్నారు. గతంలో సామాన్యుడి అవసరాలు తీర్చేందుకు ఆర్టీసి సంస్థ ఎంతగానో కృషి చేసిందని, కానీ లాభాలు లేకుండా ఎప్పుడూ నష్టాల బాటలో కొనసాగిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆర్టీసి అనే ప్రభుత్వ సంస్థలను కాపాడుకునేందుకు, ఆర్థికంగా నిలబెట్టుకునేందుకు తగు చర్యలతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. పాత బస్సుల ద్వారా వాతావరణాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవ చేసేందుకు సూర్యాపేట డిపోకు 79ఎలక్ట్రిక్ బస్సులు మంజూరైనాయని, వాటిలో సోమవారం 45 బస్సులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 182కోట్ల జీరో టికెట్లు జారీ చేశామని, వాటి ద్వారా తెలంగాణ ఆడపడుచులు 6088 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని, ఆ డబ్బులు ప్రభుత్వం ఆర్టీసీకి నేరుగా జమచేయడం జరిగిందని, దాంతో నేడు ఆర్టీసి ఆర్థికంగా నిలదొక్కుకొని పూర్తిసామర్థ్యంతో రాష్ట్రమంతా బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చుట్టూ సూర్యాపేట నట్ట నడుమ నల్లగొండ అంటు తెలంగాణ సాయుధ పోరాటం గుర్తు చేసుకుంటూ ప్రజా ప్రభుత్వంలో మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికుల సంక్షేమం కోరుకుంటూ నేడు సూర్యాపేట డిపో నుండి హైద్రాబాద్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కోదాడ లాంటి ప్రాంతాలకి వాతావరణంను కాపాడుకుంటూ 79 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేయడం జరిగిందని, వాటిలో నేడు 45 బస్సులు ప్రారంభం చేయడం జరిగిందన్నారు. గత పది సంవత్సరాలు ఒక్క నూతన బస్సుగాని, కొత్త ఉద్యోగం గాని ఇవ్వకుండా ఆర్టీసీని నష్టాల ఊబిలో కురుకొనిపోయేలా చేశారని, ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేలాది కొత్త బస్సులు, ఉద్యోగాలు నియమించడం జరిగిందన్నారు. ఆర్టీసీని పరిరక్షించుకుంటూ గ్రామాలకు రవాణ వ్యవస్థ చేరుకునేలా భవిష్యత్‌లో కొత్త బస్సులు కొనుగోలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ఎమ్మెల్యేలు నలమాద పద్మావతిరెడ్డి, మందుల సామేలు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ నెంబర్ చెవిటి వెంకన్నయాదవ్, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సంస్థ ప్రతినిధి ప్రభాకర్, ఆర్టీసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు వర్షాలు

వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయన్నారు. వాయువ్య ఉత్తరప్రదేశ్ పరిసర ప్రాంతాల నుంచి మధ్యప్రదేశ్, విదర్భ మీదుగా తెలంగాణ వరకు సగటు సముద్రమట్టానికి 0.9కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందన్నారు. ఉత్తర తమిళనాడు నుంచి దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు ఇంటీరియర్ కర్నాటక మీదుగా సముద్రమట్టానికి 3.1కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందన్నారు. వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర తీర ఒడిశా, దక్షిణ గంగా తీర పశ్చిమ బెంగాల్ వరకు సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని చెప్పారు. ఈ క్రమంలో సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. మంగళవారం కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లోనూ పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## బల్కచర్లను అడ్డుకుంటాం... తుమ్మిడిహట్టిని పూర్తిచేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గోదావరి నదిపై ఏపి ప్రభుత్వం నిర్మించే బల్కచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితిలో అడ్డుకుంటామని రాష్ట్ర రోడ్ల భవనాల, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బల్కచర్ల ప్రాజెక్టు విషయమై కోర్టుకు వెళ్తామని, కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కృష్ణా జలాలను ఎపికి తరలించి గత ఎపిసిఆర్ ప్రభుత్వం తెలంగాణాకు తీరని అన్యాయం చేశారన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులను పూర్తి చేసి 16లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తామని అన్నారు. ఘోష్ కమిటీ ముందు హరీష్‌రావు అన్నీ అబద్ధాలు చెప్పున్నారని అన్నారు. దళితులకు ముఖ్యమంత్రి పదవి, ఎస్సీలకు, ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్లతోపాటు మూడెకరాల భూమి, రూ.10లక్షలు ఇస్తామని చెప్పి కెసిఆర్ మోసం చేసి రూ.6లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణాను అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16నెలల కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేసిందన్నారు. రూ.22వేల కోట్లతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తుందన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లు ఉన్నారు.

## మల్‌రెడ్డికి మంత్రిపదవి వచ్చేలా కృషి



ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ

**ప్రజా పక్షం/తుర్కయంజాల్ :** నిరుత్సాహం వద్దు.. ఉత్సాహంతో ముందుకు వెళ్దాం అని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇటీవల మంత్రివర్గ విస్తరణలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డికి నిరాశ ఎదురైన సంఘటన దృష్టిలో పెట్టుకొని సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూరు ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయానికి రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విచ్చేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మాట్లాడి మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు కార్యకర్తలు అభిమానులు నిరాశ చెందవద్దని కోరారు. అనంతరం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలను బలోపేతం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా అతిపెద్ద జిల్లా అని, ఇటీవల మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి వస్తుందని నాయకులు, కార్యకర్తలు ఆశతో ఉన్నారని, మంత్రివర్గ విస్తరణలో తన పేరు లేకపోవడంతో నాయకులు నిరాశ చెందారని తెలిపారు. పార్టీ అధిష్టానంతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇసి.శేఖర్ గౌడ్, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న మహిళా 'సోలార్ ప్లాంట్లు' ప్రారంభించాలి

నవంబర్ లోపు ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనులను పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ల సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అక్టోబర్ 2న సోలార్ ప్లాంట్లు ప్రారంభించే లక్ష్యంతో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ పంచాయతీ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనులను నవంబర్‌లోపు పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజునాటికి విద్యార్థులకు యూనిఫాములను పంపిణీ చేస్తామన్నారు. మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్స్, పెట్రోల్ బంక్స్ ఏర్పాటు, నూతన మహిళా సభ్యుల గుర్తింపు, కిశోర బాలికలు, దివ్యాంగులు, వయోధిక మహిళా సంఘాల ఏర్పాటు, ఇందిరమ్మ మహిళా శక్తి భవనాల నిర్మాణ పనుల పురోగతి, మహిళా సంఘాలతో ప్రభుత్వ పాఠశాలల స్కూల్ యూనిఫాంల సరఫరా తదితర అంశాలపై మంత్రి సీతక్క సచివాలయంలో సోమవారం కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, దివ్యాంగులు,వయోవృద్ధులు,ట్రాన్స్ జెండర్ పర్సన్ సాధికార శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి సిఎం ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం అని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో కలెక్టర్లు పనిచేయాలని, 'తెలంగాణ రైజింగ్ 2047' సాకారం కావాలంటే మహిళా సంఘాలను బలోపేతం చేయాలని, మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించాలని, దీనికి అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి పనులను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ బడులు బాగుంటేనే తెలంగాణ రాష్ట్రం బాగుంటుందని, వాటి ప్రభావం తెలంగాణ భవిష్యత్తుపైన పడుతుందని, అందుకే వాటిపైన ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

**ప్రైవేటు వడ్డీతో మహిళల ఇబ్బందులు :** ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చేతుల్లో పేదల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే అర్హులైన ప్రతి మహిళా ఎస్‌హెచ్‌జిలో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. గ్రామ పంచాయతీల వారిగా సమీక్ష చేసి, కొత్త సభ్యులను చేర్పించాలన్నారు. బాల భరోసా పేరుతో కొత్త స్కీమును తీసుకొస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఈనెల 11న తెరుచుకోనున్నాయని, అప్పటిలోపు కలెక్టర్లంతా కేంద్రాల నిర్వహణ ఎలా ఉందో పరిశీలించాలని సూచించారు. అంగన్‌వాడీలలో తాగు నీరు, కరెంటు, మరుగుదొడ్లు వంటి వసతులను కల్పించాలని, ఈ నెల 11 నుంచి చేపట్టే 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సమీపంలోని ఖాళీ ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలన్నారు. కొత్తగా వేయి అంగన్‌వాడీ భవనాలు నిర్మించబోతున్నామని, వాటికి కావాల్సిన స్థలాలను సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

**ఇందిరా మహిళా శక్తి పాలసీ కీలకం : రామకృష్ణారావు**

రామకృష్ణారావు మాట్లాడుతూ ఇందిరా మహిళాశక్తి పాలసి అత్యంత కీలకమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో మహిళల పాత్ర కీలకమని, అందుకే పల్లెల్లో, పట్టణాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల్లో నూతన సభ్యులను చేర్పించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండాలని, ఓటర్ జాబితా ఆధారంగా నూతన సభ్యులను గుర్తించాలన్నారు.



## హైదరాబాద్‌లో సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు

మహిళలపై అనుచిత వ్యాఖ్యల ఆరోపణలపై కేసు నమోదు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ పోలీసులు సోమవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలో వేశ్యలు ఉన్నారంటూ రెండు రోజుల క్రితం సాక్షి టీవి డిబేట్లో వ్యాఖ్యలు చేశారని ఆయనపై ఆరోపణలు చేస్తూ ఎస్‌సిఎస్‌టి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, జర్నలిస్టులు కొమ్మినేనితో పాటు కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యంపై ఎన్‌టిఆర్ జిల్లా జిల్లా తెలుగు మహిళలు, రాజధాని రైతులు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష శనివారం రాత్రి గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై ఐటీ చట్టంతో పాటు ఎస్‌సి,ఎస్‌టి చట్టం, ఇతర నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు హైదరాబాద్‌లోని జర్నలిస్టుకాలనీ నివాసంలో ఉన్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస రావును తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకుని తుళ్లూరుకు తీసుకెళ్లారు. ఎపిలో కొనసాగుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం తనను కూడా తాకిందని అరెస్టు సందర్భంలో మీడియాతో కొమ్మినేని తెలిపారు.

### అర్చక, ఉద్యోగులకు గ్రాట్యుటీ..

## రూ.4లక్షల నుండి రూ.8లక్షలకు పెంపు

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాయాలయాల్లో పని చేస్తున్న అర్చకుల చిరకాల కోరికను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి పోస్టరును సచివాలయంలో సోమవారం విడుదల చేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ... అర్చక, ఉద్యోగుల కోసం తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమిషనర్ స్థాయి వరకు గల దేవాలయాలలో పనిచేసే సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ధూప దీప నైవేద్య అర్చకులకు మరణానంతరము చెల్లించు గ్రాట్యూటీ నిర్ధారించినట్టు చెప్పారు. మరణానంతరం చెల్లించు ఎక్స్‌గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తము చెల్లింపు ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ నిధి కింద ఉద్యోగులకు.... మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివాహ నిమిత్త పథకం, ఉపనయన పథకం, గృహ నిర్మాణ, కొనుగోలు మరియు మరమ్మతుల నిమిత్త పథకం, విద్యా పథకం, విధులు నిర్వహించలేని వికలాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సహాయ పథకం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయంతో అర్చకులు, దేవాదాయ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున లబ్ది జరుగుతుందని మంత్రి కొండా సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలికంగా పెండింగ్ లోఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం సంఘం అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంఘం గౌరవ అధ్యక్షుడు వై.నాగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర నాయకులు అనంతుల నరసయ్య, భాస్కర్ రెడ్డి, మల్లారెడ్డి, సురేష్ తదితరులు వేదికపై ఆసీనులయ్యారు. సమావేశంలో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఏర్పాటైన పిఎసిఎస్‌లో ఉద్యోగులు రైతులతో చాలా దగ్గరి సంబంధాన్ని కలిగివుంటారని, రైతు సంఘాలను క్రెడిట్, ఇన్‌పుట్లు, మార్కెట్, విలువను తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషిస్తారని గుర్తు చేశారు. రైతులకు, గ్రామీణ వ్యవసాయ వర్గాలకు క్రెడిట్, ఆర్థిక సేవలతో పాటు బహుళ సేవలను అందిస్తూ, పేదరికం తగ్గింపు, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతున్న పిఎసిఎస్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయారన్నారు. అన్నివర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడివుందని, పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరానికి కృషి చేస్తానని అద్దంకి దయాకర్ హామీ ఇచ్చారు.

వై.నాగన్నగౌడ్ మాట్లాడుతూ పిఎసిఎస్ ఉద్యోగులకు ప్రతి నెలా 5న డిసిసిబి బ్యాంకు ద్వారా జీతభత్యాలు చెల్లించాలని, గ్రాట్యుటీ రూ.2 లక్షలు కాకుండా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి తక్షణమే అమలు చేయాలని కోరారు. ఎ.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలతో సంబంధం లేకుండా స్థానిక జిల్లాలోనే బదిలీలు చేయాలని, ప్రత్యేక నిధులను కేటాయించి డిసిసిబి ద్వారా భవిష్యనిధి చెల్లించి, ఆరోగ్య కార్డులు కూడా ఇవ్వాలన్నారు.

**పురపాలక కార్యాలయము : బెల్లంపల్లి : జిల్లా :: మంచిర్యాల**

ఈ-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీస్ నెం. ఇ1/02/టెండర్/2025-26/Bpl/Mptly, తేది: 09.06.2025

ఈ-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీస్

ఈ కార్యాలయములో అంచనా విలువ రూ.29.00 లక్షల విలువ గల (6) పనులకు పట్టణ ప్రగతి నిధులకుగాను సివిల్ రిజిస్ట్రేషన్ కాంట్రాక్టర్ వారి నుండి ఈ కార్యాలయం ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి. **టెండర్ తేదీల వివరములు : 01.** డౌన్‌లోడ్ మొదలు తేది & సమయం: 10.06.2025 from 04.00 PM, **02.** డౌన్‌లోడ్ చివరి తేది & సమయం: 17.06.2025 up to 4.00 PM. ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు. పూర్తి వివరములకు website:www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.

సం/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 3298-PP/CL/ADVT/1/2025-26, Date: 09-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఎల్‌బినగర్ సర్కిల్-4, ఎంఆర్‌ఓ కార్యాలయం పక్కన, సరూర్‌నగర్, హైదరాబాద్. ఇ-మెయిల్: eec4.ghmc@gmail.com

నం. EE/LBNR/LBNZ/03/2025-26 కొటేషన్ నోటీసు తేది: 06.06.2025

ప్రముఖ సంస్థల నుండి సీల్డ్ కొటేషన్స్‌ఆహ్వానించడమైనవి. వీటిని 11.06.2025న లేదా అంతకు ముందు మధ్యాహ్నం 3.00 గంటల వరకు కింద సంతకం చేసిన వారికి అందజేయాలి మరియు అదే రోజు సాయంత్రం 4:00 గంటలకు తెరవబడతాయి. దిగువ అంశాల వివరణాత్మక వివరణలు మరియు స్పష్టత కోసం మీరు కార్యాలయ వేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బి నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసిని సంప్రదించవచ్చు.

| క్ర. సం. | అంశం యొక్క వివరణ | పరిమాణం | యూనిట్ | మొత్తం |
|---|---|---|---|---|
| 1 | డిపార్ట్మెంట్ ఆమోదించిన ప్రకారం, మెటీరియల్ సరఫరా & లేబర్ ఛార్జీలు, డిజైన్ & టెక్స్చర్‌తో సహా 1' ప్యానెల్ ఎత్తు, 2'' మందం, 6' పొడవుతో ప్రీ-కాస్ట్ ఆర్‌సిసి బౌండరీ వాల్ ప్యానెల్ సరఫరా, డెలివరీ మరియు నిర్మాణం, జిఎస్‌టి, అన్ని పన్నులు మొదలైనవి పూర్తి చేసిన పని మొత్తం. | 1 | Rmt | |

**షరతులు:**
**1.** జిహెచ్‌ఎంసి, ఎల్‌బి నగర్ సర్కిల్-4, సర్కిల్-4, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో కొటేషన్లను 11.06.2025న లేదా అంతకు ముందు మ.3.00 గం.ల వరకు స్వీకరించాలి మరియు అవి సా.4.00 గం.లకు తెరవబడతాయి. **2.** ఎటువంటి కారణం చూపకుండానే కొటేషన్లను రద్దు చేసే హక్కు ఎల్.బి.నగర్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు కలదు.
**సంబంధిత అధికారి చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బి నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 3277-PP/CL/ADVT/1/2025-26, Date: 09-06-2025

ప్రజాపక్షం
మంగళవారం, 10 జూన్

# నిరుద్యోగం@6.9 శాతం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పరిపాలనను దేశానికి స్వర్ణయుగంగా సోమవారం (జూన్ 9) బిజెపి వేడుక చేసుకుంది. నిజమే అవును, అంబానీ అదానీ తదితర పారిశ్రామిక కుబేర తరగతికి అది స్వర్ణ యుగం. స్థూల జిడిపి దేశాన్ని ప్రపంచంలో అతిపెద్ద నాలుగవ స్థానానికి చేర్చినట్లు మురిసిపోయే తరగతులకు స్వర్ణయుగం. కానీ అదే సమయంలో 140 కోట్లలో 80 కోట్ల జనాభాకు రేషన్లు అందించడం కూడా గర్వకారణంగా చెప్పుకోవడం సిగ్గుచేటు కాదా? అది దేశంలో తాండవిస్తున్న దారిద్ర్యానికి నిదర్శనం కాదా? ప్రపంచబ్యాంకు సైతం భారతదేశంలో దారిద్ర్యం 5 శాతానికి తగ్గిపోయిందని కితాబు ఇవ్వడం మోదీ ప్రభుత్వ ప్రచారానికి వంత పాడటం తప్ప మరోటి కాదు. వార్షిక తలసరి ఆదాయంలోనే కాదు, ఆకలి, ఆరోగ్యం, అక్షరాస్యత ఇలా అన్ని రకాల మానవాభివృద్ధి సూచీల్లో అత్యధిక ప్రపంచ దేశాలకు వెనకేసిన దూరంలో ఉన్న మన దేశం స్వర్ణయుగాన్ని అనుభవిస్తున్నదని భజనపరులు టముకులు మోగించవచ్చు, టపాసులు కాల్చవచ్చు. కానీ వినేవారు చెవిలో కాలీఫ్లవర్ పెట్టుకోలేదుగా? వారి జీవితాలే వారికి కొలమానం.

ఉదాహరణకు నిరుద్యోగాన్నే పరిశీలించుదాం. నరేంద్ర మోదీ గారు 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తి పోసిన అంశాల్లో ఇదొకటి. తనకు అధికారం ఇస్తే ప్రతి సంవత్సరం లేబర్ మార్కెట్లో ప్రవేశించే 2 కోట్ల మందికి ఉపాధి చూపుతానని నిరుద్యోగులపై నమ్మకాస్త్రం ప్రయోగించారు. ఫలితం పొందారు కానీ అది నెరవేర్చారా? 22 కోట్ల మందికి ఉద్యోగాలు చూపారా? వీధుల్లో పకోడీ అమ్ముకోవడం, ఇళ్లల్లో పాచి పనులు చేసుకోవడం కూడా ఉపాధి కల్పన కిందే లెక్క కట్టిందీ ప్రభుత్వం కానీ సెంటర్ ఆఫ్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) 30 రోజుల చలన సగటు ప్రాతిపదికపై నిరుద్యోగిత రేటు 6.9శాతం ఉంది. మే 30 నాటి సంఖ్య 6.7శాతం, ఏప్రిల్లో 7.7శాతం, మార్చి నెలలో 7.6శాతం. కేంద్ర కార్మిక– ఉపాధి మంత్రిత్వ శాఖ కూడా ఇటీవల నెలవారీ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పి.ఎల్.ఎఫ్.ఎస్) డేటా సేకరణ మొదలెట్టింది. 2025 ఏప్రిల్ సంబంధించి అది మే 15న విడుదల చేసిన తొలి మాసపు డేటా వారం ప్రాతిపదికపై నిరుద్యోగ రేటును 5.1గా నిర్ధారించింది. క్షేత్రస్థాయిలో నిజ రేట్ ఇంకా ఎంతో హెచ్చుగా ఉంటుంది. కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ లేబర్ బ్యూరో 2013–14 సర్వే ప్రకారం దేశంలో నిరుద్యోగిత రేట్ 4.9 శాతం. నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చారు. 2017– 18లో నిరుద్యోగం గత 45 సంవత్సరాల్లో కెల్లా ఎక్కువగా 6.1 శాతానికి చేరింది. 2025 ఏప్రిల్లో 5.1 శాతం. ఈ కాలంలో పట్టణ నిరుద్యోగిత 5.5 నుంచి 6.5 శాతానికి పెరిగింది. అదే కాలంలో గ్రామీణ నిరుద్యోగిత 4.7శాతం నుంచి 4.5కు తగ్గింది.

ఇదిలా ఉండగా గత లోక్సభ ఎన్నికల సమయంలో సొంత డబ్బా కొట్టుకునేందుకు పాలక బిజెపి వారు ఒక రిజర్వ్ బ్యాంక్ నివేదికను చేతబుచ్చుకొని 2014–15 మరియు 2023–24 మధ్య 17 కోట్ల 19లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పుకున్నారు. ఆ డేటా శుద్ధ తప్పు అని కచ్చితంగా చెప్పవచ్చు. డీమానిటైజేషన్ వల్ల 2016–17లో లక్షల సంఖ్యలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. అంతకు ఐదారు రేట్లు ఉద్యోగాలు ఊడాయి. ఆ కాలంలో ఉపాధులు 47.1 కోట్ల నుండి 47.3 పెరిగాయని ఆర్బిఐ కెఎల్ఇఎంఎస్ నివేదిక తెలిపింది. కోవిడ్–19 కారణంగా 2020–22 కాలంలో యావత్ ఆర్థిక వ్యవస్థ మూతపడగా ఉపాధులు 57.8 కోట్లకు పెరిగినట్లు చెప్పింది. 2023–24లో 64.3 కోట్లకు చేరిందట!

మెరుగైన సంఖ్యల కోసం ప్రభుత్వం ఒకటికి రెండుసార్లు 2017–18లో, తిరిగి 2025 జనవరిలో పిఎల్ఎఫ్ఎస్ నిర్వచనాలు, మెథడాలజీలో మార్పులు చేసింది. అయినా దాని తొలి పిఎల్ఎఫ్ఎస్ డేటా అద్భుతాలు సృష్టించలేదు. మోదీ స్వర్ణయుగం ప్రభావం కనిపించలేదు. పైగా 15–29 సంవత్సరాల వయో గ్రూపులో నిరుద్యోగిత రేటు ఆందోళనకరంగా 13శాతం ఉంది.

క్షేత్రస్థాయిలో వాస్తవం మరింత భయానకంగా ఉంది. నిరుద్యోగం, వేతనం లేని ఉపాధి, తక్కువ వేతనానికి దోపిడీకి గురవుతున్న శ్రమ విశృంఖలంగా ఉంది. మోదీ చెప్పుకునే స్వర్ణయుగం ఎవరికి లబ్ధి చేకూర్చింది? కంపెనీలు, వ్యాపారాల లాభార్జనకు కాదా? అంతరాలు తీవ్రంగా పెంచుతున్న మోదీ పాలన స్వర్ణయుగమని చెప్పుకోవడం ఆత్మవంచన కాదా?

# చెదిరిన స్నేహం : ట్రంప్ వర్సెస్ మస్క్

– టిఎన్.అశోక్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహితుడు, టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు ఇప్పుడు బహిరంగంగానే భగ్గుమన్నాయి. ట్రంప్ మరోసారి ఎన్నికయ్యేందుకు మస్క్ తన వ్యక్తిగత సంపద నుంచి 288 మిలియన్ డాలర్లను వెచ్చించారు. ట్రంప్ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా టెస్లా సిఇఒ తీవ్ర విమర్శలు చేయడం ద్వారా ఈ ఇద్దరు స్నేహితుల వైఖరి మధ్య ప్రాథమికంగానే తేడాలు ఉన్నట్లు సూచిస్తుంది.

మస్క్ ఉపయోగించిన 'అసహ్యకరమైన అకృత్యం' అనే పదాలు, అధ్యక్షుడు ట్రంప్‌కు, టెస్లా ఇవిలు, ఎక్స్ ఎఐ, స్పేస్ఎక్స్, న్యూరల్ లింక్ (బ్రెయిన్ మ్యాపింగ్) వ్యవస్థాపకుడు, సోషల్ ప్లాట్‌ఫామ్ ఎక్స్ యజమాని అయిన టెక్ బిలియనీర్ మధ్య సంబంధాన్ని ప్రమాదంలో పడేసాయి. ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో మిలియన్ల మంది అనుచరులతో అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం అలవాటు పడినందున, ఈ సంబంధంలో ఆయన ఏ వైపుకైనా మొగ్గు చూపవచ్చు. ఈ మాటల యుద్ధంలో ట్రంప్ ఆశ్చర్యకరంగా శాంతంగా ఉండి, తీవ్రంగా స్పందించలేదు.



ప్రస్తుతం అత్యంత నైరాశ్యంలో మునిగిన మస్క్ గతంలో దక్షిణాఫ్రికా నుంచి హెచ్1బి వీసాపై అమెరికాకి వచ్చి తన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. వలసదారులు, సుంకాలు, ప్రభుత్వ వ్యయంపై ట్రంప్ విధానాలపై విభిన్న అభిప్రాయాలను కలిగి ఉన్నాడు. ట్రంప్ పాలన మొదటి 130 రోజులు ఈ విధానాలను కొనసాగించారు. ఇప్పుడు పరిపాలన నుండి బయటపడిన తర్వాత, అతను తన వ్యక్తిగత అభిప్రాయాలను ఎటువంటి అడ్డూ అదుపు లేకుండా వెల్లడిస్తున్నారు.

ప్రభుత్వంలోని అనవసరమైన ఉద్యోగాలను తగ్గించి, ప్రభుత్వ వ్యయాన్ని ఆదా చేయడానికి డోజ్– డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ ఛీఫ్ అడ్మినిస్ట్రేటర్‌గా మస్క్ వైట్ హౌస్‌లోకి అడుగు పెట్టారు. సైద్ధాంతిక విభేదాలు తలెత్తి, ఆయన సహ నిర్వాహకుడు, 2024 అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేయాలని భావించిన ట్రంప్ అభిమాని వివేక్ రామస్వామి డోజ్‌ను ప్రభుత్వం వెలుపల ఉంచాలని కోరినప్పుడు, ఆయన నివసిస్తున్న ఒహాయో రాష్ట్ర గవర్నర్‌షిప్ కోసం ప్రచారం చేయడానికి పంపించారు.




వైట్ హౌస్ పక్కనే ఉండే ఒక భవనంలోకి ప్రవేశించిన మస్క్‌కు అమెరికాలోని అత్యంత శక్తిమంతమైన సలహా బృందం ఉండే వెస్ట్ వింగ్‌లో గది లభించలేదు. ఆయన తన పనిని నిబద్ధతతో ప్రారంభించాడు. తన 130 రోజుల మిషన్ ముగిసే సమయానికి, ప్రభుత్వ వ్యయంలో 175 బిలియన్ డాలర్లను ఆదా చేయడానికి ఆయన 135 బిలియన్ డాలర్లను ఖర్చు చేశారు. ఇది ఆయన వాగ్దానం చేసిన వ్యయ కర్తనం 2 ట్రిలియన్ డాలర్లకు, ఆ తర్వాత 1 ట్రిలియన్ డాలర్లకు తగ్గించబడిన మొత్తంలో ఒక చిన్న భాగం.

ట్రంప్ దాదాపుగా డోజ్ నుండి వైదొలగమని చెప్పినప్పుడు మాస్క్ ఆశ్చర్యానికి గురయ్యాడు. ఎందుకంటే బడ్జెట్ లోటును పెంచినందుకుగాను గత అధ్యక్షుడు బైడెన్ ప్రభుత్వ ఖర్చును తగ్గించాలని 2024లో ప్రచారం చేసిన వ్యక్తి (ట్రంప్) ఇప్పుడు బైడెన్ మాదిరిగానే వ్యవహరిస్తూ మొత్తం పరిస్థితిని మొదటికే తీసుకువచ్చినందుకు ఆశ్చర్యపోయాడు.

వాషింగ్టన్ డి.సి.లో ట్రంప్ ప్రతిపాదిత 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' గురించి భయాలు వ్యక్తమవుతున్నాయి. బైడెన్ బిల్డ్, బ్యాక్, బెటర్ చొరవతో వాతావరణ సాంకేతికతలపై 1.7 ట్రిలియన్ డాలర్ల వ్యయం చేయగా, ట్రంప్ తాజా బిల్లు వచ్చే 10 సంవత్సరాలలో వ్యయాన్ని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచింది ఇది ప్రభుత్వ బడ్జెట్‌లో భారీ లోటును సృష్టించవచ్చు.

సంవత్సరానికి 4 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపాదించే ధనవంతుల పన్నులను తగ్గించడానికి, వారికి సంవత్సరానికి 4,00,000 డాలర్లను ఆదా చేయడానికి, మెడికెయిడ్, మెడికేర్, ఒబామాకేర్‌లపై ఖర్చులను తగ్గించడానికి, అందుబాటులో వైద్య సంరక్షణ చట్టాన్ని పునర్నిర్వచించి 8.6 మిలియన్ల పట్టణ మధ్యతరగతి ప్రజలను ఆరోగ్య సంరక్షణ నెట్ నుండి మినహాయించడం, ప్రతి పట్టణ కుటుంబానికి మెడికేర్ ఖర్చులను 1,000 డాలర్లకు పెంచడం, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన మందుల ధరలను పెంచడం వంటి ట్రంప్ ప్రయత్నాలు, డోగ్ ద్వారా వృథా ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంలో సాధించిన అన్ని లాభాలను తగ్గించేలా కనిపిస్తున్నాయి.

మస్క్ తన ఎక్స్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ, బిగ్ బ్యూటిఫుల్ బిల్లును 'భారీ, అభ్యంతరకరమైన, అనవసరమైన కాంగ్రెస్ వ్యయ బిల్లు' అని ఆరోపించాడు. అది ఒక అకృత్యమైన బిల్లు అని ఆయన అన్నారు.

ఈ బిల్లు కాంగ్రెస్‌లో 215–214 తేడాతో ఒక్క ఓటుతో ఆమోదించబడింది. ఇప్పుడు సెనేట్‌లో అటూ ఇటూ వేలాడుతుంది. అక్కడ రిపబ్లికన్లు డెమొక్రాట్ల కంటే అధికంగా 53–47 మెజారిటీని కలిగి ఉన్నారు. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ సెనేట్ అధ్యక్షుడిగా, టైబ్రేకింగ్ ఓటును కలిగి ఉన్నారు.

సెనేట్‌లో ముగ్గురు రిపబ్లికన్లు దీనిని వ్యతిరేకిస్తున్నందున, ట్రంప్ బిబిబిని 50–47 తో సెనేట్ ద్వారా ఆమోదింపజేయగలడు. ఒకవేళ అది తీవ్రమైన పోటీ అయితే, జెడి వాన్స్ తన టైబ్రేకింగ్ ఓటుతో ఎల్లవేళలా ఆదుకోగలడు. కానీ బిల్లును వ్యతిరేకిస్తున్న రిపబ్లికన్ల విభాగానికి ఆమోదయోగ్యంగా చేయడానికి దాని ప్రస్తుత రూపంలో మార్పులు చేయవచ్చు.

చరిత్ర పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది. జో బైడెన్ బిల్డ్ బ్యాక్ బెటర్ బిల్ చొరవ, 1.7 ట్రిలియన్ డాలర్ల బడ్జెట్‌తో, శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా వాతావరణ మార్పు సాంకేతికతలను ప్రోత్సహించడానికి ప్రయత్నించినందున, శిలాజ ఇంధన లాబీకి ప్రాతినిధ్యం వహించే ఆయన స్వంత డెమొక్రాట్ల ద్వారా నిర్వీర్యం చేయబడింది. అనేక మంది సెనేటర్లు, కాంగ్రెస్ సభ్యులను ప్రభావితం చేసే శిలాజ ఇంధన లాబీ, 2023–24 ఆర్థిక సంవత్సరంలో వాతావరణ మార్పు న్యాయవాద బృందాలకు వ్యతిరేకంగా లాబీయింగ్ చేయడానికి సుమారు 93 బిలియన్ డాలర్లను ఖర్చు చేసింది.

బైడెన్ ప్రతిపాదిత బిల్ బ్యాక్ బెటర్ ఇనిషియేటివ్ సుమారు 1 ట్రిలియన్ డాలర్లకు తగ్గించబడింది, అయినప్పటికీ ఇవిలను ప్రోత్సహించడం, కార్ల అమ్మకాలపై సబ్సిడీలు, వాటిలో ఉపయోగించే బ్యాటరీలతో సహా వాతావరణ మార్పు సాంకేతికతలకు 750 బిలియన్ డాలర్లు కేటాయించగలిగింది. అయితే ట్రంప్ బిబిబి, బైడెన్ బిబిబి మాదిరిగానే ఒకే పేరుతో ఉన్నప్పటికీ, మస్క్ సెనేటర్లను ప్రభావితం చేయగలిగితే దాని ప్రస్తుత రూపం సెనేట్‌లో నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. బిల్లుకు ఓటు వేసిన కాంగ్రెస్ సభ్యుల గురించి మస్క్ ఇలా అన్నారు: 'దానికి ఓటు వేసిన వారికి సిగ్గుపడాలి: మీరు తప్పు చేశారని మీకు తెలుసు. మీకు తెలుసు.'

ట్రంప్ ఈ బిల్లును జూలై 4 నాటికి ఆమోదించడానికి గడువు విధించారు. ఇది అతని రెండవ పదవీకాలాన్ని నిర్వచించి, అమెరికా ఆర్థిక వ్యవస్థకు మార్గం చూపగలదు. పన్నులను తగ్గించి, సామాజిక వ్యయాన్ని తగ్గించి, సమాఖ్య రుణాన్ని పెంచే ఈ ప్యాకేజీ గురించి ఆందోళన చెందుతున్న రిపబ్లికన్ సెనేటర్లపై ఆయన ఒత్తిడి పెంచారు.

ఓవల్ ఆఫీసులో మస్క్‌కు ఉన్నత స్థాయి వీడ్కోలుకు ఐదు రోజుల తర్వాత ఆయన చేసిన తీవ్ర విమర్శలు వచ్చాయి. వైట్ హౌస్‌తో ఆయన వివాదం ముదిరింది. సుంకాల విధానంపై ఆయన విమర్శలు చేశారు. అమెరికా బడ్జెట్ వ్యయం నుండి 1 ట్రిలియన్ డాలర్లు తగ్గించడానికి తన ప్రయత్నాలకు పూర్తిగా మద్దతు ఇవ్వనందుకు నిందించారు. టెస్లా కోసం అనేక విడిభాగాలను చైనా నుండి ఔట్‌సోర్స్ చేసే, ఆ దేశంలో పెద్ద సంఖ్యలో టెస్లా కార్లను విక్రయించే మస్క్, చైనాపై విధించిన సుంకాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న వారిలో ఒకరు.

మస్క్ తన త్రైమాసిక లాభాలు 71% పడిపోవడాన్ని చూశాడు. వాటాదారులు, డైరెక్టర్ల బోర్డు తీవ్రంగా కలత చెంది, మస్క్‌ను టెస్లాకు తిరిగి వచ్చి సిఇఒగా తన పని చేయాలని లేదా రాజీనామా చేసి కంపెనీని నడపడానికి ప్రత్యామ్నాయాన్ని కనుగొనాలని కోరారు. టెస్లా నుండి స్పేస్ఎక్స్ వరకు, బ్రెయిన్ మ్యాపింగ్ న్యూరల్ లింక్ వరకు, ఆయన ట్విట్టర్ నుండి 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వరకు మస్క్ ప్రతి వెంచర్ ఆయన హృదయానికి దగ్గరగా ఉంటుంది. ఆయన తన ప్రధాన సంస్థకు తిరిగి వచ్చి అన్ని సంస్థలను నడుపుతానని, అవసరమైతే కంపెనీని లాభదాయకమైన రోజులకు తిరిగి తీసుకురావడానికి తన కార్యాలయంలోనే నిద్రపోతానని చెప్పాడు.

మస్క్ వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బ తీస్తానని ట్రంప్ హెచ్చరించగా మస్క్ కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నాడు. రెండు పార్టీల వ్యవస్థ నడుస్తున్న అమెరికాలో బలమైన మూడవ పార్టీ రాగలిగితే అది మరింత ఆసక్తిదాయకం!


(ఐపిఎ సర్వీస్)

# భవిష్యత్ 'రాత' మార్చిన పెన్ను

**(నేడు జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం)**

రాయడానికి అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం బాల్‌పాయింట్ పెన్ లేదా బాల్ పెన్ అని మనకు తెలుసు. చిన్నారి నుంచి పండు ముసలి వరకు అందరి హస్త భూషణం బాల్ పెన్. బాల్ పెన్‌ను చూడని, స్పర్శించని వారు ఉన్నారా ! విద్యా బోధన, విద్యావంతుల జేబు భూషణం, వ్యాపార గణాంకాల పునాది, సమాచార వితరణశీలి పెన్ను మాత్రమే. నేడు ప్రపంచవ్యాప్తంగా పెన్ను అంటేనే బాల్‌పాయింట్ పెన్ అనేది నిర్వివాదాంశం. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా మన ఇంటి నేస్తం అయ్యింది బాల్ పెన్ను. గతంలో ఇంకులో ముంచి రాసుకునే పన్నులు, సిరా నింపి రాసుకునే పన్నులను చూసాం. నేడు ఇంకా పెన్ను అంతరించిపోయింది. బాల్‌పాయింట్ పెన్ను మన నిత్య నేస్తం అయ్యింది.

**జాతీయ బాల్‌పాయించ్ పెన్ దినోత్సవం:**



1888లో జాన్ లావుడ్ అనే శాస్త్రవేత్త ఇంకు పెన్నును కనుగొనడం జరిగింది. ఇంకు పెన్ను వాడుకలో వచ్చిన అసౌకర్యాల వల్ల మరో మెరుగైన పెన్ను అవసరం ఏర్పడింది. 1938 లో లాజ్లో బిరో అనే హంగేరియన్ జర్నలిస్టు బాల్‌పాయింట్ పెన్నులు తెలిసాయి రూపొందించడం, తర్వాత 1943 జూన్ 10న తన సోదరుడు ఇంజనీర్ జియార్జీ బిరోతో కలిసి బాల్పాయింట్ పెన్నును పేటెంట్ చేయడం జరిగింది. ఈ పరమ అద్భుత ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏటా జూన్ 10న ప్రపంచ దేశాలు జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం (నేషనల్ బాల్‌పాయింట్ పెన్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినం వేదికగా పెన్నులు కృతజ్ఞతలు తెలపడం, వివిధ రకాల పెన్నుల ప్రదర్శనలు, పెన్నులను అలంకరించి కృతజ్ఞతలు తెలపడం, పెన్‌తో మన ఆప్తులకు ఉత్తరం రాయడం, పెన్ను ప్రాధాన్యాన్ని గూర్చి వ్యాసం రాయడం, బాల్‌పెన్ ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

నాటి నుంచి నేటి వరకు విద్యాలయాలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, కార్యాలయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్నివర్గాల ప్రజలు/యువా/పిల్లలకు ఆత్మీయ నేస్తంగా, గౌరవాన్ని పెంచే చవకైన సాధనంగా, జేబుకు అలంకారంగా బాల్‌పాయింట్ పెన్ను అపార అద్వితీయ సేవలను అందిస్తున్నది. బాల్‌పాయింట్ పెన్ సాధనంగా విద్యా బోధనలు, సాంస్కృతిక వికాసం, ఆర్థిక వ్యవస్థలు, సగటు మనిషి జీవనశైలిలో ఓ అవిభాజ్య భాగం అయ్యింది. ఒక్క బాల్‌పాయింట్ పెన్‌తో దాదాపు 50,000 పదాలు రాస్తూ 100 పేజీల వరకు రాయవచ్చు. ప్రతి ఒక్కరు సాలీనా సగటున 4.3 బాల్ పెన్నులను వాడడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 125 బాల్ పెన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. పలు రకాల బ్రాండ్లు, అద్భుత ఆకృతులు, ఆకర్షణీయ కళా సంపదలతో బాల్ పెన్నులు మనకు అందుబాటులో ఉన్నాయి. తరగతి గది గుండెకాయ బాల్ పెన్ అని తెలుసుకోవాలి. అందరికీ చవకగా అందుబాటులో ఉన్న బాల్‌పాయింట్ పెన్నులు నమ్మకమైన, నాణ్యమైన, మృదురాతల ధారలు పారిస్తున్నాయి. తేలికగా పేపరుపై పారడం, సులభంగా ఆరిపోవడం, అందమైన రాతలకు వారధిగా కావడం బాల్ పెన్ను ప్రత్యేకతలుగా పేర్కొనాలి.

ఆకర్షణీయమైన రంగులు, వివిధ కాళాకృతులతో నేడు బాల్ పెన్నులు పిల్లలు/యువతలో చదుకోవాలనే, రాయాలనే ఉత్సుకతను ప్రేరేపిస్తున్నాయి. నేడు అందమైన బాల్‌పాయింట్ పెన్నులు వ్యక్తుల స్థాయిని, వ్యక్తిత్వాలను చెప్పకనే చెబుతున్నాయి. మన జేబులో చేరిన పెన్ను మన హృదయ ఉపరితలంపై నాట్యమాడుతూ మనకు సమోన్నత గౌరవాన్ని ఆర్జించి పెడుతున్నాయి. మన జీవితంలో ఒక విడదీయరాని భాగమైన బాల్‌పాయింట్ పెన్నులను పూజాగదిలో ఇష్టదైవం ముందు పెట్టి మనకు విజ్ఞాన వివేకాలను అందించమని వేడుకుందాం. మన బాల్‌పాయింట్ పెన్నుకు శతకోటి వందనాలు అర్పిద్దాం, సన్మార్గంలో నడిచే ధైర్యాన్ని ఇవ్వమని వేడుకుందాం.

– డా.బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సరికొత్త ఆవిష్కరణల దిశగా అడుగు!

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' భవిష్యత్తులో చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష యాత్రకు ఎంతగానో ఉపయోగపడే ఆక్సియమ్ మిషన్ 4 (ఎఎక్స్4) అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది. భారత కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం జరగాల్సిన రోదసీయాత్ర బుధవారానికి వాయిదాపడినప్పటికీ, భారతవ్యోమగామి శుభాంశు శుక్లా కూడా భాగస్వామి కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి భారతీయుడు రాకేశ్ శర్మకాగా, శుక్లా రెండో వ్యక్తిగా రికార్డు పుటల్లో చోటు సంపాదిస్తాడు. అంతేగాక, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగుపెట్టనున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించనున్నాడు. ఈ ప్రయోగం కేవలం భారతీయులకు మాత్రమేగాక, యావత్ మానవాళికి కూడా ఎంతో కీలకంగా మారింది. సరికొత్త ఆవిష్కరణల దిశగా శాస్త్రవేత్తలు కృషి చేయనున్న తరుణంలో, బుధవారం ఐఎస్ఎస్‌కు బయలుదేరనున్న మొత్తం నలుగురు వ్యోమగామలు చేయబోయే ప్రయోగాలపై ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాయి. ఇది కేవలం ఎఎక్స్4 ప్రయోగం గురించి మాత్రమేగాక, మార్గదర్శక పరిశోధనల గురించి కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ యాత్ర ఆక్సియమ్ స్పేస్ నిర్వహించిన ఏ మిషన్లలోనూ లేనంత విస్తృతమైన శాస్త్రీయ ప్రయోగాలు, సాంకేతిక ప్రదర్శనలను చేపట్టడానికి సిద్ధంగా ఉంది. ఐఎస్ఎస్‌లో ఉన్న అధునాతన ప్రయోగశాలలను ఉపయోగించుకుని సిబ్బంది 60కిపైగా పరిశోధనలను నిర్వహిస్తారు. ఇది ప్రపంచ శాస్త్ర రంగానికి దాని లోతైన ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. భవిష్యత్ మానవ అన్వేషణకు, మన భూమిని అర్థం చేసుకోవడానికి కీలకమైన వివిధ రంగాలలో ఈ పరిశోధనలు దోహదపడతాయి. కాగా, మన దేశానికి, శుక్లా భాగస్వామ్యం ఒక ప్రత్యేక శాస్త్రీయ దృష్టిని తీసుకువస్తుంది. అతను ప్రత్యేకంగా ఆహారం, పోషకాల సంబంధిత ప్రయోగాలను నిర్వహిస్తాడు. ఇవి ఇస్రో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ మధ్య ఒక మార్గదర్శక సహకారంతో అభివృద్ధి చేయబడ్డాయి. దీనికి నాసా నుండి ప్రత్యక్ష మద్దతు ఉంటుంది. ఈ అద్భుతమైన అధ్యయనాలు అంతరిక్ష పోషణను అభివృద్ధి చేయడం, భవిష్యత్ దీర్ఘకాల అంతరిక్ష మిషన్లకు, చంద్రుడు, అంగారక గ్రహయాత్రలతో సహా, అవసరమైన స్వీయనిలకడగల జీవనోపాధి వ్యవస్థలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. మైక్రోగ్రావిటీలో మెంతి, పెసర వంటి మన భారతీయ ప్రధాన ఆహార ధాన్యాలను విజయవంతంగా మొలకెత్తించడం వంటి వినూత్న ఆలోచనలను ఆసక్తి రేపుతున్నాయి. ఇది స్థిరమైన అంతరిక్ష ఆహారాలకు ఒక గొప్ప ముందడుగు. శుక్లా నాసా మానవ పరిశోధన కార్యక్రమం కోసం ప్రణాళిక చేయబడిన ఐదు ఉమ్మడి అధ్యయనాలకు కూడా గణనీయంగా సహకరిస్తాడు. మన భారతీయ శాస్త్రీయ ప్రయత్నాలను విస్తృత అంతర్జాతీయ కార్యక్రమాలలో మరింత సమగ్రంగా అనుసంధానిస్తాడు. భారత దేశ నాయకత్వంలోని ప్రాజెక్టులతో పాటు, యాత్ర విస్తృతమైన శాస్త్రీయ అధ్యయనాలలో ఇవి ఉన్నాయి:



**మానవ పరిశోధనలు..**

సూక్ష్మ గురుత్వాకర్షణలో కంప్యూటర్ స్క్రీన్‌ల శారీరక, మానసిక ప్రభావాలపై లోతైన పరిశోధనలు... మెదడుపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావం, కీళ్ళు, రక్త ప్రవాహం, రోగనిరోధక వ్యవస్థపై అంతరిక్ష ప్రయాణం ప్రభావం... మానవ అనుకూలతపై సమగ్ర డేటా సేకరణ. ఇన్సులిన్ ఆధారిత డయాబెటిస్‌తో బాధపడుతున్న వ్యోమగాములకు అంతరిక్షంలో మద్దతు ఇవ్వడం, మెదడుకు రక్త ప్రవాహం ఎలా అనుకూలంగా ఉంటుందో అర్థం చేసుకోవడం వంటి కీలక ప్రశ్నలు కూడా పరిష్కరించబడతాయి.

**జీవ, జీవశాస్త్ర విజ్ఞానాలు...**

సూక్ష్మ గురుత్వాకర్షణలో మైక్రోఅల్గే, సైనోబాక్టీరియా జాతుల పెరుగుదల, జీవక్రియ, జన్యుశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేయడం; రేడియేషన్ వల్ల డీఎన్ఏ దెబ్బతినడాన్ని పండ్ల ఈగలు ఎలా ఎదుర్కొంటాయో పరిశోధించడం. అంతరిక్షంలో మొక్కలు మొలకెత్తడం, మైక్రోగ్రీన్ ఉత్పత్తి, ఆకు అభివృద్ధిపై అధ్యయనాలు భవిష్యత్ అంతరిక్ష నివాసాల రూపకల్పనకు నేరుగా ఉపయోగపడతాయి.

**పదార్థ విజ్ఞానం, భూమి పరిశీలన...**

అధునాతన పదార్థ విజ్ఞానంలో ప్రయోగాలు.. మన గ్రహం ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి కీలకమైన భూమి పరిశీలన కార్యకలాపాలు... భవిష్యత్ మిషన్ల కోసం వ్యోమగాముల వస్త్రాల ఉష్ణ బదిలీ, సౌకర్యాన్ని మెరుగుపరచడానికి అనుకరణలను ధృవీకరించడం.

**అంతరిక్ష భవిష్యత్తుకు మార్గదర్శనం – మనందరి బాధ్యత!**

ఆక్సియమ్ మిషన్ 4 కేవలం ఒక చిన్న అంతరిక్ష ప్రయాణం కాదు. ఇది మొదటి వాణిజ్య అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించడానికి ఆక్సియమ్ స్పేస్ మొత్తం లక్ష్యంలో ఒక ముఖ్యమైన భాగం. ఐఎస్ఎస్‌కు ప్రైవేటు మిషన్ల సాధ్యత, భద్రత, అపారమైన శాస్త్రీయ విలువను నిరంతరం ప్రదర్శించడం ద్వారా, ఎఎక్స్4 వాణిజ్య కక్ష్య వేదికలు అంతర్జాతీయ వ్యాపారం, అత్యాధునిక పరిశోధన, సహకార మానవ అన్వేషణకు బలమైన కేంద్రాలుగా మారగలవని బలపరుస్తుంది. మన భారతదేశానికి, ఈ యాత్ర దాని అంతరిక్ష సామర్థ్యాలను మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్ వాణిజ్య భాగస్వామ్యాలకు, ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ భాగస్వామ్యానికి తలుపులు తెరుస్తుంది. ఈ మార్గదర్శక యాత్ర అంతరిక్షానికి ప్రాప్యత విస్తరించబడిన భవిష్యత్తు వైపు ఒక ధైర్యమైన అడుగు వేస్తుంది. తద్వారా మానవాళి అందరి ప్రయోజనం కోసం అపూర్వమైన శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ఎఎక్స్4లో మన భారతదేశ అంతర్భాగ పాత్ర అంతరిక్షాన్ని అన్వేషించడానికి దాని నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఇది కేవలం జాతీయ ప్రయత్నం మాత్రమే కాదు, భూమికి మించి మానవాళి సామూహిక ప్రయాణానికి ఒక కీలకమైన సహకారి కూడా. ఈ అద్భుతమైన ప్రయాణం విజయవంతం అవ్వాలని కోరుకుందాం.


– జనక మోహన రావు దుంగ, 8247045230

# న్యాయవ్యవస్థపై నమ్మకమెట్లా కుదిరేది?

గత మార్చి నెలలో ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీ స్థాయిలో కాలిపోయిన నోట్ల కట్టల ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ దృశ్యాలన్నీ ప్రముఖ టీవీ ఛానళ్లలో ప్రసారమవ్వడమే కాకుండా అన్ని పత్రికలు పతాక శీర్షికన ఆ వార్తను ప్రచురించడంతో న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకున్నాయని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతే కాక అపనమ్మకం కలిగించే ఇలాంటి సంఘటనల గురించి ప్రజలు పలు విధాలుగా చర్చించుకునేందుకు తావివ్వడంతో పాటు ఇలాంటి సంఘటనలు అన్ని వ్యవస్థల్ని అసంతృప్తికి గురిచేస్తాయని వారు వాపోతున్నారు. సగటు పౌరుని అనుమానాన్ని నివృత్తి చేయడం ద్వారా న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోంది. దానికోసం వడివడిగా అడుగులు వేస్తోంది. అందుబాటులో ఉన్న అన్ని అస్త్రాలను సంధించి జస్టిస్ వర్మను సాగనంపడానికి సిద్ధపడుతోంది. జస్టిస్ వర్మ ఇంట్లోకి ఆ నోట్లకట్టలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అనే దానిపై విచారణ చేపట్టడానికి కోర్టులు అనుమతించలేదు. ఎఫ్ఐఆర్ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. సుప్రీంకోర్టు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనప్పటికీ సుప్రీంకోర్టుయే చొరవ తీసుకుని ఇన్ హౌస్ కమిటీని వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వర్మకు కీలక సూచనలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు జస్టిస్ వర్మను ఢిల్లీ నుండి అలహాబాద్ కోర్టుకు బదిలీ చేసింది. ఆయన అలహాబాద్‌కు వస్తే బహిష్కరిస్తామని అక్కడి బార్ కౌన్సిల్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన రావడం రిపోర్టు చేయడం జరిగిపోయినప్పటికీ కేసులు అసైన్ చేయలేదు. అలా చేయడం న్యాయవ్యవస్థపై ప్రజల మనసులలో తొలుస్తున్న అనుమానాలకు సమాధానం కాదని పలువురు న్యాయకోవిదులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే అంశంపై ఉపరాష్ట్రపతి జగదీప్ దన్ ఖడ్ కూడా రెండోసారి వ్యాఖ్యానించడం ఈ సంఘటన ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నదో అవగతం అవుతున్నది. వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచాలనే ఉద్దేశంతోనే అభిశంసన తీర్మానము అనేది రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడింది. ఈ అభిశంసన అనేది హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు, ఆరోపణలు తలెత్తినప్పుడు వారిని తొలగించేందుకు చేపట్టే ప్రక్రియ. ఇది చట్టపరంగా పార్లమెంటుకు ఉన్న ప్రత్యేకమైన వెసులుబాటు. ఈ ప్రక్రియను జడ్జెస్ ఎంక్వయిరీ యాక్ట్ 1968 ద్వారా చేపడతారు. లోక్‌సభలో అయితే కనీసం 100మంది, రాజ్యసభ అయితే 50 మంది సభ్యులు ఈ తీర్మానం మీద సంతకం చేయాలి. రాజ్యసభ చైర్మన్ లేదా లోక్ సభ స్పీకర్ చేత నియమించబడ్డ విచారణ కమిటీ ద్వారా నివేదిక ఇవ్వబడుతుంది. ఆ నివేదిక ద్వారా న్యాయమూర్తి దోషిగా తేలితే దానిని పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టబడి మూడింట రెండో వంతు మెజారిటీతో ఆమోదించబడితే రాష్ట్రపతి సదరు న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఆ మెజారిటీ సాధించడం అధికార పక్షానికి పెద్ద కష్టమేమీ కాదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. విపక్షాలపై ఆధారపడకుండానే అభిశంసన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ వర్మ తీరును విపక్షాలు సైతం తప్పు పడుతుండడంతో అభిశంసనకు మరింత బలం చేకూరడం తథ్యమని విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు. యశ్వంత్ వర్మ కేసు విషయంలో సుప్రీంకోర్టు నియమించిన ఇన్ హౌస్ కమిటీ నివేదికలో భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టల ఆధారాన్ని బలంగా పేర్కొనడంతో అభిశంసనకు మరింత మద్దతు పెరగడం ఖాయమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అభిశంసన ప్రక్రియలు చాలా అరుదుగానే జరిగాయి. 1991లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వి రామస్వామిపై ఆర్థిక అవకతవకల ఆరోపణలతో లోక్ సభలో 108 మంది సభ్యులచే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెసు గైర్హాజరు కావడంతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆయన పూర్తి కాలం కొనసాగినప్పటికీ ఆయనకు కేసులు మాత్రం అసైన్ చేయలేదు. ఇక 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ పై ఆర్థిక అవకతవకలపై రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. లోక్ సభలో ఓటింగ్‌కు ముందే ఆయన రాజీనామా చేయడంతో ఆ వివాదం అంతటితో ముగిసిపోయింది. 2017లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున్ రెడ్డిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబడినప్పటికీ కొంతమంది ఎంపీలు తమ సంతకాలను ఉపసంహరించడంతో అది కూడా వీగిపోయింది. 2018లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై రాజ్యసభలో విపక్షాలన్నీ ఏకమై రాజకీయపరమైన అభిప్రాయాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ చైర్మన్ దాన్ని ప్రాథమిక దశలోని తిరస్కరించడంతో తీర్మానం ముందుకు పోలేదు. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమేనని చీకట్లో ఇంకా ఎన్ని ఉన్నాయోనని ప్రజాస్వామికవాదులు గుసగుసలాడుకుంటున్నారు. రాజ్యాంగ పరమైన అంశాలపై ఇటీవల దాఖలైన పలు పిటిషన్లను నామమాత్రమైనా పరిశీలించకుండానే ఆదిలోనే కొట్టివేయడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే పార్లమెంటును సైతం న్యాయమూర్తుల నియామకంలో భాగస్వామ్యం చేయకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. మరో పక్క స్వయం ప్రతిపత్తి అనే పేరున న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేపట్టడం వల్ల పారదర్శకత లోపిస్తున్నదని, జవాబుదారితనం అడుగంటుతుండడమేకాక 'అంకుల్ జడ్జ్ సిండ్రోమ్'వల్ల తమ అనుయాయులకే పెద్దపీట వేసే అవకాశం ఉన్నదని న్యాయ కోవిదులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకువచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ తరహాలో సరికొత్త కమిషన్‌ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సైతం కోరుతున్నారు.

లేఖ

– భాస్కర్ యలకంటి
8919464488



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గుజరాత్ హైకోర్టుకు బాంబు బెదిరింపు



**అహ్మదాబాద్:** గుజరాత్ హైకోర్టులో బాంబు పెట్టామంటూ ఈ మెయిల్ ద్వారా సంబంధిత అధికారులకు బెదిరింపు మెయిల్ వచ్చింది. దాంతో అహ్మదాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్‌తో హైకోర్టుకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి బాంబులు కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు అహ్మదాబాద్ డిప్యూటీ కమిషనర్ సఫిన్ హసన్ తెలిపారు. బెదిరింపు మెయిల్ పంపిన దుండగుడిని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మధ్య కాలంలో ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్‌లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు ఇలా అన్నింటికి బాంబు బెదిరింపులు వస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌ల ద్వారా, ఈ మెయిల్‌ల ద్వారా ఇలాంటి బెదిరింపు సందేశాలు పంపుతున్నారు. తాజాగా గుజరాత్ హైకోర్టుకు ఇలాంటి బెదిరింపు మెయిల్ వచ్చింది.

## విచారణకు మనీశ్ సిసోదియా గైర్హాజరు



**న్యూఢిల్లీ:** అవినీతి కేసు విచారణకు ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీశ్ సిసోదియా సోమవారం గైర్హాజరయ్యారు. ఈ విషయాన్ని ఎసిబి అధికార వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో రూ. రెండు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ ఆప్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్‌లపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ నిమిత్తం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వారికి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో సిసోదియా అవినీతి నిరోధకశాఖ ఎదుట హాజరవ్వాల్సి ఉండగా... సిసో దియా విచారణకు రాలేరని ఆయన తరపున న్యాయవాది తెలిపినట్లు ఏసీబీ వర్గాలు పేర్కొన్నాయి. మళ్లీ సమన్లు జారీ చేస్తామని ఎసిబి అధి కారులు వెల్లడించారు. ఈ కేసులో మనీశ్ సిసోదియాతో పాటు సత్యేందర్ జైన్‌ను కూడా ఏసీబీ విచారణకు పిలిచింది. శుక్రవారం జరిగిన విచారణకు ఆయన హాజరయ్యారు. అక్రమంగా ఆర్కి టెక్ట్‌లను నియమించిన అంశంపై ఆయన సమాధానాలు ఇవ్వలేదన్నారు. జైన్‌ను మళ్లీ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలిపారు.

## మణిపూర్‌లో భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్

**ఇంఫాల్:** మణిపూర్‌లో భద్రతా బలగాలు కీలక సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. భారత సైన్యం, అస్సాంరైఫిల్స్ కలిసి కొండ, లోయ ప్రాంత జిల్లాల్లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. కాంగ్‌పోక్పి, తౌబల్, కక్చింగ్, తెంగ్నౌపాల్, బిష్ణుపూర్, జిరిబామ్, ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామని, ఈప్రత్యేక ఆపరేషన్ మే 26 నుంచి జూన్ 5 వరకు చేట్టామన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 40 ఆయుధాలు, తొమ్మిది ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్, గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రి, యుద్ధ సామగ్రి దుకాణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని చాడోంగ్ సాధారణ ప్రాంతంలో క్యాడర్ల కదలిక, ఐఈడీల ఉనికిపై నిర్దిష్ట నిఘా సమాచారం ఆయా స్థావరాలపై దాడులు చేశామని అధికారులు పేర్కొన్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్ నుంచి దేశభక్తిని సిపిఐ నేర్చుకోవాలా?

- కేరళ గవర్నర్ ధోరణిపై సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ధ్వజం
- అసలు మీ భారతమాత ఎవరో స్పష్టం చేయండని గవర్నర్‌పై ప్రశ్నల బాణాలు
- వలసపాలన నుంచి ఈ దేశానికి స్వాతంత్ర్యం కోసం గొప్ప త్యాగాలు చేసింది సిపిఐ...ఆర్‌ఎస్‌ఎస్ చేసిందేమిటి ?



**న్యూఢిల్లీ:** ముఖ్యమైన రాజ్యాంగపదవిలో ఉన్న కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల విధానాలను అనుసరించడంపట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిప్పులుచెరిగింది. గవర్నర్ తన భారతమాత ఎవరో స్పష్టం చేయాలని సోమవారం సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా గట్టిగా ప్రశ్నించారు. దేశభక్తి అనేది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) నుంచి నేర్చుకోవాల్సిన అవసరం తమ పార్టీకి ఎంతమాత్రం లేదని సిపిఐ అగ్రనేత డి.రాజా తేల్చిచెప్పారు. ఇటీవల తిరువనంతపురంలోని రాజ్‌భవన్‌లో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖలతో సంబంధం కలిగిఉందని ఆరోపించబడిన భారతమాత చిత్రపటాన్ని కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఉపయోగించడం ఈ వివాదానికి దారితీసింది. ఆ కార్యక్రమంలో గవర్నర్ ధోరణిని నిరసిస్తూ కేరళ మంత్రి, కమ్యూనిస్టుపార్టీ నాయకుడైన పి.ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఈ ఘటన తీవ్ర రాజకీయదుమారం తలెత్తడానికి కారణమయ్యింది. కేరళలోని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)లో సిపిఐ రెండవ అతిపెద్ద పార్టీగా ఉంది. 'కేరళ గవర్నర్ భారతమాత గురించి, మూడు రంగుల గురించి ఏమి అర్థం చేసుకున్నారో నాకు తెలియదు. నేను ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చాలా గట్టిగానే లేవనెత్తాను. మీ భారతమాత ఎవరు? దయచేసి మాకు చెప్పండి' అని మాజీ రాజ్యసభ ఎంపి, సిపిఐ అగ్రనేత డి.రాజా ప్రశ్నిస్తూ 'పిటిఐ'తో మాట్లాడారు. 'మన భారతమాత వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తోంది. మన భారతమాత అడవుల్లో పనిచేస్తోంది. జల్‌జమీన్‌జంగిల్‌కు సురక్షిత కాపలాదారుగా ఉంటోంది. మన భారతమాత పాఠశాలల్లో, కార్యాలయాల్లో, కర్మాగారాల్లో పనిచేస్తోంది. మన భారతమాత ఆర్మీని, రక్షణబలగాలలో పనిచేస్తోంది. మీ భారతమాత ఎవరు? మీ భారతమాత ఎవరనేది స్పష్టంగా తెలియడం లేదు' అని డి.రాజా అన్నారు. 'వారు (బిజెపిఆర్‌ఎస్ ఎస్) త్రివర్ణపతాకానికి తామే యజమానులమని భావిస్తున్నారు. వారు ఎప్పుడూ దేశస్వాతంత్ర్యం కోసం పనిచేసిన దాఖలాలే లేవు. వలసపాలన నుండి ఈ దేశానికి స్వాతంత్ర్యం కోసం సిపిఐ పోరాటం చేసింది. అనేక గొప్ప త్యాగాలను చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ ఏమి చేసింది?' అని డి.రాజా ప్రశ్నల అస్త్రాలను సంధించారు. సిపిఐ ప్రారంభమైన సంవత్సరంలోనే ఆర్‌ఎస్‌ఎస్ కూడా స్థాపించబడిందని, అయితే స్వాతంత్ర్యం కోసం ఆర్‌ఎస్‌ఎస్ నిర్వర్తించిన పాత్ర ఏమిటో చెప్పాలని డి.రాజా గట్టిగా ప్రశ్నించారు. 'స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమిటో చెప్పాలి? భారతమాతను ఆర్‌ఎస్‌ఎస్సే నిర్వచించిందనివారు అనుకుంటున్నారు. అంతేకాకుండా గవర్నర్ల రాజ్‌భవన్లు ఆర్‌ఎస్‌ఎస్ భవనాలు' అని కూడా వారు అనుకుంటున్నారేమో' అని డి.రాజా కేరళ గవర్నర్ అర్లేకర్ అనుసరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల భావజాలాన్ని తూర్పారబట్టారు. వారు మన జాతీయతను, దేశభక్తిని ప్రశ్నిస్తున్నారు.'కమ్యూనిస్టులు బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ నుంచి జాతీయవాదం లేదా దేశభక్తిని నేర్చుకుంటున్న చివరి వ్యక్తులు అనుకుంటున్నారేమో. గవర్నర్‌కు భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామం గురించి ఏమీ తెలియదు. భారత కమ్యూనిస్టుపార్టీ చేసిన త్యాగం ఏమిట నేది కూడా అసలు ఏమీ తెలియదు' అని డి.రాజా మండిపడ్డారు. రాజ్‌భవన్‌లో జరిగిన పర్యావరణదినోత్సవంనాడు భారతమాత చిత్రపటాన్ని ఉపయోగించాలని రాజ్‌భవన్ నిర్ణయించడంతో ఈ వివాదం తలెత్తింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న కేరళ వ్యవసాయ శాఖమంత్రి, సిపిఐ నేత కూడా అయిన పి.ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని అక్కడికక్కడే బహిష్కరించి, అక్కడ నుంచి నిష్క్రమించారు. ఆ చిత్రపటాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఉపయోగించిందని, రాజ్యాంగం లేదా భారత ప్రభుత్వం ఆ చిత్రపటాన్ని అధికారిక వెర్షన్‌గా ఆమోదించ లేదని ఆయన చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేసిన తర్వాత కేరళగవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏవర్గాల నుంచి ఒత్తిడి వచ్చినా భారతమాతపై ఎటువంటి రాజీఉండదన్నారు. ఆతర్వాత సిపిఐ విడుదల చేసిన ఒక ప్రకటనలో గవర్నర్ ధోరణిని నిరసిస్తూ శనివారంనాడు తన అన్నిశాఖలలో భారతమాత చిహ్నంగా జాతీయపతాకాన్ని ఎగురవేస్తామని, అలాగే మొక్కలు నాటుతామని ప్రకటించారు.

## కర్ణాటక హైకోర్టుకు ఆర్సీబీ

**బెంగళూరు:** ఇటీవల చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాటకు సంబంధించి తమపాత్ర ఏమీ లేదని కర్ణాటక హైకోర్టుకు ఆర్‌సీఎస్‌ఎల్ తెలిపింది. విజయోత్సవాలకు పరిమితంగానే పాస్‌లు ఉన్నాయని, ఉచిత రిజిస్ట్రేషన్ పాసుల కోసం ముందుగానే రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని సోషల్ మీడియా ద్వారా తాము చాలా స్పష్టమైన ప్రకటనలు చేసినట్లు పేర్కొంది. చిన్నస్వామి స్టేడియం వెలుపల జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనపై ఐపీఎల్ టీమ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఓనర్ రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్(ఆర్‌సీఎస్‌ఎల్), ఈవెంట్ ఆర్గనైజర్ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు కర్నాటక హైకోర్టును సోమవారం నాడు ఆశ్రయించాయి. తమపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని కోరాయి. తొక్కిసలాటకు దారితీసిన క్రౌడ్ మేనేజ్మెంట్‌లో తమ పాత్ర ఏమీ లేదని ఆర్‌సీఎస్‌ఎల్ తమ పిటిషన్‌లో పేర్కొంది. స్టేడియం గేట్లు తెరవడంలో ఆలస్యం జరిగిందనీ ఆరోపించింది. షెడ్యూల్ ప్రకారం 1:45 గంటలకు గేట్లు తెరవాల్సి ఉండగా.. 3.00 గంటలకు తెరిచారని, దీంతో ఒక్కసారిగా జనం అక్కడకు చేరుకున్నారని తెలిపింది.

### పోలీసుల వైఫల్యమే..

డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ మరో పిటిషన్‌లో పోలీసులు, రాష్ట్ర అధికారుల వైఫల్యమే తొక్కిసలాటకు కారణమని ఆరోపించింది. 3లక్షల మందికి పైగా ప్రజలు వచ్చినప్పుడు వారిని కంట్రోల్ చేయడంలో పోలీసులు, రాష్ట్ర అధికారులు విఫలమయ్యారని పేర్కొంది. తగినన్ని పోలీసు బలగాలను మోహరించకపోవడం, లాఠీచార్జ్ జరపడంతో ఈవెంట్‌కు హాజరయ్యేందుకు వచ్చిన వారు ఆందోళనకు గురయ్యారని, దీంతో స్టేడియం వెలుపల రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తొక్కిసలాట జరిగిందని వివరించింది. ఎక్కువ మంది పోలీసులను విధానసభ వద్దే మోహరించి, స్టేడియం వద్ద తగినంత సిబ్బంది లేకుండా చేసినట్టు కూడా ఆరోపించింది. క్రమశిక్షణా చర్య నుంచి తప్పించుకునేందుకు కుబ్బన్ పార్క్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుమోటో ఫిర్యాదు చేసినట్టు డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ ఆరోపించింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా హడావిడిగా పక్షపాత వైఖరితో తమపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్టు తెలిపింది. జూన్ 6వ తేదీ ఉదయం ఎలాంటి విచారణ లేకుండానే కంపెనీకి చెందిన ఇద్దరు అధికారులను అరెస్టు చేసినట్టు పేర్కొంది. నేరుగా తమ తప్పిదం ఉన్నట్టు ఎలాంటి సాక్ష్యాలూ లేనందున తమపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని ఆర్‌సీఎస్‌ఎల్, డీఎన్‌ఏలు తమ పిటిషన్లలో హైకోర్టును కోరాయి.

## మోదీ ప్రభుత్వానికి సున్నా మార్కులు

### కర్నాటక సిఎం సిద్ధరామయ్య



**మైసూర్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ప్రభుత్వానికి తాను 'సున్నా మార్కులు' ఇస్తానన్నారు. కేవలం 'ప్రచారం'పై మాత్రమే మనుగడ సాగించిందని ఆరోపించారు. సిద్ధరామయ్య మైసూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయింది, కానీ తన ప్రభుత్వం ప్రచారంపై మాత్రమే ఆధారపడి ఉందని, ప్రచారంపైనే మనుగడ సాగిస్తోందని అన్నారు. 'నోట్ల రద్దు వల్ల ఎవరు లాభపడ్డారు? ఆయన (మోదీ) 'అచ్చేదిన్ ఆయేగా' (మంచి రోజులు వస్తాయి) అని అన్నారు, ఏం జరిగింది? ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు? దానికి ఏమైంది? రైతుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు, దానికి ఏమైంది? రైతులు తమ సమస్యలను పరిష్కరిస్తే ఒక సంవత్సరం పాటు ఎందుకు నిరసన తెలిపారు?' అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చనందుకు సిద్ధరామయ్య తీవ్రంగా విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో చాలావరకు నెరవేరలేదన్నారు. మోదీ ప్రభుత్వం 'తప్పుడు ప్రచారం సృష్టిస్తోంది' అని ఆరోపిస్తూ, మీడియా ఆయనకు అధిక ప్రచారం ఇస్తుందని, తమ ప్రభుత్వం హామీ పథకాలను ప్రకటించినప్పుడు, వారు (బిజెపి) వాటిని అమలు చేయలేమని, రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీస్తుందని ప్రచారం చేస్తున్నారు, కానీ అదే పథకాలను వారు కాపీచేసి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో అమలు చేశారు మండిపడ్డారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, పన్నుల 50 శాతం వికేంద్రీకరణను డిమాండ్ చేశారని సిద్ధరామయ్య గుర్తు చేసుకున్నారు. 'కానీ ఆయన ప్రధానమంత్రి అయిన తర్వాత ఏమి చేశారని ప్రశ్నిస్తూ... మీరు (మీడియా) వాటన్నింటినీ ఎత్తి చూపలేదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ. 5,300 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారు, మరి ఇచ్చారా? అని ప్రశ్నించారు. 15వ వేతన సంఘం రాష్ట్రానికి రూ. 11,495 కోట్లు సిఫార్సు చేసింది, ఇచ్చారా? ఇది పెద్ద విషయం కాదా?' అని ఆయన ప్రశ్నించారు. కర్ణాటకకు న్యాయం చేయాలని అడిగితే, మౌనంగా ఉంటారు, బదులుగా తప్పుడు ప్రచారం చేస్తారని మండిపడ్డారు.

## ఓటర్ల జాబితా ఎప్పుడిస్తారు: రాహుల్

**న్యూఢిల్లీ :** హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల జాబితా వివరాలను కచ్చితంగా ఏతేదీ లోగా డిజిటల్, కంప్యూటర్‌లో చదివే నమూనాలో ఇస్తారని ఎన్నికల కమిషన్‌ను ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ జాబితాలను అందజేస్తామని ఎన్నికల కమిషన్ నిర్ణయించడాన్ని మొదటి మంచి అడుగు అని ఆయన స్వాగతించారు. హర్యానా, మహారాష్ట్రలకు సంబంధించి 2009 నుంచి 2024 వరకు ఓటర్ల జాబితాలను అందజేస్తామని ఎన్నికల కమిషన్ చెప్పినట్లు వచ్చిన వార్తను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. గత ఏడాది జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఇటీవల రాహుల్ గాంధీ రాసిన ఆర్టికల్ పత్రికల్లో ప్రచురితమైంది. దానిపై ఎన్నికల సంఘం వర్గాల పేరుతో స్పందన వచ్చింది.

### కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు

## తహవ్వూర్ రాణాకు కోర్టు అనుమతి



**న్యూఢిల్లీ :** ముంబయి ఉగ్రదాడి కేసులో అరెస్టై ఎన్‌ఐఎ కస్టడీలో ఉన్న తహవ్వుర్ హుస్సేన్ రాణా తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. జైలు నిబంధనలకు అనుగుణంగా, తీహార్ జైలు సీనియర్ అధికారి పర్యవేక్షణలో రాణా తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడొచ్చని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు తెలిపింది. ప్రస్తుతం కస్టడీలో ఉన్న 64 ఏళ్ల తహవ్వూర్ రాణా తన కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మే 27న న్యూఢిల్లీలోని కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు అందుకు అనుమతి ఇచ్చింది. జైలు నిబంధనల ప్రకారం.. రాణాకు భవిష్యత్తులో క్రమం తప్పకుండా ఫోన్‌లో మాట్లాడే వెసులుబాటు కల్పించాలా వద్దా అనేదానిపై జైలు అధికారుల నుంచి కోర్టు వివరణాత్మక నివేదికను కోరింది. అంతేకాదు, రాణా ఆరోగ్య సమస్యలపై కూడా నివేదికను పది రోజుల్లో సమర్పించాలని ఆదేశించింది. ముంబయి ఉగ్రదాడి కుట్రదారు డేవిడ్ కోల్‌మాన్ హెడ్లీతో తహవూర్ రాణాకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఇద్దరూ కలిసి ఉగ్రదాడికి ప్రణాళిక రచించారు. దాడి అనంతరం అమెరికాకు పారిపోయిన రాణాను ఇటీవలే స్వదేశానికి రప్పించారు. భారత్ అప్పగించవద్దంటూ రాణా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దాంతో అతడిని భారత్‌కు అప్పగించారు. కాగా భారత్‌లో అక్రమంగా చొరబడిన 10 ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తమ నరమేథం మొదలుపెట్టారు. రెండు లగ్జరీ హోటళ్లు, రైల్వేస్టేషన్, జెవిస్ సెంటర్ ఇలా నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 60 గంటలపాటు సాగిన నరమేథంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు భద్రతాసిబ్బంది కూడా ఉన్నారు. భద్రతా బలగాల దాడిలో 9 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాది కసబ్‌ను ప్రాణాలతో పట్టుకున్నారు. ఆ తర్వాత అతడికి ఉరిశిక్ష విధించారు.

# భార్యే... సూత్రధారి!

- పర్యాటకుడు..రాజారఘువంశీని హత్య చేయించి సోనమ్
- మేఘాలయ డిజిపి ఐ.నాంగ్‌రాంగ్ వెల్లడి
- ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని నంద్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన సోనమ్ రఘువంశీ
- ఈ కేసులో ఐదుగురు నిందితులు అరెస్ట్



**షిల్లాంగ్ / లక్నో:** భార్యతో హనీమూన్‌కు వెళ్లిన ఇండోర్ పర్యాటకుడు రాజా రఘువంశీ మేఘాలయలో హత్యకు గురైన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న నేపథ్యంలో హత్య మిస్టరీని మేఘాలయ పోలీసులు ఛేదించారు. ఈ హత్యకేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడి భార్య సోనమ్ రఘువంశీ నియమించిన వ్యక్తులే రాజా రఘువంశీని హత్యచేసినట్లు మేఘాలయ పోలీసులు నిర్ధారించారు. ఈ దారుణ హత్య పూర్వాపరాలను మేఘాలయ డిజిపి సోమవారం వెల్లడించారు. ఆమె 'పిటిఐ'తో మాట్లాడుతూ భార్య సోనమ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో నంద్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిందని, రాత్రిపూట జరిగిన దాడుల్లో ముగ్గురు దుండగులను అరెస్ట్ చేశామని చెప్పారు. అరెస్ట్ అయిన ముగ్గురిలో ఇద్దరు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందినవారని, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని లలిత్‌పూర్‌కు చెందిన ఒకరు ఉన్నారని వెల్లడించారు. 'పిటిఐ' వీడియో ప్రకారం ఈస్ట్ ఖాసీ హిల్స్ ఎస్‌పి వివేక్ సయీమ్ మాట్లాడుతూ సోమవారం మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా నుంచి మరొకరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మే23న మేఘాలయలోని ఖాసీహిల్స్ జిల్లాలోని సోహ్రా ఏరియాలో సెలవులకు వెళుతుండగా రాజా రఘువంశీ, ఆయన భార్య సోనమ్ రఘువంశీ తప్పిపోయారని చెప్పారు. జూన్ 2న రాజా రఘువంశీ మృతదేహం ఒక లోయలో కనిపించిందన్నారు. డిజిపి ఐ.నాంగ్ రాంగ్ మాట్లాడుతూ ఒక వ్యక్తిని ఉత్తర్‌ప్రదేశ్‌లో అరెస్ట్ చేసి తీసుకువచ్చామని, మరో ఇద్దరు నిందితులను సిట్ ఇండోర్‌లో పట్టుబడగా అక్కడ నుంచి తీసుకురావడం జరిగిందని డిజిపి చెప్పారు. సోనమ్ రఘువంశీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని నంద్‌గంజ్ పోలీసుల ముందు లొంగిపోయిందని, ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేసినట్లు నాంగ్‌రాంగ్ వివరించారు. రఘువంశీని చంపడానికి ఆయన భార్య సోనమ్ తమను ప్రేరేపించిందని అరెస్ట్ అయిన నిందితులు పోలీసులకు వెల్లడించినట్లు డిజిపి నాంగ్‌రాంగ్ చెప్పారు. తూర్పు ఖాసీ హిల్స్ ఎస్‌పి 'పిటిఐ' వీడియోకు వెల్లడించిన ప్రకారం..అరెస్ట్ అయిన మొదటి నిందితుడు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లలిత్‌పూర్‌కు చెందిన 19సంవత్సరాల యువకుడని, రెండవ నిందితుడు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన 22సంవత్సరాల విశాల్‌సింగ్ చౌహాన్, మూడవ నిందితుడు రాజ్‌సింగ్‌కుశ్వాల్ ఇండోర్‌కు చెందిన యువకుడన్నారు. ప్రస్తుతం సోనమ్ రఘువంశీ పోలీస్ కస్టడీలో ఉన్నాదని, మధ్యప్రదేశ్‌లోని సాగర్‌జిల్లా నుంచి 23ఏళ్ల యువకుడు ఆనంద్‌కుర్మిని అరెస్ట్ చేశామని ఎస్‌పి తెలియజేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా ఖాడ్సాలోని గోవింద్‌నగర్‌కు చెందిన 24సంవత్సరాల వయసున్న నిందితురాలు సోనమ్ రఘువంశీ వారణాసి ఘాజీపూర్ మెయిన్‌రోడ్‌లో ఉన్నటువంటి దాబాలో రాత్రివేళ కనుగొన్నామని, ఆమెను ప్రాథమిక చికిత్స కోసం సదర్ హాస్పిటల్ (వన్‌స్టాప్ సెంటర్)కు పంపించామని ఎడిజి తెలిపారు.

### పదకొండేళ్ళ బిజెపి పాలనపై

## కాంగ్రెస్ రిపోర్ట్ కార్డు విడుదల

**న్యూఢిల్లీ :** పదకొండేళ్ళ బిజెపి పాలనపై రిపోర్ట్ కార్డును కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. వృద్ధిరేటు, ఆకలి కేకలు పెరిగాయని, అమలు కానీ హామీలు అనేకం ఉన్నాయని విమర్శించింది. ప్రభుత్వ అబద్ధాలు కొన్నిటినీ గుర్తు చేస్తూ ''11 సాల్, ఝూటే వికాస్ కె వాదే (పదకొండేళ్ళు, బూటకపు అభివృద్ధి వాగ్దానాలు)' పేరుతో బుక్‌లెట్‌ను విడుదల చేసినట్లు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. బుక్‌లెట్‌ను రూపొందించిన ఎఐసిసి రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ హెడ్ రాజీవ్‌గౌడ ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిజెపి ప్రభుత్వం అబద్ధాల వార్తలు, బూటకపు ప్రచారంలో బాగా పని చేసిందని, కఠోర వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉన్నదన్నారు. 2024 మ్యానిఫెస్టో ఏక్ ఔర్ బార్ జుమ్లా సర్కార్ (మరో సారి జుమ్లా (మాయ) ప్రభుత్వం)'' బుక్‌లెట్‌ను, ''గ్యారా సాల్ ఝూటే వికాస్ కె వాదే (పదకొండేళ్ళ అబద్ధపు అభివృద్ధి వాగ్దానాలు)' పేరుతో బిజెపి 'డొల్ల హామీల'పై మరో బుక్‌లెట్‌ను తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. పదకొండేళ్ళ నివేదికలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాన్ అన్న యోజన కింద 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలను పంపిణీ చేస్తున్నట్లు సంతోషపడుతున్నారని, అదే సమయంలో ప్రపంచ ఆకలి సూచిలో 127 దేశాలలో భారతదేశం 105వ స్థానంలో ఉన్నదనే విషయాన్ని గమనించాలన్నారు. 35.5 శాంతి మందిలో సరైన పెరుగుదల లేదని, 19.3 శాతం మంది బక్కచిక్కారని, 32.1 శాతం మంది ఉండాల్సిన దానికంటే తక్కువ బరువు ఉన్నారని వివరించారు. ఒకవైపు బిజెపి వికసిత్ భారత్ అని చెప్పుకుంటున్నప్పటికీ, భారతదేశ చిన్నారుల్లో 3వంతు మంది పోషకాహార లోపంతో బాధపడుతు న్నారని తెలిపారు. 2014 నుంచి 700లకు పైగా ఏకలవ్య పాఠశాలలను ప్రకటించారని, అందులో 300 ఇప్పటికీ అచరణలోకి రాలేదన్నారు. దేశీయంగా 5 వేల రక్షణ పరికరాలను తయారు చేస్తున్నట్లుగా కేంద్రం చెబుతున్నది కూడా వాస్తవం కాదన్నారు. 40శాతం దేశీయంగా ఉత్పత్తి కావడం లేదని, భారత దేశం ఇప్పటికీ రక్షణ రంగంలో అతి పెద్ద దిగుమతిదారే తప్ప ఉత్పత్తిదారు, ఎగుమతి దారు కాదన్నారు. 'మిషన్ మోడ్ డిఆర్‌డిఒ ప్రాజెక్టు'లలో 55కుగాను 23 ఆలస్యమవుతున్నాయని, రక్షణ బడ్జెట్‌లో పరిశోధన, అభివృద్ధి కోసం కేవలం 5.45 శాతమే కేటాయించారని తెలిపారు. అలాగే భారత దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వాస్తవం కాదని, 8.5 శాతం కంటే తక్కువ వృద్ధి రేటుతో సాధ్యం కాదని ఏ ఆర్థికవేత్త అయినా చెబుతారని అన్నారు. ఆర్థిక వృద్ధి రేటు గత ఏడాది 6.5 శాతం అని, దేశంలో అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, దేశంలో ఒక్క శాతం ప్రజల చేతిలో 40 శాతం సంపద, కింద ఉండే 50 శాతం ప్రజల చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉన్నదని రాజీవ్ గౌడ తెలిపారు.

## కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం: మమత

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో కరోనాకేసులు రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ప్రజలకు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అభయమిచ్చారు. కరోనా విస్తతి నేపథ్యంలో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో తాము సమావేశం నిర్వహించామన్నారు. మనమంతా అవగాహనతో, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం మీతో ఉన్నదని భరోసా ఇచ్చారు. ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, భయప డాల్సిన పనే లేదని మమతా బెనర్జీ చెప్పారు.

## టెక్కీ ఘాతుకం

**బెంగళూరు:** కర్నాటక రాజధాని బెంగళూరు శివార్లలోని ఓయోటెల్ రూమ్‌లో దారుణం జరిగింది. ఓ టెక్కీ తన ప్రియురాలిని అత్యంత కిరాతకంగా 17 సార్లు కత్తితో పొడిచి హత్యచేశాడు. కెంగేరి ప్రాంతంలోని పూర్ణ ప్రజ్ఞ లేఅవుట్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరగ్గా.. రెండ్రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. నిందితుడిని 25 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యశష్‌గా గుర్తించారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. సుబ్రహ్మణ్యపుర పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, హతురాలు హరిణి (33) ఇద్దరు పిల్లలకు తల్లి. కొద్దికాలంగా హరిణి, యశష్ మధ్య రిలేషన్‌షిప్ నడుస్తోంది. దీనిపై కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి రావడంతో బ్రేకప్ చేసుకోవాలని ఆమె అనుకుందని, హత్యకు ముందు ఈ విషయం అతనికి తెలియజేసిందని, అదే ఈ హత్యకు కారణంగా అనుమానిస్తున్నామని డిసిపి (సౌత్) లోకేష్ జగలసార్ తెలి పారు. ఓయోటెల్‌లో జూన్ 6న ఈ హత్య జరిగింది. గడువు గంటే ఎక్కువ సమయం గది తాళం వేసి ఉండటంతో అనుమానం వచ్చిన సిబ్బంది ఆ విష యాన్ని యాజమాన్యానికి తెలియజేశారు. హత్య ఘటన వెలుగుచూడటంతో సుబ్రమణ్యపురస్టేషన్‌లో కేసు నమోదయ్యింది. యశష్ కోసం గాలిస్తున్నారు.


## 163 కేసుల్లో ఎక్స్‌ఎఫ్‌జి కోవిడ్ వేరియంట్ గుర్తింపు

**న్యూఢిల్లీ:** దేశంలో మళ్లీ కోవిడ్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. అయితే తాజాగా 163 కోవిడ్ కేసుల్లో కొత్త వేరియంట్ ఎక్స్‌ఎఫ్‌జీని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ సార్స్ సీవోవీ2 జీనోమిక్స్ కన్సోర్టియం (ఐఎన్‌ఎస్ ఏసీఓజీ) డేటాఆధారంగా తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ శరవేగంగా వ్యాపిస్తున్నట్లు ఇటీవల ద లాన్సెట్ జర్నల్‌లో ఓ రిపోర్టును ప్రచురించారు. ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్‌లో నాలుగు కీలకమైన స్పైక్ మ్యుటేషన్స్ ఉన్నాయని, దీని వల్లే వేగంగా ఆ వైరస్‌వ్యాప్తి అవుతున్నట్లు చెప్పారు. తొలుత ఈ వేరియంట్ వైరస్‌ను కెనడాలో గుర్తించారు. భారత్‌లో ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ 163 శ్యాంపిళ్లలో గుర్తించినట్లు జీనోమిక్స్ కన్సోర్టియం పేర్కొంది. మహారాష్ట్రలో అత్యధికంగా 89, తమిళనాడులో 16, కేరళలో 15, గుజరాత్‌లో 11, ఏపీ.. మధ్యప్రదేశ్.. బెంగాల్ రాష్ట్రాల్లో ఆరేసి కేసులు నమోదైనట్లు తెలిసింది. మే నెలలోనే 159 శ్యాంపిళ్లలో ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్‌ను గుర్తించారు. ఇక రెండు శ్యాంపిళ్లను ఏప్రిల్‌లో, రెండు జూన్‌లో పసికట్టారు. ప్రస్తుతం కోవిడ్ యాక్టివ్ కేసుల సంఖ ఆరు వేలు దాటింది. గత 48 గంటల్లో 769 కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా తెలిపింది.

## ఉద్యమకారిణి గ్రెటా థన్‌బెర్గ్ అడ్డగింత

**న్యూఢిల్లీ :** సహాయ సామాగ్రితో గాజాకు వెళ్తున్న అంతర్జాతీయ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బెర్గ్ సహా పలువురు ప్రయాణిస్తున్న పడవను అడ్డుకోవడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. పడవ భద్రంగా గాజాకు వెళ్ళి సహాయ సామాగ్రిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి డిమాండ్ చేశారు. మానవత్వ సహాయాన్ని అందించేందుకు వెళ్తున్న వారిని అడ్డుకోవడం అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించటమేనని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఒక ప్రకటనలో విమర్శించింది.

## సింగపూర్ కంటైనర్ షిప్‌లో పేలుడు..




**కన్నూర్ :** సింగపూర్‌కు చెందిన కంటైనర్ షిప్‌లో పేలుడు సంభవించింది. దట్టంగా పొగలతోపాటు మంటలు ఎగసిపడ్డాయి. ఈ విషయం తెలిసిన వెంటనే రెస్క్యూ ఆపరేషన్ కోసం ఇండియన్ నేవీ రంగంలోకి దిగింది. సోమవారం ఉదయం కేరళ తీరంలో సింగపూర్ కంపెనీకి చెందిన కంటైనర్ షిప్ ఎంవి వాన్ హై 503లో పేలుడు సంభవించింది. ముంబయిలోని మారిటైమ్ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా కొచ్చిలోని మారిటైమ్ ఆపరేషన్స్ సెంటర్‌కు సమాచారం అందినట్లు రక్షణ శాఖ తెలిపింది. దీంతో రెస్క్యూ ఆపరేషన్ కోసం ఇండియన్ నేవీ రంగంలోకి దిగినట్లు చెప్పింది. కొచ్చిలో ఉన్న యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ సూరత్‌ను ఆ కంటైనర్ షిప్ వద్దకు పంపినట్లు వెల్లడించింది. కాగా, 12.5 మీటర్ల వెడల్పు, 270 మీటర్ల పొడవున్న ఈ కంటైనర్ షిప్ జూన్ 7న కొలంబో నుంచి బయలుదేరింది. జూన్ 10న ముంబయికు చేరుకోవాల్సి ఉన్నది. అయితే సోమవారం ఉదయం 10.30 గంటలకు షిప్ డెక్ కింద నుంచి పేలుడు సంభవించింది. ఈ నేపథ్యంలో అందులో ఉన్న 22 మంది సిబ్బందిలో 18 మంది ఆ నౌకను వీడి బోటులో ప్రయాణించారు. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్ దళాలు వీరిని రక్షించాయి. మరోవైపు మంటల్లో చిక్కుకున్న సింగపూర్ కంటైనర్ షిప్ పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఇండియన్ నేవీ తెలిపింది. నేవీ డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది.

# పోలీస్ వాహనం పేల్చివేత

- ఎఎస్‌పి మృతి, సిఐ,ఎస్‌ఐకి తీవ్రగాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం

**ప్రజాపక్షం/భద్రాచలం**



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఎఎస్‌పితో సహా, సిఐ, ఎస్‌ఐ ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు పేల్చివేశారు. ఈఘటనలో ఏఎస్‌పి అకాశ్ రావు మృతి చెందగా, సిఐ, ఎస్‌ఐ కూడా తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో గొల్లపల్లి రోడ్డులో ఉన్న బేస్‌క్యాంపు సమీపంలో మావోయిస్టులు అత్యంత శక్తివంతమైన బాంబును అమర్చారు. పోలీసు వాహనం అటుగా వెళుతున్నట్లు పసిగట్టిన మావోయిస్టులు ఒక్క సారిగా బాంబు పేల్చడంతో వారివాహనం పైకి ఎగిరి పడింది. ఈ ఘటనలో ఏఎస్‌పి ఆకాశ్ రావు తీవ్ర గాయాలపాలయ్యారు. భద్రతా బలగాలు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్సలు పొందతూ ఆయన మృతి చెందారు. గాయాలపాలైన సిఐ, ఎస్‌ఐలను చికిత్సలు అందిస్తున్నారు. వందల సంఖ్యలో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో హతమారుస్తున్న భద్రతా బలగాలపై పగతో రగిలిపోతున్న మావోయిస్టులు ప్రతికార చర్యలకు పూనుకున్నట్లు భావిస్తున్నారు.

## పునరావాసం కల్పించండి

ప్రజాపక్షం/చండూరు: నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో ఇటీవల ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా 66 ఫీట్ల రోడ్డు ఉండే విధంగా మార్కింగ్ చేశారు. ఈ విధంగా ఉంటే ఆ పరిధిలో రోడ్డు వెంబడి ఉన్న ఇండ్ల కుటుంబాలు ఇండ్లు కోల్పోతున్నారని వారికి పునరావాసం కల్పించాలని కోరుతూ సోమవారం నల్లగొండలోని గ్రీవెన్స్‌డేలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఇండ్లు కోల్పోతున్న వారికి న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఉరి వేసుకోని యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ పరిధిలో జంకుతండాలో గల రాజీవ్‌నగర్‌కు చెందిన బుడిగపాక శోభ తన కూతురు దివ్య(23)ను నాలుగు సంవత్సరాల క్రితం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన బొంత వెంకటేష్ అనే వ్యక్తి ప్రేమించి పెళ్లి చేసుకోగా వారికి పాప, బాబు సంతానం కలిగారు. కాగా గత రెండు సంవత్సరాల నుంచి వెంకటేష్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోగా ప్రశ్నించిన దివ్యను నువ్వు కట్నం తేలేదు, తక్కువ కులస్థురాలివి అని దూషిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుండేవాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన దివ్య సోమవారం ఉదయం 8.30గంటల సమయంలో ఇంట్లో ఎవరూలేనిది చూసి తన చీరతో ఉరి వేసుకోని మృతిచెందింది. కాగా మృతురాలి తల్లి శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





## ప్రభుత్వ పథకాల్లో పైరవీలకు తావులేదు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ప్రజాపక్షం/తుర్కపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలులో పైరవీలకు తావులేదని, అర్హులైన లబ్ధిదారులు ఎవ్వరుకూడా ఏ పైరవీదారునికి, ఏ ఒక్క నాయకునికి డబ్బులు ఇయ్యాల్సిన అవసరం లేదని, ప్రతి పేదోనికి న్యాయం జరగాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎవరైనా పైరవీలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంలో రంగా కన్వెన్షన్ హాల్లో మండలానికి చెందిన 276 మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్లు, 133 కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని అన్నారు. తెలుపుతున్నట్లు సభను విజయవంతం చేసినందుకు అందరికీ రుణపడి ఉంటారని అన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇండ్లు మంజూరు చేసిందని, అందులో 500 ఇండ్లను తుర్కపల్లి మండలానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ మోతిలాల్, తహసిల్దార్ దేశనాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: బడిఈడు పిల్లలందరిని బడిలోనే ఉంచాలని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జూన్ 12 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున బడిఈడు పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని ఎవరు కూడా పనిప్రదేశంలో ఉండవద్దని, బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బడి బాట కార్యక్రమం ప్రారంభమైనందున ప్రజలు, తల్లిదండ్రులు, అధికారులందరూ కలిసి నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ జరిగే విధంగా కృషి చేసి సూర్యాపేట జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా రూపొందించడానికి కృషి చేయాలనితెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నర్సింహరావు, ఎయిడ్ సంస్థ జిల్లా కోర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటి సోషల్ మొబిలైజర్లు వగ్గు సోమయ్య పాల్గొన్నారు.

## మంత్రివర్గ విస్తరణలో బిసిలకు అన్యాయం

బిసినేత ధనుంజయనాయుడు



ప్రజాపక్షం/కోదాడ (చిలుకూరు): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ కూర్పులో బిసిలకు తీరని అన్యాయం జరిగిందని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్రప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన చిలుకూరు మండల కేంద్రంలో బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో ఆ సఘ మండల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ పట్ల అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణ చేసిందని తీరా చూస్తే మంత్రివర్గంలో జనాభా ప్రతిపాదికన తగు న్యాయం, సమన్యాయం జరగలేదని, 56 శాతం ఉన్న బిసిలకు కేవలం ఒక్క మంత్రి పదవిని మాత్రమే ఇచ్చారని అది బిసిలలో అధిక జనాభా ఉన్న మున్నూరు కాపులకు మొండి చేయి చూపిందన్నారు. నూతన మంత్రివర్గంలో మరో రెండు పదవులు బిసిలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, కాసాని అంజయ్య, కొండా శివరాం, కట్టెకోల రమేష్, పోలేబోయిన రాములు పాల్గొన్నారు.

## పనిచేయని అటవీ శాఖ తనిఖీ కేంద్రాలు

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాపక్షం/నందికొండ: కొద్దిరోజుల క్రితం నాగార్జునసాగర్ టైగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో మూడు తనిఖీ కేంద్రాలను ప్రారంభించగా అవి స్థానిక అటవీ శాఖ కార్యాలయం వద్ద ఒకటి హైదరాబాద్ రోడ్డులోని లెఫ్ట్ కెనాల్ బెత్తెలతండ వద్ద మరొకటి అదేవిధంగా నల్లగొండ రోడ్డు సమ్మక్క సారక్క ఫ్లై ఓవర్ సమీపంలో నిర్వహిస్తున్న అటవీ శాఖ తనిఖీ కేంద్రాలు ఉండగా వాటిలో సాగర్ అటవీశాఖ కార్యాలయం వద్ద ఉన్న తనిఖీ కేంద్రాలు గత నాలుగు రోజుల నుంచి పని చేయడం లేదు.ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం ద్వారా తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు.ఫాస్ట్ టాగ్ ద్వారా పని చేసేఈ చెక్ పోస్ట్ భారీ వాహనాలకు 80vతేలిక పాటి వాహనాలకు 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. రోజుకు ఈ రోడ్డు మార్గం గుండా భారీ నుంచి తేలికపాటి వాహనాలు సుమారు 300 నుంచి 400 వందల వరకు ప్రయాణిస్తూ ఉంటాయి ఆ రెండు చెక్ పోస్ట్ లు పనిచేయకపోవడంతో ప్రభుత్వ ఖజానా కు నష్టం భారీగానే వాటిల్లితుంది.

**సాంకేతిక సమస్యలతో తాత్కాలికంగా మూసివేత:ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాఘవేంద్రరావు**

తనిఖీ కేంద్రం వద్ద విద్యుత్ సరఫరా లో హెచ్చుతగ్గుల వలన అంతరాయం ఏర్పడటంతోఆనైన్‌లో వాహనాలను స్కాన్ చేసి నమోదు చేసే పరికరాలు కాలిపోవడంతో తనిఖీ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగింది. పరికరాలను రిపేర్ కోసం బెంగుళూరు పంపించాము. అవి వచ్చిన వెంటనే తనిఖీ కేంద్రాలను యథాతథంగా కొనసాగించడం జరుగుతుంది.



## రైతుపై ఆర్థిక భారం పడకుండా ఇందిర సౌర గిరి జల వికాసం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: విద్యుత్తు వినియోగం లేకుండా, రైతుపై ఏలాంటి ఆర్థిక భారం పడకుండా ఇందిర సౌర గిరి జల వికాస పథకం ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గతంలో ఈ పథకాన్ని ఇందిర జలప్రభ, తదితర పేర్లతో అటవీ ప్రాంతంలోని గిరిజన రైతులకు అమలు చేయడం జరిగిందని, అయితే విద్యుత్తు ద్వారా బోర్లతో సాగునీటిని అందించే పద్ధతి ఉండేదని, ఇందిర సౌర గిరి జల వికాస పథకం కింద రైతులకు ఇలాంటి ఇబ్బందులను తొలగించడం, ముఖ్యంగా ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ ఇందిర సౌర గిరిజల వికాస పథకం దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాలైన దేవరకొండ, మిర్యాలగూడ తదితర గిరిజన ప్రాంతాలలోని 14 మండలాలలోఈ పథకాన్ని అమ లు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. గుర్తించిన ఈ 14 మండలాల్లో సుమారు 6800 మంది గిరిజనులను ఇందిర సౌర గిరి జల వికాస పథకానికి గుర్తించడం జరిగిందని,ఆర్ఓఎఫ్ఆర్ కింద గిరిజనులకు పంపిణీ చేసిన భూముల్లో ఈ పథకం కింద సాగు చేసుకునే అవకాశం ఉన్నట్లు ఆమె వెల్లడించారు.ఈ పథకం కింద ఒక యూనిట్‌కు 6 లక్షలు ఖర్చు చేయడం జరుగుతుందని, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా పొందిన, రెండున్నర ఎకరాల పొలం ఉన్న గిరిజన రైతులకు సోలార్ యూనిట్ ను ఇవ్వడం జరుగుతుందని, మొదటి సంవత్సరం జిల్లాలో 270 మంది గిరిజనులకు ఈ పథకం అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వై.అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్ ఉన్నారు.



### 10 నుండి 17 వరకు అమ్మ మాట అంగన్‌వాడీ బాట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుండి 17 వరకు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఈ సందర్భంగా 3 సంవత్సరాలలోపు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంలో గ్రామ పంచాయతీలు ,గ్రామ ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.ఈనెల 10 న అమ్మ మాట అంగన్వాడి బాట ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని ఆమె జిల్లా సంక్షేమ అధికారిని, అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి తల్లి దండ్రులతో పాటు, గ్రామ పెద్దలు అందర్నీ భాగస్వాములను చేయాలని చెప్పారు.

## 20.531 లక్షలు మొక్కలు నాటాలి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

వన మహోత్సవం శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/యాదాద్రి : వన మహోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరంలో డిఎఫ్ఓ పద్మజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20.531లక్షలు మొక్కలు నాటాలన్నారు. మొత్తం మొక్కలు నాటెందుకు సిద్ధం చేశారని తెలిపారు. డిఆర్డిఏ, అటవీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, జిల్లా పంచాయతీ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మున్సిపాలిటీ అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ తమకిచ్చిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ వారు ఈత వనాలను స్థలాలలో పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా మండలాల వారీగా ఒక రోజు పెద్ద మొత్తంలో మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి సరిపడే స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం మొదలైనందున జూలై లోపే మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని తెలిపారు ప్రజలకు ఉపయోగపడే లాంటి మొక్కలను నాటేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు మొక్కలు నాటిన రోజు నుండి చెట్లకి నీళ్లు పోసేందుకు పాదులు చేయాలనీ, ఎరువు వేయాలని, ప్రతిరోజు నీళ్లు పెట్టాలని, మొక్కలకి చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు మొక్కలు నాటాలని అన్నారు. జిల్లాలోని అన్ని మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి, ఆ ప్రదేశాలు టిజిఎఫ్ఎంఐఎస్ వెబ్సైట్‌లో జియోకోఆర్డినేట్‌లతో నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, సీఈఓ శోభారాణి, డిఆర్డిఓ నాగిరెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : వివిధ ప్రాంతాల ప్రజల సమస్యల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 41 ఆర్జీలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 28, జిల్లా పరిషత్ 4, మున్సిపాలిటీ 3, జిల్లా పంచాయతీ శాఖ 2, హౌసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పశు వైద్య శాఖ, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### చట్టపరంగా చర్యలు తీసుకుంటాం : ఎస్‌పి



ప్రజాపక్షం/సూర్యాపేట: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను అదేశించారు.

### ప్రజావాణి లో 52 దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు లతో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారులు దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 52 దరఖాస్తులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.




## సిపిఐ సూర్యాపేట జిల్లా మహాసభలు సక్సెస్

డిసెంబర్ 26న సభకు రెండు లక్షల మంది జనసమీకరణ

మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్న నాయకులకు ధన్యవాదాలు : బెజవాడ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సిపిఐ జిల్లా మహాసభ విజయవంతమైందని ఈ మహాసభల్లో మూడోసారి తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నిక చేసిన రాష్ట్ర కమిటికి, నాయకులకు, కార్యకర్తలకు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం స్థానిక ధర్మబిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలు జరగనున్నాయని ఈ సభలకు రెండు లక్షల వరకు జన సమీకరణ చేస్తామన్నారు. ఈ మహాసభలకు జాతీయ, అంతర్జాతీయ వ్యాప్తంగా ప్రతినిధులు రానున్నారని తెలిపారు. సిపిఐ 4వ మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకుని పలు అంశాలపై తీర్మానించడం జరిగిందన్నారు. సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని, మున్సిపల్ కార్పోరేట్ ప్రాంతాల్లో ఉపాధి హామీని కొనసాగించాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించి రోజు కూలి 700 రూపాయలు ఇవ్వాలన్నారు. కుల గణన చేపట్టి విద్య, వైద్య, ఉపాధి రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన జాన్‌పహడ్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని, స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు 80శాతం ఉద్యోగాలు కల్పించాలని, మహిళ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, ప్రైవేట్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, పోడు భూముల రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఎన్ఎస్‌పి కాలువల్లో పూడిక తొలగించాలని, హుజూర్‌నగర్ రామస్వామిగుట్టపై నిర్మించిన ఇండ్లను అర్హులకు ఇవ్వాలని, అన్ని నియోజకవర్గాల్లో వంద పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సిపిఐ సూర్యాపేట జిల్లా సమితి ప్రత్యేక అహ్వానితులుగా గన్న చంద్రశేఖర్, కార్యదర్శిగా బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాస్, ఉస్తేల నారాయణరెడ్డి, యల్లంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, ఎస్కె లతీఫ్, దేవరం మల్లేశ్వరి, బత్తినేని హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, కార్యవర్గ ఆహ్వానితులుగా ఎస్కె సాయిబెల్లిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జిల్లా నిర్మాణ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహిళ నాయకురాలు దేశగాని హేమలత, గురుస్వామి పాల్గొన్నారు.



## పిల్లల బంగారు భవిష్యత్తుకు విద్య నాంది

: ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్: పిల్లల బంగారు భవిష్యత్తు కు నాంది విద్య నని విద్య లేని జీవితం అంధకారంలో ఉన్నట్టేనని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలోనీ ఇటీవల నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల నూతన విద్యాలయ భవనాన్ని ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డి తో కలసి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటైన ఇంత చక్కటి బాలికల విద్యాలయాన్ని మూడు కోట్ల 33 లక్షల వ్యయంతో నిర్మించుకోవడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. గతంలో అద్దె భవనాలలో అరకొర వసతులతో ఈ కేజీబీవీ స్కూలు నడిపించారన్నారు. ఈ పాఠశాలలో ముఖ్యం గా తల్లి , తండ్రి లేని అనాధ పిల్లలకు ప్రథమంగా చోటు కల్పించడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన, పౌష్టికాహారము, స్నాక్స్ లభిస్తుందని అన్నారు. స్కూల్ బిల్డింగ్ చుట్టూ ప్రహరీ గోడను, మెయిన్ రోడ్డు నుండి లింక్ రోడ్డును సి సి వేయుటకు వెంటనే నిధులను సమకూర్చి అట్టి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కర్నాట లింగారెడ్డి, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం సాగర్ రెడ్డి,జడ్పిటిసి మాజీ సూర్య భాషా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ నాయక్, దేవస్థాన కమిటీ చైర్మన్ శగం నాగిరెడ్డి, షాగం రాఘవరెడ్డి,వెంపటి శ్రీను పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అన్నారు. సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్‌ల అదేశాలతో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు మంత్రివర్గ సభ్యుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో సామాన్య కార్యకర్తలు, నాయకులకు, కుల మాతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ ఉన్నతమైన పదవులను కట్టబెట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని కులాల, మతాల వారికి సమానమైన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ విస్తరణలో కాంగ్రెస్ పార్టీ పాటించిన సామాజిక న్యాయం దేశ రాజకీయాలకు ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, చింతమళ్ల రమేష్, రుద్రంగి రవి, సిరివెళ్ల శభరి, అలేటి మాణిక్యం, డిఆర్ ఉపేందర్ పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం

ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీపై ఎఐఎస్ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు సోమవారం సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి వివిధ విద్యార్థి సంఘాలతో పాటు పార్టీల సంఘాల నాయకులు హాజరైనారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు హెచ్ఎమ్ శుభాన్ పార్టీ బిఆర్ఎస్వి కుర్వపల్లయ్య, టిపిఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు నాగన్న ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ వాల్మీకి , హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రతి విద్యా సంవత్సరం ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నారని అన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలను మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం ఇంగ్లీష్ మీడియం లో చదివించాలని అనుకున్న కూడా ఈ ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఫీజు ఉండటం వలన వారు నిరాశ చెందవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టిన నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థల యజమాన్యం ప్రవర్తిస్తుందని, అడ్మిషన్ ఫీజు కళాశాల ఫీజు ఒకేసారి కట్టాలని విద్యార్థులని ఇబ్బందులకు గుర్తిచేస్తుంది అంతేకాకుండా నీట్ కోచింగ్ పేరుతో విద్యార్థుల దగ్గర్నుంచి అధిక ఫీజులు వసూల చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాల అవుతున్న విద్యా వ్యవస్థలో ఉన్న సమస్యలను పట్టించుకోకపోవడం ఏమిటినీ మండిపడ్డారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తు ఆందోళన కార్యక్రమాలు చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ అధ్యక్షులు దానయ్య, ఎఐఎస్ఎఫ్ నాయకుడు కాసిం, నరేష్ ఎఐటియుసి నాయకుడు రంగన్న, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు హరీశ్, బిఆర్ఎస్ నాయకులు వినోద్, కృష్ణారెడ్డి, ఆర్‌సిఎస్ ఉత్తనూర్ ఎంకన్న, వెంకటేష్ పాల్గొన్నారు.



## 30 వరకు రేషన్ గడువు పొడిగింపు

అదనపు కలెక్టర్ డి.వేణు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రేషన్ కార్డుదారులు తమ రేషన్ తీసుకునేందుకు గడువు జూన్ 30 వరకు పొడిగించడం జరిగిందని అదనపు కలెక్టర్ డి.వేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రజా పంపిణీ బియ్యం జూన్ మాసంలో మూడు నెలలు ఒకేసారి పంపిణీ చేస్తున్నందున గడువు జూన్ 30 వరకు పొడిగించడం జరిగిందని లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందకుండా ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వైద్య వృత్తికే వన్నెతెచ్చిన డా.భూంరెడ్డి మృతి బాధాకరం

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ఉత్తర తెలంగాణ జిల్లాలలో మొట్టమొదటి సర్జన్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుని వైద్య వృత్తికే వన్నె తెచ్చిన గొప్ప మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ వి.భూంరెడ్డి మృతి అత్యంత బాధాకరమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న భూంరెడ్డి సోమవారం మధ్యాహ్నం మృతి చెందిన వార్త తెలియగానే తనను ఎంతగానో కలిచివేసిందని, వ్యక్తిగతంగా ఆయనతో తనకు అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవన్నారు. 2025 ఫిబ్రవరి 25న ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి ఆయనను కలిసినప్పుడు ఆప్యాయంగా మాట్లాడారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో వైద్య వృత్తికే వన్నెతెచ్చి ఎంతో మందికి ఆదర్శ ప్రాయుడయ్యారు. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నట్లు చాడ వెంకటరెడ్డి తెలిపారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కారం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. రామగిరి మండలం రాజపూర్ గ్రామానికి చెందిన ఖతీజా బేగం సింగరేణి భూసేకరణ కింద సర్వే నెంబర్ 207 లో ఉన్న తన కోల్పోయిన భూమికి అవార్డు రాలేదని, జాయింట్ సర్వే చేయించి అవార్డు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సూపరింటెండెంట్ జి అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం భోజం పేట గ్రామానికి చెందిన కే.సాయి కృష్ణ తన తండ్రి కే.రమేష్ 2019 సంవత్సరంలో మరణించాడని తన తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమి ఏళ్లు తనకు బదలాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.సుల్తానాబాద్ మండలం రేగడి మద్దిగుంట గ్రామానికి చెందిన టి.ఎం.మల్లయ్య కుమారులు స్వామి, మల్లేష్ గ్రామంలో తమ ఇంటికి వెళ్లే దారిని కబ్జా చేస్తే తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకో తహసిల్దార్ కు రాస్తూ వెంటనే విచారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన కార్యక్రమం

జిల్లా వ్యవసాయ అధికారి బాస్కర్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రం లోనే మొదటిసారిగా జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రైతు మిత్ర ఫార్మర్ ఫ్రెండ్ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి బాస్కర్ సోమవారం రోజున జగిత్యాలలో రైతు మిత్ర ఫార్మర్ ఫ్రెండ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి బాస్కర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో ప్రత్యక్షంగా సమావేశమై ఎలాంటి విత్తనాలు వాడాలి, పంటల్లో చీడపీడలు, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు ఏవిదంగా చేపట్టాలి, ముఖ్యంగా పంటల సాగులో వచ్చే సమస్యలు, రసాయనాల వినియోగం, నీటి వనరుల వినియోగం, చీడ పీడలు వంటి అంశాలపై శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. నిపుణుల ప్రత్యక్ష మార్గదర్శన ద్వారా రైతులకు అవగాహన పెరుగుతుందని చెప్పారు. రైతుల పంటల సాగు సమస్యలకు సమగ్ర పరిష్కారం రైతు మిత్ర ద్వారా అందించనున్నారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా జగిత్యాల జిల్లాలో జిల్లా అధికారులు రైతు మిత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 గం నుండి మధ్యాహ్నం 1:30 వరకు శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖాధికారులు, సహాయ వ్యాసాయ సంచాలకుల (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఎడిఎ) రైతులతో ప్రత్యక్షంగా సమావేశమవుతారు. రైతుల సమస్యలకు అప్పటికప్పుడే సమాధానాలు ఇవ్వడంతో రైతుల సమస్యల పరిష్కరాన్ని పేపర్ పై రాసి ఇస్తున్నారు. రైతుల సమస్యల రికార్డు పుస్తకంలో నమోదు చేసి అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. జగిత్యాల, ధర్మపురి మరియు మెటుపల్లి కార్యాలయాలలో రైతు మిత్ర కార్యక్రమం కొనసాగుతుందని రైతులు తప్పకుండా ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి బాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ తిరుపతి, శాస్త్రవేత్తలు రజినీకాంత్, శ్రీనివాస్, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి...



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి గ్రామ శివారులోని సరస్వతి విద్యా ఆవాస విద్యాలయం సమీపంలో మారుతి షిఫ్ట్ కారు ఢీకొని వ్యక్తి చనిపోయాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన గాధగోని హన్మాగౌడ్(75) సోమవారం సిద్దిపేట పట్టణంలో నివాసం ఉంటున్న తన కొడుకు వద్దకు రావడానికి గ్రామ స్టేజి వద్ద వేచి ఉండగా అదే గ్రామానికి చెందిన పసుపునూరి రితిక్ యొక్క మోటార్ సైకిల్‌పై లిఫ్ట్ ఎక్కి సిద్దిపేట వస్తుండగా తడ్కపల్లి శివారులోని సరస్వతి ఆవాస విద్యాలయం ముందర ఉదయం 8:15నిమిషాలకు సిద్దిపేట వకైపు నుండి వస్తున్న టిఎస్ 15 ఇఎఫ్ 6565 నంబర్ గల మారుతి షిఫ్ట్ డిజైర్ కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి టక్కరు ఇవ్వగా హన్మాగౌడ్ అక్కడికక్కడే చనిపోయాడు. మోటర్ సైకిల్ నడిపిన రితిక్‌కి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మహమ్మద్ వాజిద్ జహీరాబాద్ వాసిగా గుర్తించినట్లు సమాచారం. మృతుడి కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించినట్లు త్రీటౌన్ పోలీసులు వెల్లడించారు.


## క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/చొప్పదండి:** భర్తతో గొడవపడి క్షణికావేశంలో ఓ మహిళ గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన ఎడ్ల తేజ సాయిశ్రీ(30) అనే వివాహిత తన భర్త జగన్ ముందు రోజు ఇంటికి ఎందుకు రాలేదని ఈ నెల 6న అతనితో గొడవపడి క్షణికావేశంలో గడ్డి మందు తాగి ఆ తర్వాత కరీంనగర్‌లో ఉన్న తన పిన్నికి ఫోన్ చేసి మందు తాగానని తెలుపగా వారు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఒమెగా ఆసుపత్రిలో చేర్పించగా 9న సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మరణించారు. ఆమెకు ఒక పాప, బాబు ఉన్నారు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో తహసీల్దార్ నవీన్ కుమార్, ఎస్ఐ శవపంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# మౌలిక వసతుల ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాలోని వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులు, ఎంపిడివోలతో ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మత్తులు, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించారు. వివిధ కార్యక్రమాలు, పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ప్రహారీ గోడలు, టాయిలెట్స్, కిచెన్ షెడ్, వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు పనులు మంజూరు చేశామని తెలిపారు. ఈ పనులకు సంబంధించిన గ్రౌండింగ్ 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఏఈలు, ఎంపిడివోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనులు మొదలయ్యేలా చూడాలన్నారు. ఇది వరకే మొదలైన పనులను వేగవంతం చేసి రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాల్లోకి తరలించాలని ఆదేశించారు. అక్కడ అవసరమైన మరమ్మత్తులు చేయిస్తామని, టాయిలెట్స్ నిర్మిస్తామని, నీటి వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంపిడివోలు, సిడిపివోలు సమన్వయంతో తరలింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్నందున మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు అన్ని ప్రభుత్వ పాఠశాలలను, వసతి గృహాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. వర్షం కారణంగా నీరు నిలవకుండా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను తనిఖీ చేయాలని సూచించారు.

**ప్రజావాణికి 304 ధరఖాస్తులు**

ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తంగా 304 మంది అర్జీలు సమర్పించగా కొన్ని ధరఖాస్తులు అక్కడికక్కడే పరిష్కరించారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డిఎండబ్ల్యూవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## రూ.2.99 లక్షల కోట్లతో అమృత్–2 అమలు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి భూమి పూజ చేసిన బండిసంజయ్



**ప్రజాపక్షం/చొప్పదండి:** అమృత్ 2 పథకం కింద దేశవ్యాప్తంగా పట్టణాల్లో నివసించే వారికి నీళ్లను అందించేందుకు రూ.2 లక్షల 99 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. అందులో కేంద్ర వాటా కింద 76 వేల 760 కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని ఆయా రాష్ట్రాలు, నగర పాలక సంస్థలు సమీకరించుకుంటున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగా అమృత్ 1, అమృత్ 2.0 కింద తెలంగాణలో మొత్తం 6 వేల 876 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి పట్టణంలోని నల్లాలబావి వద్ద స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో కలిసి రూ.36.3 కోట్ల వ్యయంతో వాటర్ ఇంప్రూవ్‌మెంట్ స్కీంకు కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 2021లో అమృత్ 2.0 పథకం ప్రారంభమైందని, ఐదేళ్లపాటు ఈ పథకం అమలులో ఉంటుందని తెలిపారు. ఈస్కీం కింద కేంద్ర, రాష్ట్రాలు, మున్సిపాలిటీల భాగస్వామ్యంతో ఈ సారి 2 లక్షల 99 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని మోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అమృత్ 1, అమృత్ 2 కింద మొత్తం 852 కోట్ల 11 లక్షల రూపాయలు కేటాయించామని, అందులో కేంద్ర వాటా 481 కోట్ల 19 లక్షలు, మున్సిపాలిటీల వాటా 73 కోట్ల 37 లక్షలు అని తెలిపారు. అందులో భాగంగానే చొప్పదండి మున్సిపాలిటీలో అమృత్ 2 కింద 36 కోట్ల 30 లక్షల నిధులతో ఇంటింటికీ నీళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

**చొప్పదండిలో ఇంటింటికీ నీటి సరఫరా :ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో చొప్పదండి పట్టణ ప్రజలకు ఇంటింటికీ నీటిని సరఫరా చేయబోతున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మహేష్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గుర్రం నీరజ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, తదితరులున్నారు.

## సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం...

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** ప్రతి నిరుపేద కుటుంబానికి కూడు, గూడు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. వేములవాడ పట్టణం 21వ వార్డులో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ప్రభుత్వం అందించే ఇంటి నిర్మాణ సహాయం పారదర్శకంగా లబ్ధిదారులకు చేరుతుందని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి డబ్బులు రావని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారి మాటలను నమ్మవద్దని కాంగ్రెస్ నాయకులు ప్రజలకు సూచించారు. "ఎవరు అధైర్య పడకండి. డబ్బులు ఇప్పించే బాధ్యత స్థానిక శాసన సభ్యులు ఆది శ్రీనివాస్‌తో పాటు మాది," అని వారు భరోసా ఇచ్చారు. ఎవరి మాట నమ్మకుండా తొందరగా భూమిపూజ చేసుకొని ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులను కోరారు. ప్రతి ఇంటికి ఐదు లక్షల రూపాయల సహాయం నాలుగు దశల్లో అందించబడుతుందని ఇందిరమ్మ కమిటీ సభ్యులు తెలిపారు.ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న ప్రతి ఒక్కరికీ డబ్బులు వస్తాయని, స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వారి ఖాతాల్లో డబ్బులు పడతాయని, తొందరగా అందరూ ఇందిరమ్మ ఇళ్లను స్టార్ట్ చేసి వచ్చే దసరా నాటికి గృహప్రవేశం చేసుకోవాలని సూచించారు. ఇళ్లు మంజూరు చేయించిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, కూరగాయల కొమరయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కోయల్కర్ మస్తాన్, కూర దేవయ్య, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల నాయకులు జోగిని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎస్‌టియు లక్ష్యం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** ఉద్యమమే ఊపిరిగా, పోరాటమే ఆయుధంగా, విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ టి యు పనిచేస్తుందని తెలంగాణ ఎస్టియు పెద్ద పల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు సతీష్, ప్రధాన కార్యదర్శి మందల శ్రీకాంత్ రెడ్డి లు అన్నారు. సోమవారం రోజున 78 వసంతాల పాటు విద్యా, ఉపాధ్యాయ రంగంలో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచి, సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో శాశ్వత వ్యవస్థాపక సభ్య సంఘం గా ఉన్న ఎస్.టి.యు 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని సంఘ స్థలంలో పతాక ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ ఎస్.టి.యూ 78 వసంతాలుగా ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయుల మదిలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకుందని, అప్రెంటిస్ రద్దు మొదలు అనేక సమస్యల పరిష్కారంలో ఎస్టియు ముందంజలో ఉండి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నడిపిందని అన్నారు.నేడు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంలో భాగంగా ఎస్టియు ముందంజలో ఉంటుందని అన్నారు. 317 జిఒ కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ ఉమ్మడి జిల్లా పరిధిలో భవిష్యత్తులో ఏర్పడే ఖాళీలలో వారికి తిరిగి అవకాశం కల్పించేలా 317 జిఒని సవరించాలని డిమాండ్ చేశారు. మానిపెస్టోలో పేర్కొన్న విధముగా సిపియస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2003 డియస్‌సి వారికి పాత పెన్షన్ అమలు చేసే అవకాశం ఉన్నప్పటికీ కాలయాపన చేయడం తగదని వెంటనే వారిని ఒపియస్ పరిధిలోకి తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కట్కొజ్వల శ్రవణ్ కుమార్, ఆడెపు సంతోష్ కుమార్ మరియు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పాల అంజయ్య, గుండా మల్లికార్జున్, ముల్కల్ల రాజశేఖర్, మిట్టపెల్లి శ్రీనివాస్, రెడ్డి శ్రీనివాస్, పుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి



ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/వేములవాడ:** రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయితి కార్మికులకు రెండు నెలలుగా వేతనాలురాక, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యలను వెంటనే పరిస్కారించాలని, ఎఐటియుసి అనుబంధ గ్రామపంచాయితి కార్మిక సంఘం ఆధ్వర్యంలో పంచాయితీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ కు వినతిపత్రం అందజేశారు. కార్మికులందరికి ఈఎస్ఐ, పిఫ్ సౌకర్యం లేకపోవడం, ఇన్సూరెన్స్ లేకపోవడం, 8గంటల పనివిధానం అమలు కాకపోవడం, గ్రామపంచాయితి కార్మికులకు, ట్రాక్టర్లకు ఇన్సూరెన్సులు, లైసెన్స్‌లు లేక పోవడంతో, ప్రమాదాలు జరిగిన సందర్భాలలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిమాండ్స్‌కు డిప్యూటీ కమిషనర్ సుధాకర్ స్పందించి, వారం పదిరోజుల్లో వేతనాల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మిగతా సమస్యలు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరాజం, కోశాధికారి ఆంజనేయులు, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబ్ సమావేశాన్ని స్థానిక భాస్కర్ రావు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్ అధ్యక్షత వహించగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్య అతిథులుగా , జార్జిరెడ్డి పిడి.ఎస్.యూ జిల్లా అధ్యక్షులు బరిగెల ప్రసన్న, బీఆర్ఎస్వి రామగుండం నియోజకవర్గ ఇన్చార్జ్ కొలుగూరి చింటూ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా రంగురంగుల కరపత్రాలతో, లేనివి ఉన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తూ ఉచిత రవాణా సౌకర్యం, ఫీజులో రాయితీ కల్పిస్తామని మాయ మాటలు నమ్మబలికి విద్యార్థులను పాఠశాలలో చేరిన తర్వాత మొత్తం ఫీజు వసూలు చేస్తున్నారని, తల్లిదండ్రులు మాయ మాటలను నమ్మవద్దని ప్రభుత్వ అనుమతులు పొందిన పాఠశాలలలో మీ యొక్క పిల్లలను చేర్పించాలని వారు అన్నారు. నియమ నిబంధనలు పాటించని పాఠశాలలపై విద్యాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ చేపడతామని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, గాజుల వినయ్, బన్నీ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మహిళలను కోటిశ్వరులు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించడంపై మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గొన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు సీజన్ నందు జిల్లాలో మహిళా సంఘాలకు 190 కొనుగోలు కేంద్రాల బాధ్యతలను కలెక్టర్ అప్పగించడంతో రికార్డు స్థాయిలో 470కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ గతంలో 42 కొనుగోలు కేంద్రాల మాత్రమే మహిళా సంఘాల నిర్వహించేవారని, తాను కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాసంగి కోనుగోలు సీజన్ నందు అత్యధికంగా 190 కోనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందని, చాలా మంది అంచనాలకు విరుద్ధంగా మహిళా సంఘాల విజయవంతంగా యాసంగి కొనుగోలు ప్రక్రియ చేపట్టారని కలెక్టర్ తెలిపారు. యాసంగి సీజన్ లో మహిళలకు దాదాపు 7 కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ వచ్చిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాబోయే ధాన్యం కొనుగోలు సీజన్ నందు మహిళా సంఘాలకు 220 కంటే ఎక్కువ కోనుగోలు కేంద్రాల అప్పగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం, అదనపు డిఆర్‌డిఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## 3 నెలలకు ఒకేసారి రేషన్ పంపిణీ

అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నందున ఈ నెలాఖరు వరకు పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని, రేషన్ కార్డుదారులందరికీ బియ్యం పంపిణీ చేస్తామని అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేస్తున్నదని అన్నారు. ప్రతి నెల 15వ తేదీ వరకు రేషన్ సరుకులు ఇస్తారని, కానీ ఈ నెలలో మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తున్నందున జూన్ 30 వరకు బియ్యం పంపిణీ చేస్తామన్నారు.

అన్నపూర్ణ కార్డుదారులకు నెలకు 10 కిలోల చొప్పున మూడు నెలలకు ఉచితంగా బియ్యం పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. అంత్యోదయ కార్డుదారులకు నెలకు ఒక కిలో చక్కెర చొప్పున మూడు నెలలకు పంపిణీ చేస్తామని, కిలోకు రూ.13.50 కార్డుదారులు చెల్లించాలని అడిషనల్ కలెక్టర్ అట్టి ప్రకటనలో తెలిపారు.

## అధికారుల సమన్వయం అవసరం



ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మందిరంలోఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్ట ణం బజారు వాడికి చెందిన సంగీత ఆశ కార్యకర్తగా ఉపాధి,రెబ్బెన మండలం గోలేటి టౌన్ షిప్‌కు చెందినలక్కారపు కళావతి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

## రాంపూర్‌లో 'బడిబాట' సక్సెస్



ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్‌లో బడి బాటలో బాగంగా ఇంటింటికి వెళ్లి ఉన్నత పాఠశాల ప్రత్యేకతల గురించి ఉపాధ్యాయులు వివరించారు. చేర్పించాలని తల్లిదండ్రులను కోరారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి తెలిపారు. బడిబాటలో భాగం గా ఇప్పటివరకు 18 మంది విద్యార్థులు నమోదయ్యారన్నారు.తల్లిదండ్రుల సహకారం బాగుందన్నారు. ఉపాధ్యాయలు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం



ప్రజాపక్షం/బాన్సువాడ: బాన్సువాడ మునిసిపల్ పరిధిలోని చింతల్ నాగా రంలో తహసీల్దార్ వరప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశా రు. తహసీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి ద్వారా రైతుల సమస్యలను పరిశీలించి రైతులకు పూర్తి హక్కులను కల్పించడం జరుగుతుందని, గతంలో భూ సమస్యలు ఉన్నవారు అధికారుల చుట్టు తిరిగినా సమస్యలు తీరేవి కావని, ప్రస్తుతం రెవెన్యూ అది కారులు గ్రామానికి వచ్చి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. ఆర్ఐ అశోక్, రెవెన్యూసిబ్బంది, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, దాసరి శ్రీనివాస్, అశో క్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణపల్లిలో..



నిజాంసాగర్: భూభారతి కార్యక్రమం భూ సమస్యలకు చక్కటి పరిష్కార వేదిక అవుతుందని నిజాంసాగర్ తహసీల్దార్ బిక్షపతి అన్నారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో రెవెన్యూ సదస్సును తహసీల్దార్ అధ్యక్షతన నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించుకు నేందుకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణికి 135 ఫిర్యాదులు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమా నికి 135 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమా లతో పాటు జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ వెంకటేశ్వర్‌రా వులకు అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించా లని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాల కార్మిక నిర్మూలన చట్టంపై అవగాహన ఉండాలి




ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : అంతర్జాతీయ బాల కార్మిక నిర్మూలన దినో త్సవం సందర్భంగా నిర్మల్ లోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో బాల కార్మిక నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు.స్త్రీ, శిశు, వయోజనులు, ట్రాన్స్ జెండర్‌ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యం గా కార్మికులలో చట్టపరమైన అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.రాధిక ముఖ్య అతిథిగా బాల కార్మిక చట్టం ముఖ్యంశాలను వివరించారు.బాల కార్మిక నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పిల్లల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉద్ఘాటించారు. కార్మికులు పాల్గొన్నారు.జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవిమురళి, ఎస్ఐ సందీప్, బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్ లైన్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ సబిత తదితరులు బాల కార్మిక చట్టాల ప్రాముఖ్యతను వివరించారు.

## శ్రామికుల అభివృద్ధే సిపిఐ లక్ష్యం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు




ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ : దేశంలో అణగారిన వర్గాల శ్రామికుల అభివృద్ధి కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిరంతరం పోరాటాలు చేస్తుందని జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు అన్నారు. సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న జరగ బోయే భారత కమ్యూనిస్టు (సిపిఐ) పార్టీ నస్పూర్ మండల 3వ మహాసభ లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేనశంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌పిడబ్ల్యూ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్య అతిథు లుగా హాజరవుతారన్నారు. అనేక సంవత్సరాల క్రితం నస్పూర్ మండలంలో అమరుడు పి నర్సయ్య నాయకత్వాన శ్రీరాంపూర్‌లో పురుడు పోసుకొని వివిధ కాలనీలలో సిపిఐ నాయకత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, కార్యవర్గ సభ్యులు దొడ్డిపట్ల రవీందర్, పట్టణ కార్యదర్శులు మిరాయల రాజేశ్వరరావు, పూజారి రామన్న, బాకం శంకర్,అల్లా లచ్చిరెడ్డి, బొడ్డు లచ్చన్న మొగుర్రం రాకేష్ పాల్గొన్నారు.

# ప్రజావాణితోనే అందరికీ భరోసా

### సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాదాన్యత నిస్తూ సత్వరమే పరి ష్కరించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారు లకు సూచించారు. ఐసిసిజిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించినప్రజావాణికి 61 ఫిర్యాదులు అందా యి. అందులో రెవన్యూ 15, సివిల్ సప్లై 4, సర్వే ల్యాండ్ 5, పంచాయతీరాజ్ పెన్షన్స్ 7, మున్సి పల్ 4, విద్యాశాఖ 2, మత్స్యశాఖ 5, వైద్య ఆరోగ్య 2,ఇతర 9 , మొత్తం 61 అందాయని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు, తమ సమస్యలను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు మాధురి చంద్రశేఖర్, లతో పాటు డిఆర్ఓ పద్మజ, రాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్ట కుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### మహిళా పెట్రోల్ బంక్ ట్రయల్ పరిశీలన

జిల్లాలో తొలిసారిగా సంగారెడ్డి పట్టణంలో ఏర్పా టు చేసిన మహిళా పెట్రోల్ బంక్ ట్రయిల్ సెల్ నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సోమవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ జిల్లా మహిళా సమాఖ్య ఆద్వర్యంలో పెట్రోల్ బంక్‌ను నడిపించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జిల్లా మహిళా




సమాఖ్య ఆద్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని పెట్రోల్ బంక్ మొట్టమొదటిసారిగా మహిళల చేత నడిపించబడుతుందన్నారు. సంగారెడ్డి పట్ట ణంలోని బైపాస్‌లో పెట్రోల్ బంకు నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని,మొత్తం 14 మంది మహి ళలు పనిచేస్తున్నారని,అందులో ఇద్దరు మహిళలు మేనేజర్లుగా, పన్నెండు మంది మహిళలు ఆపరేట ర్లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పెట్రోల్ బంకు నిర్వహణ ద్వారా మహిళల కు టుంబాలు ఆర్థికంగా బలపడే అవకాశాలు ఉన్నా యన్నారు. త్వరలోనే పెట్రోల్ బంకుకు సెక్యూ రిటీని నియమిస్తామన్నారు. ట్రయిల్ సేల్ అనం తరం వినియోగదారులకు ఉత్తమ సేవలు అందిం చాలని సూచించారు. జిల్లా కలెక్టర్ తన వాహ నంలో డీజిల్ పోయించుకొని తన సొంత డబ్బు లను ఇచ్చారు. పిడిడిఆర్‌డిఓ జ్యోతి అదనపు డిఆ ర్‌డిఓజంగారెడ్డిసిబ్బందితదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలి

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ : ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీ లించి,త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారు లను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.ప్రతి దరఖాస్తులో పేర్కొన్న అంశాన్ని సమగ్రంగా పరిశీలించి,వాస్తవ స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ చర్యలు నిర్లక్ష్యం కాకుండా నిర్వహించాలని సూచిం చారు. స్కూల్లు, హాస్టళ్ళు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రైతులకు ఎరువులు,విత్తనాల సరఫరాలో ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధి కారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష చేసి,పనుల్లో వేగం తీసుకురావాలని సూచించారు.ప్రజల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కశాఖ సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలె క్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,ఆర్డీవో రత్న కళ్యాణి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణం తనిఖీ



ప్రజాపక్షం/కొండాపూర్ : మండల పరిధిలోని తొగరప ల్లిలో గల రేషన్‌దుకాణం నెం.2 ను కొండాపూర్ తహ సీల్దార్ బి. అశోక్ సోమ వారం నాడు తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలోని బియ్య ం స్టాకు వివరాలను డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. మొత్తం బియ్యం 219.50 క్వింటాళ్లకు 125 క్వింటాలను సరఫరా చేశారు. ఇంకా 94.50 క్వింటాళ్లను బియ్యాన్ని సర ఫరా చేయాల్సి ఉందని తెలిపారు. సకాలంలో రేషన్ పంపిణి జరగాలని డీలర్ కు సూచించారు. తహసీల్దార్ తో పాటు ఆర్ఐ రాజు ఉన్నారు.

## భూముల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ : ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామ శివా రులో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేశా రని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆరోపించింది. ఆమంద శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని, కొందరు అధికా రులు కూడా సహకరిస్తున్నారని సీపీఐ నిర్మల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.ఆర్.ఉపాలి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాల ఎల్లాపూర్ శివారులోని ప్రభుత్వ భూములతో పాటు,అనుకొని ఉన్న దాదాపు మరో 2 ఎకరాల భూమిని శ్రీనివాస్ ఆక్రమించారని సీపీఐ ఆరోపించింది. నాలా పర్మిషన్లు,లేఅ వుట్లు లేకుండానే నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని,దిలావర్‌పూర్ పంచాయతీ కార్యదర్శి ఆ భూమికి ఇంటి నంబర్ కేటాయించారని ఆరోపించారు.అంతేకా కుండా,ఎలాంటి నిర్మాణం జరగకుండానే శ్రీనివాస్ పేరుపై గోసంపల్లి గ్రామ పంచాయతీలో ఇంటి నంబర్ నమోదు చేసుకుని,పన్ను కూడా చెల్లించడం లేదని ఫిర్యాదులో ఉంది.ప్రభుత్వ భూములను విక్రయించడం చట్టరీత్యా నేర మని తెలిసినప్పటీకి శ్రీనివాస్ అమాయక దళితులకు ఈ భూమిని గుంటకు రూ.లక్షల చొప్పున అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని సిపిఐ ఆరోపించింది. అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని, ఇంటి నం బర్లు కేటాయించిన అధికా రులు, భూమిని కబ్జా చేసిన శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది.లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసు కెళ్తామని సీపీఐ హెచ్చరించింది. తమ ఆరోపణలకు మద్దతుగా పహణీలు, ధరణి వివరాలు, హౌస్ టాక్స్, అసెస్మెంట్, విక్రయ పత్రాలు, నిర్మాణ ఫోటోలు,ఇంటి నంబర్ సర్టిఫికెట్ వంటి పత్రాలను కలెక్టర్‌కు సమర్పించారు.



# ఇద్దరు ఎస్ఐలకు పదోన్నతి..అభినందన





ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి: జిల్లాకు చెందిన ఇద్దరు ఎస్ఐలకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీ జోన్ II ఐజి వి.సత్యనారయణ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ఇన్‌స్పెక్టర్లు వెంక ట్‌రెడ్డి, ప్రసాద్‌రావు లను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అభినందించారు. 2012 లో పోలీసు శాఖలో సబ్ ఇన్స్పెక్టర్స్‌గా నియామకమైన వెంకట్ రెడ్డి ఎస్ఐ ప్రసాద్ రావులను ఎస్ఐలు గడిచిన 13 సంవత్సరాలు ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో యస్.హెచ్ ఓలుగా విధులు నిర్వహించి. విశిష్ట సేవలం దించారు. సర్వీసులో ఏలాంటి రిమార్క్ లేకుండా అదికారుల మన్నలను పొందారని వీరు అందిం చిన ఉత్తమ సేవకు ఇన్స్పెక్టర్స్ గా పదోన్నతి కల్పిస్తూ మల్టీ జోన్II ఐజి విసత్యనారాయణ ఉత్వర్వులు వెలవరించారని జిలా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలిపారు. వీరు సుదీర్ఘ సర్వీస్‌లో ఏలాంటి రిమార్క్ లేకుండా ఇన్స్పెక్టర్స్‌గా పదో న్నతి పొందడం అభినందనీయమన్నారు. పదో న్నతి ద్వారా స్థాయిలో పాటు బాద్యత మరింత పెరుగుతుందని పెరిగిన బాద్యతను క్రమ శిక్ష ణతో నిర్వర్తిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల ఉన్న నమ్మకాన్ని గౌరవాన్ని మరింతగా పెంచే విదంగా కృషి చేస్తూ సర్వీసులో మరిన్ని ఉత్తమ సేవలను అందించి రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసు కురావాలన్నారు.

## డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో షార్ట్ సర్క్యూట్

### ఫర్నీచర్, సిస్టమ్ పరికరాలు దగ్ధం

### రక్త పరీక్షలకు అంతరాయం


### జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని డయాగ్నొ స్టిక్ ల్యాబొరేటరీలో ప్రమాదవ శాత్తు షార్ట్‌సర్క్యూట్ సంభ వించి ఫర్నీచర్, సిస్టమ్స్ మంటల్లో దగ్ధమైన సంఘటన మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుప త్రిలో జరిగింది. సోమవారం ఆలస్యంగావెలుగులోకి వచ్చిం ది. డయాగ్నొస్టిక్స్ డిస్ట్రిక్ట్ ఇం టిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలో (ఐపిహెచ్ఎల్) శనివారం అర్ధరాత్రి తర్వాత షార్ట్ సర్క్యూట్ సంభవించింది. మంటలకు ఫాల్ సీలింగ్ కాలి పోయి కిందపడింది. చైర్, ప్రింటర్, మౌస్, కీబోర్డ్, జీపీఎస్, సిపియూ, మాని టర్, బార్ కోడ్ స్కానర్స్ కాలిబూడిదయ్యాయి. సోమవారం ల్యాబ్ కు వచ్చిన ఆయాలు, సిబ్బంది అక్కడి పరిస్థితిని చూసి ఉన్నత అధికారులకు, స్థానిక సూపరింటెండెంట్‌డా॥ సునీతకు సమాచారం అందించారు. ల్యాబ్ లో షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు నైట్‌డ్యూటీ టెక్నీషియన్ లేకపోవడంతో పెను ప్రమా దం తప్పిందని అంటున్నారు. పబ్లిక్ హెల్త్ లేబరేటరీలో దాదాపు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ల్యాబ్ లో శాంపిల్స్ సేకరణ, పరీక్షలకు అంతరాయం కలిగింది. షార్ట్ సర్క్యూట్ వల్లే ల్యాబ్ లో ప్రమాదం సంభవించిందని, మిషనరీలకు ఎలాంటి నష్టం జరగలే దని,ల్యాబ్ మొత్తం పొగ,మసితో నిండిపోవడం వల్ల పరికరాలలో బూడిద చేరిందని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత ప్రజాపక్షంతో చెప్పారు. శాంపిల్ సేకరణ, రక్త పరీక్షలను ల్యాబ్ లో తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆమె తెలిపారు. హైదరాబాద్ నుంచి బయో మెడికల్ ఇంజనీర్ రప్పిస్తున్నా మని, ఆయన పర్యవేక్షణలో ల్యాబ్ లోని మిషనరీలను, పరికరాలను శుభ్రం చేసిన తర్వాత సేవలను కొనసాగిస్తామన్నారు. ఆసుపత్రిలో అత్యవసరం ఉన్న రక్త నమూనాలు, రక్త పరీక్షల నిమిత్తం ప్రత్యేక అంబులెన్సులో కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నట్టు సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

## పెండింగ్ బిల్లులు ఎప్పడిస్తారు?

### కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా




ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి:ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రా రంభం కానున్నాయని, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కమిటి సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో మధ్యా హ్న భోజన కార్మికుల సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వ హించారు. అధికారులు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలలకు సంబంధించి కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్రం ఇచ్చే వెయ్యి రూపాయలు, రాష్ట్రం ఇచ్చే రెండు రూపాయల వేతనాలు కూడ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిధులు వస్తున్నా ఇక్కడి అధికారులు వాటిని ఇవ్వడంలో నిర్లక్షంగా వ్యవహ రిస్తున్నారని ఆరోపించారు. ఎండిఎం కార్మికులు శ్రీదేవి, రాంబాయి, లక్ష్మీ , ఉశ తదితరులు పాల్గొన్నారు.

# నిరసనల పర్వం.. రాజీనామాల వెల్లువ

### బోధన్ రాజకీయాల్లో కుదుపు..

### పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడికి చర్యలు



ప్రజాపక్షం/ ఎడపల్లి: తెలంగాణ రాష్ట్రంలో కొత్త మంత్రి వర్గ విస్తరణ జరిగినప్పుడు బోధన్ శాసనసభ్యులు సుద ర్శన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కకపోవడం ఆయన అనుచ రులు, నియోజకవర్గ ప్రజలలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిం చింది. గత కొంతకాలంగా ఆయనకు మంత్రి పదవి లభి స్తుందని అందరూ భావించారు. అయితే, ఆశించిన ఫలితం దక్కకపోవడంతో బోధన్ నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు నిరసన తెలియచేయడానికి తమ పదవులకు రాజీనామాలు సమర్పిస్తున్నారు. ఈ రాజీనామాలు పార్టీ అధిష్టానంపై ఒత్తిడి పెంచే ప్రయత్నంలో భాగంగా చూస్తున్నారు. సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు నిరసనగా, ఆయనకు మద్దతుగా ఈ రాజీ నామాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి గ్రామ స్థాయి నుంచి పార్టీ పదవుల్లో ఉన్నవారు రాజీనామాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ రాజీనామాల పర్వం బోధన్ నియోజక వర్గ రాజకీయాల్లో ఒక కుదుపును సృష్టించింది. సుదర్శన్ రెడ్డికి నియో జకవర్గంలో మంచి పట్టు ఉండటం. ఆయనకు విస్తృత ప్రజా మద్దతు ఉండటం ఈ నిరసనలకు ప్రధాన కారణం. గత ఎన్నికల్లో ఆయన గెలుపులో కీలక పాత్ర పోషించిన కార్యకర్తలు, నాయకులు ఆయనకు మంత్రి పదవి దక్కకపోవడాన్ని అవమా నంగా భావిస్తున్నారు. మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి దక్కకపోవడంతో ఆయన అనుచ రులు పార్టీపై అసంతృప్తి గళాన్ని విన్పి స్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నా యకులు నేడు బోధన్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. అయితే అనివార్య కారణాల వల్ల బంద్ పిలుపు ను రద్దు చేశారు. అలాగే పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మార్కెట్ కమిటీ శీల శంకర్, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్ట ర్‌గా ఉన్న బొబ్బిలి శ్రీనివాస్ తమ పదవులకు రాజీనామా చేశారు. అదే బాటలో మరికొందరు తమ పదవులకు రాజీనామా చేసేందుకు ముందుకు వస్తున్నారు. బోధన్ నియోజకవర్గం నుంచి వస్తున్న ఈ రాజీనామాల పర్వం పార్టీ అధిష్టానంపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. ఒకవైపు ప్రభుత్వం స్థిరంగా ఉందని చూపించుకోవాల్సిన అవసరం ఉండగా, మరోవైపు ఈ అసంతృప్తి పార్టీకి నష్టం కలిగించే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఈ పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి. పార్టీ అధిష్టానం ఈ పరిస్థితిని ఎలా చక్కదిద్దుతుందనే దానిపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. సుదర్శన్ రెడ్డికి తగిన ప్రాధాన్యత లభిస్తుందా..? లేదా..? అనేది రాబోయే రోజుల్లో తేలుతుంది.

## గిరిజనులకు ఇందిరా సౌర గిరి జల వికాస పథకం




### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి:గిరిజన ప్రజ ల వ్యవసాయ భూములకు నీటి సౌక ర్యంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించి వారి భూములలో ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా ఇందిరా సౌర గిరి జల వికాస పథకం అమలు చేయనున్నా మని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా వాణి సమావేశ హాలులో గిరిజన సం క్షేమశాఖఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ, భూగర్భ జల శాఖ జిల్లా అటవీ శాఖ వివిధ శాఖల అధికారులతో సౌరగిరి జల వికాసం పథకంపై కలెక్టర్ సమీక్షిం చారు. కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలెట్ ప్రాజెక్టుగా మెద క్ జిల్లాలో 18 మండలాల్లో ప్రవేశపెట్ట నున్నఇందిరాసౌరగిరిజల వికాస పథకం అమలుకు ఎంపిక చేసిందన్నారు. 2025 –26 సంవత్సరమునకుగాను 85 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. సంగా రెడ్డి, సిద్దిపేట్, వికారాబాద్ జిల్లాలకు నోడల్ జిల్లాగా మెదక్ జిల్లాగా మెదక్ ఎంపిక అయిందన్నారు. అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, ఇతర శాఖల జిల్లా అధి కారులు తదితరులు ఉన్నారు.

# క్రీడ

## స్వదేశంలో వెస్టిండీస్, ఆస్ట్రేలియా సిరీస్..

### మ్యాచ్ వేదికల్లో మార్పులు..!



ఐపిఎల్ ముగియడంతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన భారత జట్టు అనంతరం స్వదేశంలో వన్డే సిరీస్ ఆడనుంది. మహిళల జట్టు సైతం సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి సోమవారం మ్యాచ్ వేదికలను ఖరారు చేసింది. అయితే.. షెడ్యూల్ ప్రకారం ముందస్తుగా కేటాయించిన మైదానాల్లో స్వల్ప మార్పులు చేసింది బీసీసీఐ. వెస్టిండీస్ పురుషుల జట్టు అక్టోబర్‌లో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత పర్యటనకు రానుంది. ఇరుజట్ల మధ్య తొలి మ్యాచ్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లో జరుగనుంది. అనంతరం 10వ తేదీన రెండో టెస్టు కోల్‌కతాలో జరగాల్సింది. కానీ, ఈ మ్యాచ్‌ను వేదికను ఢిల్లీకి తరలించింది బీసీసీఐ. నవంబర్ 14న భారత్, దక్షిణాఫ్రికాలు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో తొలి టెస్టు ఆడాల్సింది. కానీ, ఇప్పుడు ఆ మ్యాచ్‌కు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది.

**చిదంబరంలో కాదు**

హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఇంతకుముందు ఈ మూడు వన్డేల సిరీస్‌ను చెన్నైలోని చిదంబరం స్టేడియంలో నిర్వహించాలనుకున్నారు. కానీ, కానీ, అక్కడ పిచ్, ఔట్‌ఫీల్డ్ మరమ్మతు పనులు జరుగుతున్నందున వేదికను మార్చాలని బీసీసీఐ భావించింది. అందుకే వీటిలో తొలి రెండు మ్యాచ్‌లను ఛండీగఢ్‌లో, చివరి వన్డే ను ఢిల్లీలో జరపాలని బీసీసీఐ నిర్ణయించింది. అలానే భారత 'ఏ' జట్టుతో దక్షిణాఫ్రికా 'ఏ' జట్టు మ్యాచ్‌ల వేదిక కూడా మారింది. నవంబర్ 13 నుంచి మూడు వన్డే మ్యాచులకు చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యం ఇవ్వాల్సింది. అయితే.. ఈ మైదానం బదులు రాజ్‌కోట్‌లో సఫారీ ఏ జట్టుతో భారత కుర్రజట్టు తలపడనుంది.



## అందుకే కెప్టెన్సీని ఇష్టపడతా

### శ్రేయాస్ అయ్యర్

నాయకుడంటే ముందుండి నడిపించాలి. అనామకులతో కూడిన బృందాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలి. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ, అందర్నీ సమన్వయం చేసుకుంటూ మునిగిపోతున్న నావను ఒడ్డుకు చేర్చేవాడే నిజమైన కెప్టెన్. ఈ మాటలు శ్రేయాస్ అయ్యర్‌కు అతికినట్టు సరిపోతాయి. తన నాయకత్వ పటిమతో 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లిన అయ్యర్ తాజాగా 'టీ20 ముంబై లీగ్'లోనూ తన ముద్ర వేశాడు. తన మార్క్ కెప్టెన్సీతో సోబో ముంబై ఫాల్కన్స్‌ను సెమీఫైనల్‌కు తీసుకెళ్లాడు. లీగ్ ఏదైనా సరే తన సారథ్యానికి తిరుగులేదని చాటుతున్న అయ్యర్.. కెప్టెన్సీని ఎంతో ఇష్టపడుతానని చెబుతున్నాడు. ఈ సొగసరి బ్యాటర్ ఇంకా ఏం చెప్పాడంటే..'నాకు కెప్టెన్సీ అంటే ఇష్టం. నాయకత్వం వహించే సమయంలో నాలోని అత్యుత్తమ సామర్థ్యాన్ని కనబరుస్తాను. సారథ్యం అనేది పరిణితితో కూడిన ఒక బాధ్యత. జట్టు కోసం ప్రతిసారి అత్యుత్తమంగా ఆడాల్సి వస్తుంది. అలానే జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు అందరూ కెప్టెన్ వైపే చూస్తారు. అందుకే.. నేను లీడర్‌గా ఉండేందుకు ఇష్టపడుతా. 22 ఏళ్లప్పుడే తొలిసారి జట్టు పగ్గాలు అందుకున్నా. ఆ సమయంలో ఒక సారథికి ఎదురయ్యే సవాళ్లను నేర్పుగా అధిగమించాను.'నీ కెప్టెన్సీ రహస్యం ఏంటి ?' అని అందరూ అడుగుతుంటారు. వాళ్లకు నేను చెప్పేది ఒక్కటే.. నేను కూల్‌గా ఉంటాను. నా ముందున్న వనరుల్ని సద్వినియోగం చేసుకోవడంపైనే దృష్టి సారిస్తా. మ్యాచ్ జరుగుతున్నంత సేపు ఫోకస్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తా. వర్తమానంలోనే ఉంటూ పరిస్థితులకు తగ్గట్టు నడుచుకుంటాను. స్టాండ్స్‌లోని అభిమానులను ఉత్సాహపరచడం, వాళ్లు నా పేరు మార్మోగిపోయేలా అరుస్తుంటే భలే మజాగా ఉంటుంది. ఫ్యాన్స్ మద్దతుతో మరింత స్ఫూర్తి పొందుతాను అని అయ్యర్ వెల్లడించాడు.

## హిట్‌మ్యాన్ రిటైర్మెంట్.. టీమ్ బస్సులో ఒంటరైన జడేజా!



ఇంగ్లాండ్ పర్యటనను విజయంతో ఆరంభించేందుకు భారత బృందం ప్రాక్టీస్ సెషన్లతో బిజీగా గడుపుతోంది. సమిష్టిగా రాణించి సిరీస్ పట్టేయాలనే కసితో ఉంది టీమిండియా. అయితే.. ఇంగ్లండ్‌లో సహచరులంతా హుషారుగా ఉంటే రవీంద్ర జడేజా మాత్రం టీమ్ బస్సులో డల్‌గా ఉంటున్నాడు. అందుకు కారణం ఏంటి? అని ఆరా తీయగా.. అసలు విషయం బయటపడింది. ఎప్పుడూ బస్సులో పక్కనే కూర్చుండే రోహిత్ శర్మ లేకపోవడంతోనే జడేజా బోసిపోయినట్టుగా కనిపిస్తున్నాడట. నిరుడు న్యూజిలాండ్ ఆస్ట్రేలియా జట్లపై విఫలమైన రోహిత్ శర్మ మే 7న రోహిత్ టెస్టులకు వీడ్కోలు పలికాడు. హిట్‌మ్యాన్ రిటైర్మెంట్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడి ఫుల్ షాట్లను ఎంజాయ్ చేసే అవకాశం కోల్పోయారు ఫ్యాన్స్. కానీ, జడేజా మాత్రం టీమ్ బస్సులో ఎల్లప్పుడూ జడ్డూ పక్కన కూర్చుండే వ్యక్తిని కోల్పోయాడు. విదేశీ పర్యటనల్లో అయినా.. స్వదేశంలో అయినా రోహిత్, జడ్డూలు పక్కపక్కనే కూర్చుండేవారు. ఆద్యంతం జోకులు పేలుస్తూ నవ్వించే హిట్‌మ్యాన్‌ను ఇంగ్లాండ్ పర్యటనలో జడేజా ఎంతో మిస్ అవుతున్నాడు. ప్రస్తుతం అతడు టీమ్ బస్సులో ఒంటిరిగా కూర్చుంటున్నాడు. పక్క సీటు ఖాళీగాను ఉంటోంది. దాంతో, రోహిత్ రిటైర్మెంట్‌తో ఒంటరి అయిన జడేజా అంటూ అభిమానులు వీడియోలు పెడుతున్నారు. ఇంకే ముంది ఈ ఆల్‌రౌండర్ నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాడు. సీనియర్ స్పిన్నర్ అశ్విన్ గైర్హాజరీలో స్పిన్ బౌలింగ్ విభాగానికి జడ్డూనే నాయకత్వం వహించనున్నాడు.

# యువతరంగం

ఫోకస్

## యుద్ధం.. విధ్వంసకారకం

ఎప్పుడైనా... ఎక్కడైనా... యుద్ధం విధ్వంసకారకమే అవుతుంది. ప్రపంచ చరిత్రను తిరగేస్తే, యుద్ధాలు మనిషి ఆవిర్భావం నాటి నుంచీ కొనసాగుతూనే ఉన్నాయనే విషయం స్పష్టమవుతుంది. ఆ యుద్ధాలకు వ్యతిరేకంగా ఎంతో మంది గొప్పవాళ్లు వేదనతో వేదనలు చెప్పినా, ఇప్పటికీ ఆయుధాల మోత ఆగలేదు. ఈ మానవ నిర్మిత సంక్షోభాల్లో అత్యధికంగా ఇబ్బంది పడే వర్గం యువత.



శక్తితో, ఆశతో, కలలతో నిండిన వారు... అనుకోకుండా యుద్ధపు ఆరాటాల్లో బలవుతుంటారు. వారికి బుల్లెట్ల మోతలు బాల్యాన్ని నాశనం చేస్తాయి, బాంబుల కేకలు భవిష్యత్తుపై నీడలు మోస్తాయి. యుద్ధాల వల్ల మొదటి దెబ్బ విద్యపై పడుతుంది. యుద్ధం మొదలైన వెంటనే అక్కడి విద్యా వ్యవస్థ నిలిచిపోతుంది. పాఠశాలలపై బాంబులు పడతాయి, విద్యార్థులు ప్రాణభయంతో పాఠశాలలకు కూడా వెళ్లరు. జనావాసాలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలపై దాడులు చేయరాదన్న యుద్ధ నియమాల ఉల్లంఘన నిరాటంకంగా కొనసాగుతునే ఉంటుంది. గాజాలోని పాఠశాలలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేయడం, వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం మన కళ్ల ముందు కనిపిస్తున్న సత్యం. యుద్ధాల కారణంగా విద్యాలయాలు మూతపడతాయి. ఉపాధ్యాయులు ఆ ప్రాంతం విడిచి వెళ్లిపోతారు. ఇంటర్నెట్, విద్యా వనరులు కూడా నిలిచిపోతాయి. ఉదాహరణకు యుక్రెయిన్‌లో 2022 తరువాత వేలాది మంది విద్యార్థులు ఆన్లైన్ విద్యను కొనసాగించలేక విద్యను మానేశారు. యుద్ధ సమయాల్లో దేశంలోని యువతను సైనికులు నియమించడం పరిపాటి. చాలా సందర్భాల్లో యువతకు నిర్బంధ సైనిక సేవ అనివార్యమవుతుంది. సరైన శిక్షణ, నైపుణ్యం లేనికారణంగా, వీరే శత్రు దాడుల్లో ఎక్కువగా గాయపడతారు. మందుల కొరత వల్ల చికిత్స లేక చనిపోతారు. ఆయుధాలు పట్టే చేతులు, ఒకప్పటికి పుస్తకాలు పట్టినవే కావడం తీవ్ర విషాదం. యుద్ధం మానవ మనస్సును చిదిమేస్తుంది. యువతలో మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. నిరంతరం భయాందోళన వెంటాడుతుంది. కుటుంబాలకు దూరం కావడంతో, ఒంటరితరం వేధిస్తుంది. ఆత్మహత్యలు పెరుగుతాయి. యుద్ధం జరిగే ప్రాంతాల నుంచి లక్షలాది మంది యువత ఇతర దేశాల్లోకి శరణు వెళ్లడం జరుగుతున్నది. ఇక, బాల్యానికి బదులు బాంబులతో పిల్లల సహవాసం అత్యంత దారుణం. వారు తినే ఆహారం, దుస్తులు, ఆరోగ్య సదుపాయాలు అన్నీ అంతంత మాత్రమే. వివిధ దేశాల్లో యుద్ధ సమయంలో బాల సైనికులను నియమించడం ఒక దుర్మార్గపు పద్ధతిగా మారింది. కాంగోలో బాల సైనికుల సంఖ్య లక్షకు పైగా ఉండేది. 10 ఏళ్ల పిల్లల చేతుల్లో ఎకె47లు ఉండేవి. యువతుల పరిస్థితి కూడా భయంకరంగానే ఉంటుంది. లైంగిక దాడులు.. అక్రమ గర్భధారణలు జోరందుకుంటాయి. మానవ అక్రమ రవాణా సాధారణమైన విషయంగా మారుతుంది. అవకాశాలుగా ఉండాల్సిన యుక్తవయసు, అపహాస్యమవుతుంది. స్థూలంగా చెప్పాలంటే యుద్ధాలు అన్ని వర్గాలను దెబ్బతీస్తాయి. ముఖ్యంగా యువత కోలుకోలేని దెబ్బ తింటుంది. ఆర్థిక వ్యవస్థ నాశనమవుతుంది. నిరుద్యోగం విలయతాండవం చేస్తుంది. పరిశ్రమలు మూతపడతాయి. వ్యవసాయ భూములు ధ్వంసమవుతాయి. ఆధునికత ఊసే ఉండదు. అభివృద్ధి ఎక్కడా కనిపించదు. క్రీడలు, కళలు, సాహిత్యం.. ఇలా అన్నింటా చిమ్మచీకట్లే.. క్రీడాకారులు తుపాకులు మోస్తారు. కళాకారులు శరణార్థుల శిబిరాల్లో పాడుతారు. రచయితలు శోకగీతాలు రాస్తారు. యువత అభివ్యక్తికి మార్గాలు కరవై, దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుంటారు. సిరియాలో యుద్ధం వల్ల యువత చదువుకోలేక, బాల సైనికులుగా మారారు. వారి కోరికలన్నీ శ్మశానంలో కలిసిపోయాయి. పాలస్తీనాపై జరుగుతున్న నిరంతర దాడులతో యువత జీవితాన్ని ప్రారంభించలేకపోయారు. వారిని ప్రపంచం చిన్న చూపుతో చూస్తోంది. సూడాన్, ఇరాక్, లిబియా వంటి దేశాల్లో ఆయుధాలు మాత్రమే మాట్లాడే భాష. అక్కడ యువత మౌనం తప్ప సాధించిందేమీ లేదు. ఉక్రేన్‌లో కాలేజీ విద్యార్థులు రంగులో కళలు కాక, రక్తం చూశారు. అక్కడి కళాశాలలు కూలిపోయినప్పుడు కలలూ కూలిపోయాయి. ప్రస్తుత కాలంలో జరుగుతున్న యుద్ధాల్లో చాలా వరకూ నివారించతగినవే కావడాన్ని ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించుకోక తప్పదు. వివిధ దేశాలు ఆధిపత్య ధోరణలను విడిచిపెట్టి, యుద్ధం కాకుండా మౌలిక సంస్కరణలపై దృష్టి పెట్టాలి. యువతకు మానసిక వైద్య సేవలు అందించాలి. శరణార్థులకు న్యాయమైన జీవిత అవకాశాలు ఇవ్వాలి. యువతను శాంతి ప్రతినిధులుగా తీర్చిదిద్దాలి. యుద్ధం మానవతకు చేటు. కానీ అది యువతను తినేస్తే, అది భవిష్యత్తునే అంధకారంలో నెట్టివేస్తుంది. యువత కన్నీళ్ల కాదు, నవ్వుల కోసం పుట్టింది. బాంబుల దుమ్ములో వారు కనపడకపోయినా, వారి చాటున్న బాధలు ప్రపంచం వినాలి. ప్రపంచం వారి కోసం స్పందించాలి. వారికి తుపాకులు కాకుండా పుస్తకాలు కావాలి. వారు శిబిరాల్లో కాదు.. విద్యాలయాల్లో ఉండాలి. – శాస్త్రాల మందిరాల్లో ఉండాలి. వారు కన్నీళ్లలో కాక.. కలల్లో.. కళల్లో తేలాలి. ఆ రోజు వస్తుందని ఆశిద్దాం.

## మధ్యాహ్న భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనం

### సంఘం రాష్ట్ర యూనియన్ డిమాండ్

### కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా, వినతిపత్రాల అందజేత




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, నాలుగు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన తెలిపి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి (అనుబంధం) ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డిఇఒ రాజేందర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొరిమి సుగుణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా వంట బిల్లులు ఇవ్వలేదని, కోడిగుడ్లు, అల్పాహార బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో మధ్యాహ్న కార్మికులకు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి మధ్యా హ్నం భోజన కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, ఉమాదేవి, బెల్లంకొండ స్వప్న, సంబడి చంద్రక్క, వేముల రాజేశ్వరి, సమత, సరోజన, కళావతి, మమత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ములుగు :** పాఠశాల వంట కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముత్యాల రాజు, సంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, పోరెడ్డి ప్రమీల,గడ్డం భారతి, లక్ష్మి, పిసమ్మక్క, జమున, సుశీల, విజయ, చెంచులక్ష్మి, రమణ, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, రాజకుమారి, పద్మ, షఫియా, జానకీ, జె లక్ష్మి, ఎం సరోజన, సుమతి, నర్సమ్మ, తులసి, కుమారి, వెంకటరమణ, రమాదేవి, ఫైమా, లావణ్య, నాగమణి పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని, నాలుగు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, యూనియన్ జిల్లా కార్యదర్శి పూసల రమేష్, ఓదెల రమేష్, సిహెచ్ తిరుపతి, కళావతి, రాధమ్మ, పద్మ, భాగ్య. ఎండి ఎరిగాన, కాసర్ల పద్మ, మున్నాబి తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరి రూరల్ :** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకే కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సామల శోభన్‌బాబు, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బాగుల వసంత, జిల్లా ప్రధానకార్యదర్శి ముంతాజ్ బేగం, అనసూర్య, పారిజాత, స్వేత, పూర్ణమా, రమ, లక్ష్మ మ్మ, రమ, వరలక్ష్మి, రత్న, జాన్సీ, రూప, మున్ని, లక్ష్మి, రేణుక, వెంకటమ్మ, పారిజాత, పుష్ప, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.







## ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

### సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ధ్యేయమని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో సిపిఐ మండల మహాసభ నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మంద పవన్ పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజల భవిష్యత్ అంధకారంలో నెట్టివేయబడిందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం పేద ప్రజల కోసం కాకుండా పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుందన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లెబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక లోకాన్ని అభద్రత భావంలోకి నెట్టివేశారన్నారు. నిత్యావసర ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపీ పేద ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి రుణం మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం మహాసభలో 11సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, మండల కార్యదర్శి మిట్టపల్లి సుధాకర్, సంజీవ్, మల్లయ్య, వెంకట్, మల్లేశ్, మిట్టపల్లి నవీన్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## 'ఇందిరమ్మ, రాజీవ్' పథకాల్లో అవకతవకలు

### అర్హుల ఎంపికలో కుమ్మక్కు

### విచారణ జరిపి చర్యలు చేపట్టాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్

### ఎంపిడిఒ కార్యాలయం ముట్టడి

### పలువురి అరెస్టు




**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక, రాజీవ్ యువ వికాస్ పథకం లబ్దిదారుల ఎంపికలో అవతకవకలు జరిగాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులతో అధికారులు కుమ్మక్కై అర్హులకు అన్యాయం చేస్తున్నారని, ఎంపిడిఒపై అధికారులు సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ చిగురుమామిడి మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఎంపిపి కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ది చేకూర్చకుండా కాంగ్రెస్ నాయకులు ఎంపిడిఒతో కలిసి అనర్హులను ఎంపిక చేశారంటూ ఆరోపించారు. అర్హులైన పేదలకు పథకాలు మంజూరు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎంపిడిఒ వైఖరిని ఖండించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ఆందోళన విరమించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు సిపిఐ నాయకులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో సహా సిపిఐ నాయకులందరినీ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు అందించే క్రమంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి ,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్‌సభ్యులు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, అందె చిన్నస్వామి, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, బావండ్లపెల్లి యుగేందర్, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేష్, మాజీ సర్పంచులు గోలి బాపురెడ్డి, కోమటిరెడ్డి జయపాల్ రెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శులు ఎలగందుల రాజు, కయ్యం తిరుపతి, మంద ఎల్లయ్య పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు




**ప్రజాపక్షం/చింతపల్లి:** ప్రజాపోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో బిజెగార్డెన్‌లోని మల్లోజు చంద్రమణెమ్మ ప్రాంగణంలో సిపిఐ మండల 15 మహాసభలు సోమవారం జరిగాయి. మహాసభకు నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. దున్నే వాడికి భూమి కావాలనే నినాదంతో దేశచరిత్రలో మహోజ్వలమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి, పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదను, ప్రజల ఆస్తులను కార్పోరేట్ పెట్టుబడుదారులకు దోచిపెడుతుందని, సంపద సృష్టికర్తలైన కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి, వారి జీవితాలతో చెలగాటమాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుకుంటే వాటిని అదుపు చేయడంలో కేంద్రం వైఫల్యం చెందిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడం కోసం ప్రజలందరూ ఏకమై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై అవలంభిస్తున్న మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్లు పెంచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, పార్టీలకతీతంగా పేదలను గుర్తించి ఇళ్లను మం జూరు చేయాలని, డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ప్రజాసమస్య ల పరిష్కారానికి నిరంతరం పోరాడే కమ్యూనిస్టు పార్టీకి ప్రజలంతా బాసటగా నిలవాలని నెల్లికంటి పిలుపునిచ్చారు. సభలో మాజీఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, గిరిజన సమా ఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంజయ్య నాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు ఉజ్జిని యుగంధర్‌రావు, పోలే వెంకటయ్య, సుదర్శన్ రెడ్డి, ఉజ్జిని అంజల్ రావ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగరావు, బుచ్చయ్య, శంషోద్దీన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.







## ఎన్ఎంఆర్ కార్మికులకు వేతనాలు పెంచాలి

ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు ఎండి మాషూక్ డిమాండ్

**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఎన్ఎంఆర్ బేస్ కింద వివిధ కేటగిరీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు ఎండి మాషూక్ డిమాండ్ చేశారు. సోమవారం అసిస్టెంట్ కమిషనర్ లేబర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు ఎండి మా షూక్ మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర ధరలను పరిగణలోకి తీసుకొని అనేక సమస్యలతో సతమవుతున్న కార్మికులకు వేతనాలు వెంటనే పెంచాలన్నారు. లేనిపక్షంలో దశల వారిగా ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్, నరేందర్, శ్రీ నివాస్, రామ్‌రెడ్డి, శ్రీధర్, ఉపేంద్ర, సరిత, భారతి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలితెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టిజెఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రజలు సంఘటితంగా పోరాటాల ఫలితాలంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని, దాదాపు ఆరుదశాబ్ధాల పాటు సాగిన తొలిదశ, మలిదశ పోరులో ఎంతో మంది అశువులు బాసారన్నారు. సకల జనులు ఎన్నో కష్టనష్టాలను, నిర్భాందాలను ఎదుర్కొని పోరాటాలు నిర్వహించారన్నారు. గత పదేళ్ల పాలనలో అధికారంలో ఉన్న పాలకులు తెలంగాణ అమరుల కుటుంబాలను కాని, తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోలేదని, ఫలితంగా ఉద్యమకారులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే నేరవేర్చాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, అమరుల కుటుంబాలకు పెన్షన్ ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం, సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు ప్రత్యేక అవకాశం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో టిజెఎస్ రాష్ట్ర కమిటి సభ్యులు గుంటి రాంచందర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావీద్, చిల్లి రాజేంద్రప్రసాద్, బొనగాని రవీందర్, ఎలిశా రాజేష్, బందెల సదానందం, చిర్ర శ్రవణ్, సోల్తి సాయికుమార్, మహమ్మద్ అలీ, తాళ్లపెల్లి సాంబలక్ష్మీ, కోరె లక్ష్మీ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పరిశీలన

వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఝాన్సీ



**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంలో 350 డబుల్ బెడ్ రూమ్ గృహములు, గూడూరు గ్రామంలో 50, మర్రిపల్లిగూడెంలో 50 గృహములు ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రభుత్వం ప్రారంభించి పూర్తి చేయకుండా అసంపూర్తిగా మధ్యలోనే వదిలివేయడం జరిగిందని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్ అన్నారు. ఇందులో 30 డబుల్ బెడ్ రూమ్ గృహములు ప్రెస్ మిత్రులకు కూడా కేటాయించారు. దీనిపై హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు స్పందించి ఇల్లు లేని నిరుపేదలకు త్వరితగతిన డబుల్ బెడ్‌రూంలో అందించాలనేటువంటి లక్ష్యంతో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తో హ న్మకొండ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడడం జరిగింది. డబుల్ బెడ్ రూమ్‌లకు సంబంధించి పెండింగ్ ఉన్నటువంటి శానిటరి ఎలక్ట్రిసిటి వాటర్ సప్లై తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయుటకు జిల్లా కలెక్టర్ చే చర్యలు తీసుకోబడి, పనులు పూర్తి కాపాడుతున్నవని, అతి త్వరలో డబుల్ బెడ్ రూమ్ పనులు పూర్తి చేసి అర్హులైన పేదలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందించబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వాణి జీఎస్ఎల్ అధ్యక్షులు కుంభంపాటి ప్రసాద్, గూడెపు మొగులయ్య, కూచన నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

## మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పేర్నె ఉష ఎన్నిక



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా పేర్నె ఉష రెండవసారి ఎన్నిక కావడం జరిగింది. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన మహిళా కాంగ్రెస్ పార్టి సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు హాజరై మాట్లాడారు. అనంతరం జరిగిన మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఎన్నికలలో భాగంగా రఘునాథపల్లి మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా రెండవసారి పేర్నె ఉషను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికకు సహకరించి జాతీయ మహిళ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అల్కలాంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, వరంగల్ పార్లమెంట్ ఎంపి కడియం కావ్య, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పటిష్టత కోసం శక్తి వంచన లేకుండా తాను కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## అవమానంతో పురుగుల మందు తాగి బాలుడి మృతి



**ప్రజాపక్షం / నల్లబెల్లి:** మేకను కోయడంతో చేతికి అంటిన రక్తాన్ని నీటి తోట్టిలో ఉన్న నీటితో చేతులను కడుక్కుంటుండగా నా నీళ్లతో చేతులు ఎందుకు వాడుకుంటున్నావని ఓ మహిళ బాలుడిని బూతులు తిట్టి చిన్న పచ్చి బరిగతో వీపుపై కొట్టడంతో అవమానం భరించలేక బాలుడి ఇంట్లో ఉన్న పురుగుల మంది చికిత్స పొందుతు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్‌లో చోటు చేసుకుంది. బాలుడి తల్లి జెల్ల లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వడిచెర్ల గోవర్ధన్ వివరాలు చెబుతూ శనివారం కొండాపూర్ గ్రామంలో కొల కొంరమ్మ మేకను కోయ్యడానికి జెల్ల శ్రీకాంత్, పత్రి అశోక్‌లను పిలిచిందని తెలిపారు.చికిత్స పొందుతు శ్రీకాంత్ (14) సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు . మృతిని తల్లి జెల్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేస్ ధర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు .

# భూ సమస్యల పరిష్కారానికి కృషి

రెవెన్యూ సదస్సులను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్యశారదదేవి



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించేందుకు భూమాతను తీసుకువచ్చి గ్రామస్థాయిలో సదస్సులను ఏర్పాటు చేసిందని రైతులు చెప్పిన సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదదేవి సూచించారు . నల్లబెల్లి మండలంలోని నందిగామ, కన్నారావుపేట గ్రామాల్లో అధికారులు ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యశారదదేవి మాట్లాడుతూ రైతులు సదస్సులను ఉపయోగించుకోని భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు . రైతులు అధికారులకు సహాకరించి భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు . భూ భారతి చట్టం అమలు చేసేందకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రైతుల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు తీసుకుంటుందన్నారు. అధికారులు అలసత్వం పాటించకుండా రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం నందిగామ,కన్నారావుపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు ప్రక్రియను పెంచాలన్నారు. ప్రభుత్వ విధ్యా కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు,పాఠశాలలో మౌలిక వసతులపై ప్రజలకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ విధ్యాను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులక, మండల, జిల్లా అధికారులు కృషి చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విధ్యాధికారి ఎం.జ్ఞానేశ్వర్, తహసీల్దార్, ఎం.కృష్ణ , ఎంపిడిఓ జి.నర్సింహమూర్తి , ఎంఈఓ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 31 ఫిర్యాదులు

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదుల అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టరేట్‌తో పాటు, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావులకు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. ఆర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 31 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 21, భూ సమస్యలు 04, ఇతర శాఖలకు సంబంధించినవి 06 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చ ట్టంలో భాగంగా గ్రామ స్థాయి లో రెవెన్యూ సదస్సులు సద్వినియోగపర్చుకోవాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలం గొల్లచర్ల, ములుకనూరు, కొత్తపేటలో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 20వరకూ కొనసాగే ఈ రెవెన్యూ సదస్సుల్లో రైతులు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. గతంలో తమ పరిధిలో లేని అనేక సమస్యలకు ఈ కొత్త చట్టంలో అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు. సులభంగా క్షేత్రస్థాయిలో సమస్యలు పరిధిలో పరిష్కరించడం కోసం ప్రవేశపెట్టి మొదటిసారి పైలెట్ ప్రాజక్ట్‌గా కొనసాగి ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ సదస్సులు జరుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాల్లో షెడ్యూలు ప్రకారం ముందస్తుగా సమాచారం అందించి సదస్సుల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్లు నాగరాజు, ఇమ్మానియేల్, శారద తదితరలు పాల్గొన్నారు.

## సమష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యం

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమష్టికృషి, సమన్వయంతో బాల కార్మికు వ్యవస్థ నిర్మూలన సాధ్యపడుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలమేరకు జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జూన్ 9 నుండి 15వరకు ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంపై సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమన్వయ సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జే జయంతి అధ్యక్షతన నిర్వహించగా హాజరైన కలెక్టర్ ప్రావిణ్య గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ టీమ్ నిబంధనల ప్రకారం జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మిక శాఖ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక శాఖ, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్, షేర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ,స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు.పద్నాలుగు సంవత్సరాల లోపు బాల బాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యజమానులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని, పద్దెనిమిది సంవత్సరాల లోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యజమానులపై కేసులు నమోదు చేయాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జే జయంతి మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ విజయవంతం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే సాధ్యమవుతుందని, రోజు వారీ నివేదికలు కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో సేకరించి నివేదికలు అందజేయాలని అన్నారు, కాగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ గార్డెన్ లో ర్యాలీ, అనంతరం లేబర్ అడ్డా వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఏఎస్ వినిత,ఎన్సిఎల్పి డైరెక్టర్ బుర్ర అశోక్ కుమార్, బాలల సంక్షేమ సమితి సభ్యులు కజాంపురం దామోదర్, సందసాని రాజేంద్ర ప్రసాద్,జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్,చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, ఏహెచ్టియూ ఎస్ఐ పీ ఫిలిప్ రాజ్, పిసి రాము, ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ,ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, సోషల్ వర్కర్స్ ఎం శ్రీనివాసులు, జి సునిత, ఓఆర్డబ్ల్యూ పి విజయ్ కుమార్, షేర్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ టి శిరీష, ప్రతినిధులు బి జమున, బి జ్ఞానేశ్వరి,చామంతి తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/చిట్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని ప్రజలు ప్రభుత్వాన్ని ఆదరించాలని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మండలంలోని వోడితల, పాసిగడ్డ తండా, గోపాలపురం, కొత్తపేట ,బావుసింగ్ పల్లి, జడల్ పేట, వరికోల్ పల్లి, నైన్ పాక, అందుకు తండా, గిద్దె ముత్తారం, కాల్వపల్లి, నవాబుపేట, చిట్యాల, తిరుమలాపూర్, జూకల్, చల్లగరిగ గ్రామాలలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన తో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శిలాఫలకాల ప్రారంభోత్సవం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పట్టాలు, ఇండ్లకు భూమి పూజల కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం స్థానిక ఎంఎల్ఏ జిఎస్ఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రైతులకు రుణమాఫీ మహిళలకు ఫ్రీ బస్సు, ఉచిత కరెంటు ప్రజలకు సంక్షేమ పథకాల తో పాటు సన్న బియ్యం రేషన్ కార్డులు రైతుల సమస్య పరిష్కారానికి భూభారతి, ప్రజల శ్రేయస్సు కోరుతూ ఎన్నో సంక్షేమ పథకాలు పెడుతూ దాన్ని అమలు చేస్తున్నామన్నారు. వైద్య రంగంలో, విద్య రంగంలో కానీ వ్యవసాయ రంగంలో, డ్వాక్రా మహిళల అభివృద్ధి కి ప్రభుత్వం పెద్దపీటమేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు రానివారు అధైర్య పడద్దని రెండో విడతల తప్పనిసరిగా అందిస్తామన్నారు. సంక్షేమ పథకాలలో లబ్ధిదారుల నుండి ఎలాంటి అవినీతికి పాల్పడిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భూములు ఉండి గతంలో పట్టాలు లేని వారికి పట్టాలు ఇస్తామని సూచిస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా భూపాలపల్లి ని అగ్రగామిక నియోజకవర్గంగా ముందంజలో అభివృద్ధి కి బలుపు పెట్టింది పేరుగా కృషి చేస్తానని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మాటలతో మభ్యపెట్టి పాలన కొనసాగించిందని ఎద్దేవా చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ఏఎంసీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి, శంకర్ గౌడ్, ఏకు రవీందర్, దొడ్డికిష్టయ్య, అల్లకొండ కుమార్, ఎంపీడీవో జయశ్రీ, తహశీల్దార్ షేక్ ఇమామ్ బాబా, లక్ష్మణ్ గౌడ్ రాయకుమురు గజ్జి రవి హౌసింగ్ డిఇ, ఎఈ లావణ్య, ఆర్ ఐ రాజేందర్, ఎంపీఓ అయిత రామకృష్ణ, స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అధికారులు, గ్రామాల ప్రజలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల స్వంత ఇంటి కల సాకారం అవుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గం 13 డివిజన్ల పరిధిలోని 1,2, 3,43,44,45,46, 55,56,64,65,6 6 డివిజన్ల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సుమారు 750 మందికి మంజూరు పత్రాలను మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి అందజేసినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 22వేల 500కోట్లతో 4లక్షల 50వేల ఇళ్ల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. అందులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో 175కోట్లతో 3వేల 500ఇల్లు నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. ఇందులో ఒక్కో ఇంటికి 5లక్షల చొప్పున 4 విడతలలో నేరుగా లబ్ధిదారు ఖాతాలలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా జరిగిందని అన్నారు. అధికారులు గ్రామాలలో లబ్ధిదారులను, గ్రామస్తులను వెంట పెట్టుకొని ఒకటికి రెండుసార్లు సర్వే చేసి ఎంపిక చేశారని అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 20వేల దరఖాస్తులు వస్తే 8వేల మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. అయితే అందరికీ ఒకేసారి ఇల్లు రావని, మొదటి విడతలో రాని వాళ్లకు రెండవ విడతలో అవకాశం వస్తుందని వివరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధైర్యపడవద్దని అర్హులైన వారికీ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరైనా డబ్బులు ఇచ్చినట్లు తెలిస్తే ఇల్లు రద్దు చేసి డబ్బులు తీసుకున్న వారిని కచ్చితంగా జైలు పంపిస్తా అన్నారు. కాంగ్రెస్ పపాలనలో ఇప్పుడు ఎక్కడ అవినీతికి ఆస్కారం లేకుండా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మీకు ఏ సమస్య ఉన్న నా దయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 కి ఫోన్ చేసి మీ సమస్య తెలియజేసే త్వరితగతిన మీ సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, హౌసింగ్ డిఈ, ఇతర అధికారులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గోకుల్‌నగర్ జంక్షన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే గోకుల్ నగర్ జంక్షన్ అభివృద్ధిపై, అక్కడి మౌలిక సదుపాయాల నిర్వహణపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, నగర కమిషనర్ అశ్విని తనాజీ వాకడే కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు జంక్షన్ ప్రాంతాన్ని, అక్కడి నుంచి రాజాజీ నగర్ వరకు వున్న ప్రధాన రహదారి ఇరువైపులా ప్రవహిస్తున్న డబుల్ డ్రైనేజీలను, వర్షపు కాలంలో నీరు నిలువకుండా చూసే దిశగా సైడ్ డ్రైనేజీల పనితీరు తదితర అంశాలను సమీక్షించారు. ప్రజలు తరచూ వాహనదారులు, పాదచారులు అధికంగా ఉపయోగించే ఈ ప్రాంతాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని జలమార్గాల్లో ఎక్కడైనా ఆటంకాలు, మురికి నిలిచే ప్రాంతాలు, పొలమైన డబుల్ డ్రైన్లు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రోడ్డు దారి మధ్య భాగంలో లేదా ఇరుకైన మలుపుల వద్ద వాహనాలకు అంతరాయం కలిగించే అంశాలను గుర్తించి వాటిని తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంక్షన్ అభివృద్ధిలో భాగంగా తగిన విద్యుద్దీపాలు, ఫుట్‌పాత్‌లు, సిగ్నల్ వ్యవస్థలు, చెట్లతో మార్గ సుందరీకరణ, అవసరమైతే వాహనాల రవాణా దిశలు పునఃపరిశీలన వంటి అంశాలపై ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ ఈ.వి శ్రీనివాస్ రావు, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బంక సతీష్, నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జనగామలో పర్యటించిన ట్రైనీ ఐఎఎస్ అధికారులు



**ప్రజాపక్షం/జనగామ:** శిక్షణలో ఉన్న తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారులు సోమవారం జిల్లాలో పర్యటించారు. ఐఎఎస్ అధికారిని ఉషా నేతృత్వంలో కొయ్యడ ప్రణయ్, సౌరబ్ శర్మ, హరీష్ చౌదరి, క్యారలీన్ సలోనిలు సోమవారం కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించగా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్‌లు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో సమావేశం అయ్యారు. జిల్లాలోని ప్రధాన అంశాలపై చర్చించారు. జనగామ మండలంలోని పెంబర్తి కోఆపరేటీవ్ సొసైటీ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. వస్తువులు పరిశీలించారు. అనంతరం రఘునాథపల్లిలోని కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా లైజర్ అధికారులు, మార్కెటింగ్ అధికారి నరేంద్ర, బిసి అభివృద్ధి శాఖ అధికారి రవీందర్ ఉన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## పేదలకు అండ కాంగ్రెస్ జెండా: ఎమ్మెల్యే మట్టా

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ జెండా ఉంటుందన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి. పట్టణంలోని 6వ వార్డ్ తోట వెంకట్రావు వీధిలో జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, పింగుల సామ్యూల్, తోట సుజాల రాణి, తోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన పొన్నం ప్రసాద్‌కు రూ.23వేల విలువగల సిఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరయ్యింది. బాధితుడు అనారోగ్య ఖర్చుల నిమిత్తం సిపిఐ పార్టీ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా లభించింది. కాగా అక్కడ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారుడికి ఇంటి వద్దకు వెళ్లి సోమవారం భార్య కుమారికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, సిపిఐ 28వ డివిజన్ కార్యదర్శి లగిశెట్టి రమేష్, 29వ డివిజన్ కార్యదర్శి వెంపటి రాము, 30వ డివిజన్ కార్యదర్శి బియ్యాల రాజు, ఎఐవైఎఫ్ 29వ డివిజన్ కార్యదర్శి మిర్యాల నరుణ్‌తేజ్, 30వ డివిజన్ అధ్యక్షుడు దైథా జేమ్స్, కార్యదర్శి , సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ రెబ్బగొండ్ల గోపి, డివిజన్ సభ్యులు , యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**సత్తుపల్లిమండలంలో:** మండల పరిదిలోని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 23 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.6,47 , 000 విలువ గల చెక్కులను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ అభివృద్ధి, పథకాలు అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రిమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి భట్టి, తుమ్మల, పొంగులేటిలకు ధన్యవాదములు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలు కు రూ.10 లక్షల తో పాటు, ట్రీట్మెంట్ జరిగిన తరువాత వైద్య ఖర్చులు నిమిత్తం ధరఖాస్తు చేసుకున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ , పార్టీ పట్టణ అధ్యక్షుడు , సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా 'జయ'డెంటల్ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని(డిబిఆర్‌సర్కిల్) అనసూర్య క్యాంప్లెక్స్‌లో గల జయ డెంటల్ హాస్పిటల్ మొదటివార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనికి సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ఏర్పాటు చేసిన కేక్‌ను హాస్పిటల్ నిర్వాహకులతో కలిసి కట్ చేశారు. సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, సిపిఐ 28వ డివిజన్ కార్యదర్శి లగిశెట్టి రమేష్, 29డివిజన్ కార్యదర్శి వెంపటి రాము, 30వ డివిజన్ కార్యదర్శి బియ్యాల రాజు, ఎఐవైఎఫ్ 30వ డివిజన్ కార్యదర్శి బంక అశోక్, డివిజన్ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలి: కొట్టి




**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో భాగంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినదని, అధికారంలోకి వచ్చిన వంద రోజులలో 6 గ్యారెంటీల లోని 13 అంశాలను అమలు చేస్తామని చెప్పి, గ్యారెంటీ కార్డుల పేరుతో గద్దినెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు చేయడం లేదని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు సాగునీటిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల రైతాంగానికి తక్షణమే అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు , తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ నాటికి ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నవంబర్ నెలాఖరు నాటికి మహిళా శక్తి భవనాలు పూర్తి కావాలని పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్ నుండి సిఎస్ కె రామకృష్ణరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ప్లాంట్లకు అనువైన భూములు పదిరోజుల్లో గుర్తించాలన్నారు. కోటి మందిని లక్షాధికారులను చేయాలనే ఉద్దేశ్యంతో మహిళలను ప్రోత్సహిస్తున్నామని, ఇందులో భాగంగా పెట్రోల్ పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదరికం అధికంగా ఉండే చోట మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు.

## 14న మెగా లోక్ అదాలత్



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం:** ఈ నెల 14న మధిర కోర్టులో జరిగే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రుపాలెం ఎస్ఐ రమేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాక్సిడెంట్ , కొట్టుకున్న కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూతగాదాలు, వివాహ సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగతనాల కేసులు ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. కక్షిదారులు తప్పనిసరిగా ఫిర్యాదుదారు డు, నేరస్తుడు ఇద్దరు తమ ఆధార్ కార్డులు తీసుకుని మధిర కోర్టుకు రావాలని తెలిపారు.

# ప్రజా అవసరాలే ఎజెండా

కుల గణన దేశానికి ఆదర్శం
భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలి
మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి
ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలే ఎజెండాగా పాలన సాగిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. మనం చేపట్టే పనులు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేవిధంగా ఉండాలని ఆయన తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయ సమీపంలో గౌడ కులస్తుల కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రవాణా, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ లు పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్ని అడ్డంకులు సృష్టించాలని చూసినా కులగణనను నిష్పక్షపాతంగా ఎటువంటి తప్పులు లేకుండా శాస్త్రీయబద్ధంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రధాని మోడీ సైతం దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టేందుకు తెలంగాణ కుల గణన ఆదర్శంగా నిలిచిందన్నారు.పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కుల గణన చేపట్టడంతో పాటు శాసనసభలో ప్రవేశపెట్టి బిల్లులను కూడా ఆమోదించడం జరిగిందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించేవిధంగా బిల్లులను ఆమోదించడం జరిగిందన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, కోచింగ్ సెంటర్ తదితర సౌకర్యాలను ప్ర భుత్వ సహకారంతో సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.

**సహాయ సహకరాలను అందిస్తాం :** గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం తరుపున సహాయ సహకరాలను అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృ హ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తె లిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తె లిపారు.

**చదువు ఎంతో ముఖ్యం :** మంత్రి పొన్నం ప్రభాకర్ కుల వృత్తితో పాటు చదువు కూడా ఎంతో ముఖ్యమని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గౌడ కులస్తుల ఆత్మగౌరవం నిలిచేలా ఖమ్మంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికిఉపముఖ్యమంత్రిభట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి , తుమ్మల నాగేశ్వరరావు, జిల్లాలోని ఎంపిలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ నిధుల నుంచి కొంత మేర నిధులు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. సంవత్సర కాలంలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల నుంచి వచ్చే పిల్లలు చదువుకునేవిధంగా గతంలో పెద్దలు హిమాయిత్ నగర్‌లో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టినట్లు పలు ప్రాంతాల్లోని ఆలయాల వద్ద కూడా సత్రాలను కూడా నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**దేశం చూపు తెలంగాణ వైపు :** పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ యావత్ దేశం చూపు తెలంగాణ వైపు చూస్తుందని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కమ్యూనిటీ హాల్ పేదలకు ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరికి సముచిత స్థానం కల్పిస్తుందని సామాజిక న్యాయం పాటిస్తుందని ఆయన తెలిపారు. ఏ కులంలో ఉన్న ఇతర కులాలను గౌరవించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు ,రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మ ణ్‌రావు గౌడ్, గౌడ సంఘం నేతలు ,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో అంబరాన్ని అంటిన సిపిఐ సంబరాలు

ఎమ్మెల్యే కూనంనేనిపై వేసిన అనర్హత పిటీషన్‌ను హై కోర్టు డిస్మిస్
మోటార్ సైకిళ్ల ర్యాలీ, బాణాసంచా పేల్చి కార్యకర్తల హర్షం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావుపై ప్రత్యర్థి ప్రోద్బలంతో ఓ వ్యక్తి వేసిన అనర్హత పిటీషన్‌ను ఏడాదిన్నర నిరీక్షణ అనంతరం గౌరవ తెలంగాణ హై కోర్టు సోమవారం డిస్మస్ చేసింది. అనర్హత పిటీషన్ డిస్మస్ కావడంతో నియోజకవర్గంలోని సిపిఐ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. స్థానిక జిల్లా సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్ నుండి మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో బాణాసంచా పేల్చి ఆనందాన్ని చాటుకున్నారు. ర్యాలీ సందర్భంగా సెంటర్లలో జరిగిన సభల్లో నాయకులు మాట్లాడుతూ దొడ్డిదారిన అందలం ఎక్కుదామనుకున్న ప్రత్యర్థులకు గౌరవయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చెంపపెట్టు అని, ఇది ప్రజల గెలుపుగా చెప్పారు. అప్రజాస్వామిక పదవి పొందాలనుకోవడం అవివేకం అని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవ హైకోర్టు పరిగణలోనికి తీసుకుని న్యాయమైన తీర్పు వెలువరిచిందన్నారు. కూనంనేని నేతృత్వంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో జీర్ణించుకోలేని కొందరు అభివృద్ధిని, కూనంనేని చేస్తున్న కృషిని అడ్డుకునేందుకు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినప్పటికీ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, చలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు సత్యనారాయణ చారి, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సతీష్ హంతకులను శిక్షించాలి

విలేకరుల సమావేశంలో
కుటుంబ సభ్యులు



**ప్రజాపక్షం/భద్రాచలం:** పట్టపగలే ఇంట్లోకి చొరబడి సతీష్‌ను అతి కిరాతకంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక టూరిజం హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో మృతుని వదిన సౌజన్య, సోదరుడు రమణ మాట్లాడారు. పాత గొడవలను మనస్సులో పట్టుకుని సుమారు 50మంది వరకు తమ ఇంటికి వచ్చారని, అందులో కొందరు ఇంట్లోకి చొరబడి దారుణంగా కొట్టారని, రాడ్లు, రోకల బండతో తనలపై బలంగా బాదారని అన్నారు. అయినా కసి చల్లారక కత్తులతో ఇష్టాను సారంగా పొడిచారని అన్నారు. తనను ఇలా చంపుతున్నామో చూడాలని తనను దగ్గర ఉంచి మరీ పొడిచారని, తన సోదరుడు రమణ అడ్డు వస్తే ఆయన్ను కూడా తీవ్రంగా గాయపరిచారని వదిన సౌజన్య చెప్పుకొచ్చారు. దీనంతటికీ ఇద్దరు వ్యక్తులు కారణమని, వారుప్రోత్సహించడం వల్లే ఇదంతా జరిగిందని, వారిని కఠినంగా శిక్షించాలని, హత్య జరిగేందుకు కారకులైన వారిని పోలీసులు కూర్చోబెట్టి మాట్లాడుతున్నారని ఆరోపించారు. అనంతరం గిరిజన నాయకులు సతీష్, సత్యనారాయణలు మాట్లాతూ ఏజెన్సీలో గిరిజన చట్టాలు,ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, పట్టపగలే హత్య జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదివాసీలలాగా మేము కూడా తిరుగబడతే ఏం చేస్తారని ప్రశ్నించారు. దోషులను కఠినంగా శిక్షంచాలని, దీనిపై మానహక్కుల కమీషన్, ఎస్సి, ఎస్టి కమీషన్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## సింగరేణి వైద్యశాలలో మందుల కొరత

సింగరేణి కాలరీస్ వర్కర్స్ (ఎఐటియుసి) యూనియన్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణిలోని ఆయా ఆసుపత్రులలో మందుల కొరత ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏ.ఐ.టి.యూ.సి) బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ ఆధ్వర్యంలో జెవిఆర్ ఒసి డిస్పెన్సరీ అధికారికి సోమవారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సముద్రాల మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ప్రతికూల వాతావరణంలో గనులలో పని చేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నారని, వారికి, రిటైర్డ్ కార్మికులకు (సిపిఆర్ ఎంఎస్) స్కీం ద్వారా వైద్య సౌకర్యాలు అందించే ఒప్పందం ఉందని, సింగరేణి వ్యాప్తంగా అన్నీ ఏరియా ఆసుపత్రులలో నెలకోసారి బిపి, షుగర్, గుండె సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు వంటి ధీర్ఘకాలిక వ్యాధులకు మం దుల కోసం 60 ఏళ్ళ వయసు పైబడిన రిటైర్డ్ కార్మికులు 100, 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సింగరేణి ఆసుపత్రులకు రావడం వలన ఆర్థిక, శారీరక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లలోని సింగరేణి రిఫరల్ ఆసుపత్రులలో మందులు అందించే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని ఏరియా ఆసుపత్రులలో కనీసం రెండు నెలలకు సరిపడా మందులు స్టాక్ ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని యూనియన్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కొత్తగూడెం మెయిన్ హాస్పటల్ తో పాటు గోదావరిఖని, భూపాలపల్లి, రామకృష్ణాపూర్, మందమర్రి, మణుగూరు, ఇల్లందు ఏరియాల్లో ఖాళీగా ఉన్న ఇఎన్‌టి, జనరల్ సర్జన్, రేడియాలజిస్ట్, 175 టెక్నికల్ స్టాఫ్, ఆప్తమాలజీ, ఎక్స్‌రే పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని కావున అట్టి ఖాళీలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మెమోరాండం అందించిన వారిలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బీమయ్య, ఫిట్ కార్యదర్శి నరసింహరావు, సూర్యప్రకాష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో అశ్వారావుపేట మున్సిపాల్టీ

మున్సిపాలిటీగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే: ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట అభివృద్ధిలో భాగంగా నూతన మున్సిపాల్టీగా ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మన మున్సిపాల్టీ మన అభివృద్ధిపై స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామపంచాయతీలను కలిపి కొత్త మున్సిపాల్టీగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నూతన మున్సిపాల్టీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.అశ్వారావుపేట మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.15కోట్లు నిధులతో ప్రణాళిక రూపొందించి అభివృద్ధి దిశగా ముందుగు సాగుతున్నామని తెలిపారు. తాగునీరు సరఫరా, రహదారులు, విద్యుత్ వ్యవస్థ, ఆరోగ్యం, విద్యా సుదుపాయాలతో పాటు అన్ని రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టనున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యం, సహకారం వల్లే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నూతన మున్సిపాల్టీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, స్థానికులు, మండలస్థాయి నాయకులు, అఖిలపక్షాలు ఈ సదస్సులో పాల్గొనగా మున్సిపాల్టీ అభివృద్ధిపై ముఖ్యమైన సలహాలు, సూచనలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సుజాత, తహశీల్దార్ రామకృష్ణ, టిపిఓ వి.శ్రీనివాసరావు, సిఐ నాగరాజు, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# పేదలపక్షపాతి ఇందిరమ్మ ప్రభుత్వం..



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** పేదల పక్షపాతిగా ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏదులాపురంమున్సిపాలిటీ, ఖమ్మంరూరల్‌మండలంల్లో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లిల్లో రూ.94లక్షల అంచనా వ్యయంతో ఖమ్మం,సూర్యాపేట ఆర్అండ్‌బి రోడ్డు నుండి ఆటోనగర్ పొన్నెకల్లు డొంకవరకు నిర్మించనున్న బిటిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే మద్దుపల్లి డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు నివాస ధృవ పత్రాలను అందజేశారు. పొలెపల్లి నుండి రాజీవ్ గృహకల్ప కాలనీ ఎన్.ఎస్. కెనాల్ లాక్స్ వరకు రూ.2కోట్ల 86లక్షలతో నిర్మించనున్న బిటిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తెల్దారుపల్లి గ్రామం ఎస్‌సి నివాస ప్రాంతంలో రూ.50లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న 11అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ఎల్.బాబు, భారతి దంపతులు ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రూ.50లక్షలతో నేడు అంతర్గత సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. వీటిని మరో 10రోజులలో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.ముత్యాలమ్మగుడి నుంచి దోబిఘాట్ వరకు, ఖమ్మం నుంచి కోదాడ తెల్దారుపల్లి, తెల్దారుపల్లి నుంచి రాముడి చెరువు, తెల్దారుపల్లి నుంచి తల్లంపాడు వరకు 10కోట్ల50లక్షల రూపాయలతో 4రోడ్లు మంజూరు చేసామన్నారు. 81లక్షల రూపాయలతో ఖమ్మం నుంచి తెల్దారుపల్లి వరకు రోడ్డు మరమ్మతుల పనులు పూర్తి చేసామన్నారు. 20లక్షల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అలాగే నీటిపారుదల శాఖ సంబంధిత రెండు పనులు పూర్తి చేశామని, తాగు నీటి ఇబ్బందులు పరిష్కరించామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల కోసం గతంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆర్థిక పరిస్థితి బాగు చేస్తూ నూతనంగా 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా, సన్న వడ్లకు క్వింటాళ్ల 500బోనస్, రైతు భరోసా 12వేల రూపాయలకు పెంపు, 21వేల కోట్ల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో 60 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని గత పాలకులు విస్మరించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కూడా పూర్తి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతీ పేదవాడికి విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. పేదలకు అండగా ఉండే ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, ఆర్‌డిఓ నరసింహారావు, తహసీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు , కాంగ్రెస్ యువజన నాయకుడుతమ్మినేని నవీన్, మండల అధ్యక్షుడు కళ్లె వెంకట్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, ఏటుకూరి సుధాకర్, యువజన సంఘం సభ్యుడు అంటి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# రీల్

## 14న గద్దర్ ఫిలిం అవార్డుల వేడుక




తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా సినిమా రంగానికి ఇస్తున్న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల ప్రధానోత్సవ వేడుక ఈనెల 14న హెచ్ఐసిసిలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గద్దర్ పేరుతో ఇస్తున్న ఈ ఫిలిం అవార్డులకు సంబంధించిన పబ్లిసిటీ పనులను ప్రభుత్వం మొదలు పెట్టింది. అక్కడక్కడా హోర్డింగ్స్ పెట్టడంతో పాటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ అవార్డుల లోగో ఎలా ఉంటుంది? అనే ఆసక్తి అందరిలోనూ ఉంది. ప్రభుత్వం చేస్తున్న పబ్లిసిటీని చూస్తుంటే ఫిలిం అవార్డు లోగోను కూడా ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఒకచేతిలో కంజెరి ఉన్న లోగోను ప్రభుత్వం జనం ముందుకు తీసుకువచ్చింది. 2024 ఏడాదికి సంబంధించినంత వరకు వ్యక్తిగత అవార్డుకు కూడా ఇస్తున్నారు. గడచిన పదేళ్లలో ఒక్కో ఏడాదికి మూడు సినిమాల చొప్పున అవార్డులు ఇవ్వనున్నారు. దీంతో పాటే ఆరు జాతీయ అవార్డులు కూడా ప్రధానం చేస్తారు. ఎన్టీఆర్ జాతీయ అవార్డు, పైడి జయరాజ్ జాతీయ అవార్డు, బి ఎన్ రెడ్డి అవార్డు, నాగిరెడ్డి అండ్ చక్రపాణి అవార్డు, కాంతారావు అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డులను కూడా బహుకరిస్తారు. ఈ అవార్డుల వేడులను సక్సెస్ ఫుల్‌గా జరపడానికి సినిమా పరిశ్రమలో ముఖ్యులందరికి ఇప్పటికే ఆహ్వాన పత్రికలు చేరినట్టు తెలుస్తోంది. చాలా మంది సినిమా ప్రముఖులు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు వేడుకకు హాజరు కానున్నట్టు సమాచారం.

## 'సర్దార్ 2' షూటింగ్ పూర్తి



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ 'సర్దార్ 2'తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ నిర్మిస్తోంది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టీం అందరూ సెట్ లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలని మేకర్స్ షేర్ చేశారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్‌జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు.సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యుజ్ స్కేల్ లోతెరకెక్కుతోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. సర్దార్ 2 చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్.విజయ్ వేలుకుట్టి ఎడిటర్. AP పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. ఎ వెంకటేష్ సహ నిర్మాతగా, ఎస్. లక్ష్మ ణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## అలీ క్లాప్‌తో 'చండీ దుర్గమా'



నూతన నటీనటులను పరిచయం చేస్తూ హెచ్‌బిజె క్రియేషన్స్, మదర్ అండ్ ఫాదర్ పిక్చర్స్ నిర్మిస్తున్న సినిమా 'చండీ దుర్గమా'. ఈ సినిమాకు జయశ్రీ వెల్ది నిర్మాత. ఒలి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మైను ఖాన్ ఎండీ దర్శకత్వం వహిస్తున్నారు. చండీ దుర్గమా సినిమా పూజా కార్యక్రమాలతో సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ కమెడియన్ అలీ ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. కెమెరా స్విచ్ ఆన్ నటుడు చిట్టి చేయగా, ముహూర్తపు సన్నివేశానికి రఘు కారుమంచి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ చండీ దుర్గమా సినిమా ప్రారంభోత్సవానికి అతిథిగా రావడం సంతోషంగా ఉంది. అమ్మవారి కథతో వస్తున్న సినిమా కాబట్టి మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా అని అన్నారు. డైరెక్టర్ మైను ఖాన్. ఎండీ. మాట్లాడుతూ అమ్మవారి నేపథ్యంగా సినిమాలు రూపొందడం లేదు. సౌందర్య అమ్మోరు, విజయశాంతి చండీ సినిమా తర్వాత అమ్మవారి కథతో సినిమా రాలేదు. ఇప్పటి ట్రెండ్‌కు అనుగుణంగా, ఈతరం ప్రేక్షకులకు నచ్చేలా డార్క్ థీమ్‌లో సరికొత్త స్క్రీన్ ప్లే, కాన్సెప్ట్‌తో చండీ దుర్గమా చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం థియేటర్స్‌కు ప్రేక్షకులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో థియేటర్స్‌కు ఆడియెన్స్‌ను రప్పించేలా చండీ దుర్గమా సినిమా మేకింగ్ ను డిజైన్ చేస్తున్నామని చెప్పారు. నిర్మాత జయశ్రీ వెల్ది మాట్లాడుతూ అమ్మవారి నేపథ్యంతో ఒక మంచి కథతో చండీ దుర్గమా సినిమాను నిర్మించే అవకా శం రావడం అదృష్టంగా భావిస్తున్నా. మన తెలుగు ఆడియెన్స్ అమ్మవారి నేపథ్యంగా వచ్చిన చిత్రాలను ఎంతో ఆదరించారు. మా సినిమాకు కూడా అలాంటి సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాం. హై క్వాలిటీ మేకిం గ్‌తో మంచి ప్యాడింగ్ ఆర్టిస్టులు, ప్రతిభ గల కొత్త నటీనటులతో చండీ దుర్గమా సినిమాను మీ ముందుకు తీసుకొస్తాం అన్నారు.త్వరలో నటీనటులను ప్రకటించనున్న ఈ చిత్రానికి ఎడిటింగ్, మ్యూజిక్ ఎంకే, సినిమాటోగ్రఫీ వైఎస్ కృష్ణ, కో ప్రొడ్యూసర్ ఒలి, ప్రొడ్యూసర్ జయ శ్రీ వెల్ది, రచన, దర్శకత్వం మైను ఖాన్ ఎండీ.

## అంచనాల్ని పెంచేసిన 'శంబాల' టీజర్



'ఈ విశ్వంలో అంతు పట్టని రహస్యాలెన్నో ఉన్నాయి.. సైన్స్‌కి సమాధానం దొరకనప్పుడు మూఢ నమ్మకం అంటుంది.. అదే సమాధానం దొరికితే అదే తన గొప్పదనం అంటుంది'. 'పంచ భూతాలని శాసిస్తోందంటే ఇది సాధారణమైనది కాదు. దీని ప్రభావం వల్ల మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఊహించలేం'. 'ఇప్పుడు ఈ రక్కసి క్రీడను ఆపాలంటే'.అంటూ వచ్చిన వాయిస్ ఓవర్.. చూపించిన డైలాగ్స్‌తో సినిమా రేంజ్ ఏంటో అందరికీ అర్థం అవుతోంది.అంటున్నాడు హీరో ఆది సాయికుమార్. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వశిస్తున్న శంబాలా టీజర్ సినిమాపై అంచనాలను పెంచిందని అది సాయికుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు.సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్. సినిమాను తెరకెక్కించారని చెప్పారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ వంటి వారు నటిస్తున్నారు. ప్రవీణ్ కే బంగారి అందించిన విజువల్స్, శ్రీచరణ్ పాకాల ఇచ్చిన బీజీఎం అన్నీ కూడా నెకట్స్ లెవెల్లో ఉన్నాయి. పాన్ ఇండియన్ మూవీకి సరిపడా సబ్జెక్ట్, కంటెంట్ ఉందని అర్థమవుతోంది. ఇందులో అంతరిక్షం నుంచి ఏదో ఒక అతీంద్రయ శక్తి ఉన్న ఉల్క, రాయి లాంటిది ఓ గ్రామంలో పడటం.. దాని ప్రభావంతో ఊర్లోని జనాలు చనిపోవడం, వింతగా ప్రవర్తించడం జరుగుతుంటుంది. దాన్ని ఛేదించేందుకు హీరో రావడం.. ఓ ఊరితో పోరాటం చేయడం వంటి ఆసక్తికరమైన అంశాలతో శంబాలను తెరకెక్కిస్తున్నామని దర్శకుడు యగందర్ చెప్పారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

## బ్రోకోడ్ చిత్రంతో హీరో, నిర్మాతగా రవి మోహన్



కోలీవుడ్‌లో రవి మోహన్‌కు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. ఇన్నేళ్లు హీరోగా అందరినీ మెప్పించిన రవి మోహన్ ఇకపై నిర్మాతగానూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఆయన హీరోగా, నిర్మాతగా రానున్న 'బ్రోకోడ్ చిత్రానికి సంబంధించిన అప్డేట్ ప్రకటించారు. 'డిక్కిలూనా', 'వడక్కుపట్టి రామసామి' వంటి చిత్రాలతో ప్రసిద్ధి చెందిన కార్తీక్ యోగి దర్శకత్వంలో ఈ 'బ్రోకోడ్ రానుంది. నలుగురు ప్రముఖ మహిళా నటులతో పాటు ప్రముఖ నటుడు ఎస్.జె. సూర్య కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్రను పోషించనున్నారు. నలుగురు ప్రముఖ మహిళా నటీనటుల గురించి అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానుంది. రవి మోహన్ ప్రస్తుతం సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్న 'పరాశక్తి', గణేష్ కె. బాబు డైరెక్ట్ చేస్తున్న 'కరాటే బాబు' చిత్రాలలో కూడా నటిస్తున్నారు.

## 20న '8వసంతాలు' విడుదల




నూతన నటి అనంతిక హీరోయిన్‌గా నటించిన వైవిధ్యమైన ప్రేమ కథ చిత్రం '8వసంతాలు'. ఫణింద్ర నరిశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో 'పరిచయమిలా' అనే పాటను ఈనెల 11న విడుదల చేయనున్నారు. మైత్రి మూవీస్ బ్యానర్ పై నిర్మితమవుతున్న ఈ సినిమాలో పాటను గేయ రచయిత వనమాలి రాయగా, హాయ్ నాన్న, ఖుషి ఫేం మలయాళ సంగీత దర్శకుడు హేశం అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. వైవిధ్యమైన ప్రేమ కథ చిత్రాంగి నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి జూన్ 20న థియేటర్లలో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు ఫణింద్ర నరిశెట్టి తెలిపారు. ఇతర పాత్రల్లో రవితేజ, హను రెడ్డి, కన్నా పసునూరి, సంజన, సమీర్ కోశోర్ , స్వరాజ్ రెబ్బప్రగాఢ తదితరులు నటిస్తున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన ప్రేమ కథ చిత్రాలన్నిటిలో ఇది భిన్నంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ప్రతి ఫ్రేమును ఎంతో అందంగా తీర్చిదిద్దానని పేర్కొన్నారు.

# గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ ప్రపంచానికి మార్గదర్శకం

### కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్‌తో ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఇది మార్గదర్శకంగా పనిచేయనుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్‌లోని ఐసిఏఆర్ భారత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐసిఎఆర్‌ఐఐఎంఆర్) ప్రాంగణంలో సోమవారం గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ (సిఒఈ) కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షే మ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌధరి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల పరిశోధన, అభివృద్ధి, శిక్షణ, ప్రాచుర్యం దిశగా కీలక మైలురాయిగా నిలవనుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, రైతులు ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయ రంగం బలోపేతానికి సహకరించాలి: మంత్రి తుమ్మల విజ్ఞప్తి**

తెలంగాణలో వ్యవసాయ రంగం బలోపేతానికి సహకారం అందించాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి భగీరథ్ చౌధరిలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.భద్రాద్రి కొత్తగూడెంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆయిల్ పామ్ రైతులకు ఆయిల్ పామ్ గెలల కనిష్ఠ మద్దతు ధర రూ.25 వేలు గా నిర్ణయించాలని కోరారు.ఆయిల్ పామ్ విత్తనాల సరఫరాదారుల ఎంప్యానెల్మెంట్ ని ఏర్పాటు చేయాలిలని, ఆయిల్ పామ్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (2014) లోని 13వ షెడ్యూల్ ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తుచేశారు. ఇందుకు సంబంధించి రూ.1823.20 కోట్ల బడ్జెట్‌తో ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పించామని, అయితే ఇప్పటివరకు కేవలం రూ.135 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం కనీస వసతులతో కొనసాగుతోందని, పూర్తిస్థాయిలో విద్యా, పరిశోధన, విస్తరణ సేవలు అందించేందుకు మిగతా నిధుల విడుదల అత్యవసరం అని కేంద్ర మంత్రికి వివరించారు. ఇందుకోసం రూ.100 కోట్లు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. అన్ని అంశాలకు సంబంధించి కేంద్ర మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు లేఖలను అందజేశారు.

# ఆర్‌టిసి ఉద్యమం ఉధృతం

### టిజిఎస్ ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం పట్ల ప్రభుత్వం టిజిఎస్ ఆర్‌టిసి కార్మికుల జెఎసి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 5వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల సమస్యలను ప్రస్తావించకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడం పట్ల జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కె. హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, బి.యాదగిరి ముక్తకంఠంతో ఖండించారు. ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి సోమవారం అజామాబాద్ పరిశ్రామిక వాడలోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ కార్మిక సమస్యలను పరిష్కరించకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేయడమే లక్ష్యంగా భవిష్యతు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అందులో భాగంగానే జెఎసిలో కలవని కార్మిక సంఘాలను కూడా తమలో భాగస్వామ్యం కావడానికి, ఉమ్మడి ఎజెండాతో, విశాల ఐక్యతతో ఒకే వేదిక ద్వారా ముందుకు పోవడానికి జూన్ 13వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అన్ని ఆర్‌టిసి కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. అందుకు సంబంధించిన ఆహ్వాన లేఖలను అన్ని సంఘాల నాయకులకు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల గురించి చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధులు జె. రాఘవులు, ఎన్. కమలాకర్ గౌడ్, నరేందర్, రమేష్, మజీద్, బి. పాపయ్య, కె.ఎస్. పాల్, బి. శ్రీనివాస్, బి.కె. మూర్తి పాల్గొన్నారు.

# కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

బియ్యం పంపిణీ చేసేవారు. ఈ నెలలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సాఫ్టవేర్‌తో కూడిన ఇ–పాస్ యంత్రాలు డీలర్లకు ఇచ్చారు. దీంతో బియ్యం పంపిణీకి ఒక్కో వ్యక్తికి సుమారు అరగంట సమయం పడుతోంది. గతంలో ఏనెలకు ఆ నెల కోటా బియ్యం మాత్రమే ఇచ్చేవారు. ఈ సారి ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. దీంతో ఉదయం 6 గంటల నుంచే బస్తా సంచులు పట్టుకొని క్యూలో నిల్చుంటున్న పరిస్థితి ఏర్పడింది. దాదాపు అన్ని రేషన్ షాపుల వద్ద నీడ సరిగా లేకపోవడంతో ఎండలో ఉండాల్సి వస్తోంది. ఈ నెలాఖరు వరకు బియ్యం తీసుకునే అవకాశం కల్పించినా లబ్ధిదారులు ముందుగా తీసుకునేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఆలస్యం అయితే బియ్యం ఉండవు అన్న ప్రచారంతో అందరూ ముందే తీసుకోవడానికి పోటీ పడుతున్నారు. దీంతో రేషన్ దుకాణాల వద్ద తీవ్రమైన రద్దీ ఉంటోంది. మరో వైపు మూడు నెలల బియ్యం కోటాను రేషన్ డీలర్లు డంప్ చేసుకునే స్థలం కూడా లేకపోవడంతో వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. షాపులో డంప్ చేసుకున్న బియ్యం పంపిణీ పూర్తి అయితేనే తిరిగి మిగిలిన బియ్యం కోటాను తెచ్చుకుంటున్నారు. కాగా, సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో షాపుల వద్ద జనం ఎగబడుతున్నారు.

### రేషన్ బియ్యం ఇవ్వడంలో ఆలస్యం

మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ఒక్కో లబ్ధిదారుడు ఇ–పాస్ యంత్రాలపై మూడుసార్లు వేలి ముద్ర వేయాల్సి వస్తోంది. ఇలా ప్రతిసారి రేషన్ కార్డు నెంబరు నమోదు చేయాల్సి ఉంటుంది. బియ్యం కూడా మూడు సార్లు తూకం వేయాల్సి వస్తుండటంతో పంపిణీకి సమయం ఎక్కువగా పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సన్న బియ్యం కష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సరిగా లేక సర్వర్ మొరాయిస్తోంది. ఒక్కొక్కరికి అర గంట సమయం పడుతుండటంతో గంటల తరబడి రేషన్ షాపుల ముందు నిల్చోలేక లబ్ధిదారులు విసుగుచెందుతున్నారు. రేషన్ బియ్యం కోసం పనులు వదులుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో పనులు వదులుకుని ఇబ్బంది అయినా తీసికొని వెళుతున్నారు. కొన్ని చోట్ల టోకెన్‌ల సిస్టం పెట్టి ఉదయం 20మందికి, సాయంత్రం 20 మందికి బియ్యం అందిస్తున్నారు. మూడు సార్లు వేలిముద్ర వేయడంతో చాలా సమయం పడుతోంది. సర్వర్ డౌన్ అయితే గంట వేచి ఉండాల్సి వస్తోంది.

### నెలాఖరు వరకూ బియ్యం పంపిణీ

మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీ చేపడుతుండటంతో ఇబ్బంది అవుతోందని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా సివిల్ సప్లై అధికారులు తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి తప్పకుండా బియ్యం అందజేస్తామని, రేషన్ దుకాణాల వద్ద వేచి ఉండకుండా టోకెన్లు అందజేసి క్రమ పద్ధతిలో సరుకులు అంద జేయాలని డీలర్లకు సూచించామని తెలిపారు. గతంలో ప్రతీ నెల 15 వరకు బియ్యం పంపిణీ చేసేవారని, కానీ, ఈసారి నెలాఖరు వరకు పంపిణీ చేస్తారని తెలిపారు

# అంతరిక్ష యాత్ర రేపు

(మొదటి పేజీ తరువాయి)

12వ తేదీన ఐఎస్ఎస్‌కు చేరుతుంది. అక్కడ సిబ్బంది మానవాళి కక్ష్య ప్రయోగశాలలో సుమారు 14 రోజుల పాటు గడుపుతారు. ఈ సుదీర్ఘ అంతరిక్ష బస యాదృచ్ఛికం కాదు. సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణంలో పరిశోధనా అవకాశాలను పెంచుకోవడానికి, శాస్త్రీయ లక్ష్యాలను సాధించడానికి ఉన్న అచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శనం.

ఇలావుంటే, ఆక్సియమ్ మిషన్ 4లోని నలుగురు సభ్యుల సిబ్బందిలో శుభాంశు శుక్లా ఒకడు. ఈ యాత్రకు సారథ్యం వహించే కమాండర్ పెగ్గీ విట్సన్‌కు, నాసా మాజీ వ్యోమగామిగా, ఆక్సియమ్ స్పేస్ మానవ అంతరిక్ష ప్రయాణ డైరెక్టర్‌గా అపారమైన అనుభవం ఉంది. ఆమె మూడుసార్లు ఐఎస్ఎస్‌కు వెళ్లింది. కాగా, శుభాంశు శుక్లా ఈ చారిత్రక ప్రాజెక్టులో భాగస్వామి కావడం విశేషం. ఐఎస్ఎస్‌కు వెళ్లే మొదటి భారతీయ వ్యోమగామి అతనే అవుతాడు. 1984లో దిగ్గజ రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్ళిన రెండవ భారతీయుడు కూడా అతనే. మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం గగన్‌యాన్‌కు ఒక కీలకమైన సోపానం. అంతరిక్షంలో దీర్ఘకాల కార్యకలాపాలు, సిబ్బంది శిక్షణ, నిజమైన కక్ష్య వాతావరణంలో ఆరోగ్య పర్యవేక్షణ వంటి అంశాలపై ఇస్రోకు అమూల్యమైన అంతర్దృష్టులను పొందడానికి ఇది సహాయపడుతుంది. శుభాంశు శుక్లా ఉనికి భారతదేశ స్వావలంబనను, ప్రపంచ అంతరిక్ష సమాజంలో మన దేశానికి పెరుగుతున్న అనుసంధానాన్ని స్పష్టంగా సూచిస్తుంది. ఇది భారతీయులందరికీ ఓ గొప్ప స్ఫూర్తినిస్తుంది. ఈ విశిష్ట సిబ్బందిలో హంగేరీకి చెందిన మిషన్ స్పెషలిస్ట్ టిబోర్ కాపు కూడా ఉన్నారు. ఆయన హంగేరియన్ అంట్రోహాబ్ కార్యక్రమం కింద ఎంపికైన వ్యోమగామి. ఆయన ప్రయాణం 40 సంవత్సరాలకు పైగా హంగేరీ ప్రభుత్వం మద్దతుతో జరుగుతున్న మొదటి మానవ అంతరిక్ష ప్రయాణాన్ని సూచిస్తుంది. అలాగే పోలాండ్‌కు చెందిన యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ) వ్యోమగామి మిషన్ స్పెషలిస్ట్ స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ విస్నియెవ్స్కీ కూడా ఉన్నారు. ఆయన ఇఎస్ఎ మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్తున్నారు. ఇది 1978 తర్వాత పోలాండ్ మొదటి సిబ్బంది యాత్ర. వారి సమష్టి స్ఫూర్తికి, జాతీయ గర్వానికి చిహ్నంగా, సిబ్బంది 'జాయ్' నితమ జీరోగ్రావిటీ ఇండికేటర్‌గా ఎంచుకున్నారు. ఇది వారి స్ఫూర్తికి నిదర్శనం.



# సాంకేతికత ఆధారంగా వార్తా సేకరణ ఉండాలి

### మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ఆధునిక సాంకేతిక యుగంలో వస్తున్న చరిత్రాత్మక మార్పులకు అనుగుణంగా సాంకేతిక ఆధారంగా తమ పాత్రికేయ వృత్తిలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణా మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నాంపల్లిలోని మీడియా అకాడమి భవనంలో మేడ్చల్ జిల్లా పాత్రికేయులకు సోమవారం పారంభమైన రెండు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తా సేకరణలో సామాజిక ప్రభావం వంటి పలు అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని, సాంకేతికను సమగ్రంగా తెల్సుకొంటేనే తమ వృత్తిని సులభంగా నెరవేర్చ గలుగుతారన్నారు. పాఠకుల వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలని, తెలుగు వార్తలను సులువైన భాషలో రాయగలగాలని ఆయన సూచించారు. ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి సమగ్రంగా వివరించారు. యూట్యూబ్ లాంటి సోషల్ మీడియా రంగంలో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజలకు చేరుతున్నాయన్నారు. సీనియర్ పాత్రికేయులు మార్కండేయ మాట్లాడుతూ నూతన సాంకేతికను వినియోగించుకొని పాఠకులను ఆకర్షించే విధంగా వార్తలను సేకరించాలన్నారు. సీనియర్ జర్నలిస్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నేర వార్తల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వీటికి సంంధించి చట్టాలపై ముందస్తుగా అవగాహన ఉండాలని, ఈ విషయంలో పాత్రికేయులు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. నేర వార్తలు సమీకరించుకొనే ముం దు నిజ నిర్ధారణ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియా అకాడమి సెక్రటరి ఎన్.వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా పాత్రికేయులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com